నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015
11 Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం


ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు
సిజెఐ సూర్యకాంత్ హితవు 05

శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం
కార్మికుల హక్కులు సాధించడంలో కీలక పాత్ర 03

సంపుటి 28, సంచిక: 201 | సోమవారం | 12-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



ఢిల్లీలో సైబర్ నేరగాళ్లకు చిక్కిన వృద్ధ దంపతులు 17 రోజులు డిజిటల్ అరెస్టులో.. దాచుకున్న సొమ్ము పోగొట్టుకున్న వైనం

## రూ.15 కోట్లు హుష్‌కాకి

**న్యూఢిల్లీ :** దేశంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వృద్ధులు, మహిళలు, పెన్షనర్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. తెలంగాణలో శనివారం వెలుగులోకి వచ్చిన మాజీ ఐపిఎస్ అధికారి భార్య నుంచి రూ. 2.58 కోట్లు కొల్లగొట్టిన ఘటన మరవక ముందే తరువాయి 12లో




## 'గ్రోక్' అసభ్య కంటెంట్... 600 ఖాతాలు డిలీట్

3,500 అశ్లీల పోస్టులను బ్లాక్

కేంద్ర సర్కార్ ఆదేశాలతో 'ఎక్స్' దిద్దుబాటు చర్యలు

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా వేదికలో అసభ్యకరమైన, అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో 'ఎక్స్' దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తన ప్లాట్‌ఫామ్‌లో జరిగిన తప్పులను బాహాటంగా అంగీకరించింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ సంస్థ, తన ఎఐ టూల్ 'గ్రోక్' ద్వారా సృష్టిస్తున్న తరువాయి 12లో



## సైబర్ నేరాలు 18 మంది అరెస్ట్

ఆరుగురి ఖాతాల్లో నుంచి రూ. 547 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎస్‌పి సూచన

ప్రజాపక్షం/పెనుబల్లి

రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్త మైంది. దాడులకు పాల్పడుతుండేవారికి ఉక్కుపాదం మోపు తోంది. తాజాగా 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వివరా లను ఖమ్మం జిల్లా ఎస్‌పి సునీల్ దత్ ఆదివారం మీడియాకు వెల్ల డించారు. గత సంవత్సరం 2025 డిసెంబర్ 24న సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపిన తరువాయి 2లో




# ప్రతి సోమవారం ఇందిరమ్మ నిధులు

- రాజకీయాలకతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు
- పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని పాలన
- వారి జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి
- సింగరేణి కార్మికుల వలే రాష్ట్రంలో ఐదులక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల బీమా
- గత బిఆర్ఎస్ పాలనలో స్కాములు, దోపిడీలు తప్ప చేసిందేమీ లేదు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధ్వజం
- సింగరేణి కార్మికులకు త్వరలో పట్టాలిస్తాం : మంత్రి పొంగులేటి
- రామగుండంలో రూ.175.47 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/గోదావరిఖని

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని పాలన కొనసాగిస్తున్నామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకాన మీతో ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం అభి వృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం డిప్యూటీ సిఎం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌లతో కలిసి పెద్దపల్లి జిల్లా రామగుండంలో పర్య టించారు. రూ.175.47 కోట్ల అభివృద్ధి పనులకు, రూ.6.5 కోట్ల రహదారి విస్తరణ పనులకు డిప్యూటి సిఎం, మంత్రులు శంకు స్థాపనలు చేశారు. 633 మంది లబ్ధిదారు లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 494 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రాష్ట్రంలోనే మొదటిసారిగా 53 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. అనంతరం గోదావరిఖనిలో జరిగిన బహిరంగసభలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ, గత పాలనలో ప్రజల కష్టాలను చూసి తాను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో నిర్మించిన ఇంది రమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తున్నా మన్నారు. ప్రతి సోమవారం నిధులు విడు దల చేస్తున్నామన్నారు. 96 లక్షల కుటుం బాలకు తరువాయి 2లో

## ఎస్ఎల్‌బిసి సొరంగం పనుల్లో ఆధునిక పరిజ్ఞానం

రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సొరంగం తవ్వకంపై అధికారులతో సమీక్ష




ప్రజాపక్షం/హైదరాబాద్

'ఎస్ఎల్‌బిసి' నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసు కోవా లని, సొరంగం తవ్వకాలకు ఆధునిక పరిజ్ఞానాన్ని విని యోగిస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కు మార్ రెడ్డి తెలిపారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి 25 శాతం అదనపు జీతాలు ఇవ్వాలని, సొరంగ నిర్మాణ పనులపైన ప్రతి సోమవారం తరువాయి 2లో



## చెక్‌డ్యాంలో మునిగి తల్లి, ఇద్దరు పిల్లలు మృతి 03

సిద్దిపేట జిల్లా కస్తూరిపల్లిలో విషాదం

## నేడు ఖమ్మంలో కవి సమ్మేళనం

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత్ కమ్యూనిస్టు పార్టీ శతవసంతాలను పురస్కరించుకొని ఖమ్మం పట్టణంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'కవి సమ్మేళన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ,ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. సిపిఐ శత వసం తాలు పూర్తి చేసుకున్నందున ఈనెల 18న ఖమ్మం పట్టణంలో లక్ష లాది మందితో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగానే ఖమ్మం పట్టణం, డి పి అర్ పి భవన్‌లో కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని ఆయన ఆదివారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు.

## సహజ వనరులు, డాలర్లపై ప్రజలదే పెత్తనం

- ప్రైవేటు పెట్టుబడికి, అగ్రరాజ్యాలకు అవకాశం ఇవ్వొద్దు
- ఆధిపత్యం, నియంతృత్వానికి వ్యతిరేకంగా చిన్న దేశాలు ఏకమవ్వాలి
- ఇస్కఫ్- తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభ పిలుపు




ప్రజాపక్షం/హైదరాబాద్

ఆయా దేశాలలోని చమురు వనరులు, డాలర్లపైన అగ్ర రాజ్యాల ఆధిపత్యం, నియంతృత్వం కొనసాగదని, దీనికి వ్యతిరేకంగా చిన్న దేశాలన్నీ ఏకమవ్వాల్సిన అవ సరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర వినియోగదా రుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్, హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. సహజ వనరులు, డాలర్లపైన ప్రజలదే పెత్తనమని,ప్రైవేటు, అగ్ర రాజ్యాలకు పెత్తనం లేదని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతికి దేశాల మధ్య సహకారం అత్యవసరమని, ప్రపంచీకరణ నేపథ్యంలో ఒకరి సహకారం లేకుండా ఏ దేశం ఒంటరిగా మనుగడ సాగించలేదని, పరస్పర జ్ఞాన మార్పిడి, వనరుల తరువాయి 12లో

# మహానగరం ఖాళీ

- జనం లేక నిర్మానుష్యంగా హైదరాబాద్
- బోసిపోతున్న రహదారులు
- సంక్రాంతికి పల్లెబాట పట్టిన పట్నం ప్రజలు
- టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు
- బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ

ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరవాసులు పల్లెకు పయనమయ్యారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, ఐటీ కారిడార్లు, వాణిజ్య ప్రాంతాలు ప్రస్తుతం జనాలు లేని సిటీగా, ట్రాఫిక్ లేని రహదారులతో నిర్మాను ష్యంగా మారిపోయింది. ఉద్యోగాలు, ఉపాధి, విద్య కోసం నగరానికి వచ్చి స్థిరపడిన లక్షలాది మంది పల్లె పిలుపుకు స్పందిస్తూ తమ కుటుంబీ కులు, బంధువులు, స్నేహితులతో సంక్రాంతి పండుగకు సందడి చేయడానికి స్వగ్రామాల బాట పట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ వాహనాలతో కిటకిటలాడే ఔటర్ రింగ్ రోడ్, హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, ఎల్బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ లేకుండా రహదారులు విస్తరించి కనిపిస్తు న్నాయి. సిగ్నల్స్ వద్ద వాహనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తరువాయి 2లో



## భూముల రిజిస్ట్రేషన్ సొమ్ము పక్కదారి

ధరణి పోర్టల్‌లో ఆడిటింగ్ విధానం లేకపోవడం వల్లే అక్రమాలు

గత ఐదేళ్ల లావాదేవీలపై నిర్వహించిన ఆడిట్‌లో 4,800 లోపాలు గుర్తించాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగానికి పాల్ప డిన వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహ రించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. గత తరువాయి 12లో




## సైనిక దాడులకు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తాం

- అమెరికా- ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక
- అమెరికా వాణిజ్య కేంద్రాలు, సైనిక స్థావరాలపై న్యాయబద్ధమైన దాడులు చేస్తామని ప్రకటన
- తాము కేవలం ప్రతిస్పందనకు మాత్రమే పరిమితం కాబోమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాకర్ క్వాలిబాఫ్ ప్రకటన

**వాషింగ్టన్:** తమదేశ అంతర్గత ప్రజాందోళ నలో జోక్యం చేసుకుని సైనిక దాడులకు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తామని అమెరి కా-ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. అమెరికా వాణిజ్య కేంద్రాలు, సైనిక స్థావరాలపై న్యాయబద్ధ మైన దాడులు చేస్తామని ఇరాన్ పార్ల మెంటు స్పీకర్ మహ్మద్ బాకర్ క్వాలిబాఫ్ పేర్కొన్నారు. అమెరికా దాడి చేశాక కేవలం ప్రతిస్పందనకు మాత్రమే తాము పరిమితం కాబోమని చెప్పారు. ఇరాన్ పెద్ద సంక్షో భంలో ఉందని, పరిస్థితులు చేయిజారితే అయతొల్లా అలీ ఖమేని రష్యాకు పారిపో యేందుకు తరువాయి 2లో

# సిరియాలో అమెరికా ‘ఆపరేషన్ హకాయ్’

## 35 ఐఎస్ ఉగ్రవాద కేంద్రాలపై భారీ దాడులు



**పెంటగాన్ :** సిరియాలో ఐఎస్ఐఎస్ 35 ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు భారీ ఎత్తున దాడులు చేశాయి. దాదాపు 90 లక్ష్యాలపై గురిపెట్టి 20 కంటే ఎక్కువ యుద్ధ విమానాలను ఉపయోగించి దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఆదివారం ప్రకటించింది. సిరియాలో డిసెంబరు 13వ తేదీన అమెరికా సైనిక స్థావరాలపై ఐఎస్ ఉగ్రవాదులు చేసిన దాడులకు ప్రతీకారంగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ‘‘ఆపరేషన్ హకాయ్’’ నిర్వహించినట్లు ‘సెంట్‌కామ్’ ఎక్స్ వేదికగా ఆదివారం పోస్టింగ్ పెట్టింది. ఎఫ్–15 ఇఎస్, ఎ–10ఎస్,ఎసి–130 జెఎస్, ఎంక్యూ–9ఎస్, జోర్డానియన్ ఎఫ్–16 యుద్ధ విమానాలు ఈ హకాయ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. తాము కూడా ఈ ఆపరేషన్‌లో భాగం పంచుకున్నట్లు జోర్డాన్ ప్రభుత్వం ప్రకటించింది. పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా మిత్రదేశాల సంరక్షణకోసం, అమెరికా దళాలను రక్షించుకోవడంకోసం, ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు ఈ దాడులు చేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఐతే దాడులు ఎక్కడ జరిగాయి? ఎంతమంది ఉగ్రవాదులు మరణించారు? అనే వివరాలు ఇంకా అధికారికంగా తెలియాల్సి ఉంది. ఉగ్రవాదాన్ని సహించం, ఎడతెగని అవిశ్రాంత దాడులు చేస్తాం అని అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ సోషల్ మీడియాద్వారా ప్రకటించారు. సిరియాలోని పాల్మిరా ప్రాంతంలో ఐఎస్ ఉగ్రవాది ఒకరు ఇద్దరు అమెరికా సైనికులను, ఒక అమెరికా పౌరుణ్ణి, ఒక అనువాదకుణ్ణి కాల్చి చంపిన తర్వాత గత ఏడాది డిసెంబరులో మొదటిసారి అమెరికా ‘‘ఆపరేషన్ హకాయ్’ చేపట్టింది. ఆనాడు డిసెంబరు 20,28 తేదీలలో చేసిన దాడుల్లో 25 మంది ఐఎస్ ఉగ్రవాదులు హతులయ్యారు. ‘‘మా సందేశం చాలా స్పష్టంగాబలంగా ఉంది, మీరు గనుక మా యుద్ధ విమానాలకు హాని కలగచేసే ప్రయత్నం చేస్తే ఈ ప్రపంచంలో మీరు దాక్కుని ఉన్నాసరే, వెతికి వేటాడి మిమ్మల్ని చంపుతాం, న్యాయం నుండి తప్పించుకోవడానికి మీరు ఎంత కష్టపడినా ఎన్ని కఠినమైన చర్యలు తీసుకున్నాగానీ ప్రయోజనం లేదు’’ అని సెంట్‌కామ్ ఐఎస్ ఉగ్రవాదులకు హెచ్చరిక చేసింది.

# గ్రీన్‌లాండ్‌పై దండయాత్ర ప్రణాళికకు ఆదేశం

## సైనిక కమాండర్ల అయిష్టత!



**వాషింగ్టన్:** వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకునేందుకు చాలా తీవ్రమైన నిర్ణయం తీసుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆ దీవిపైదండయాత్రకు తగిన వ్యూహాలు రూపొందించాల్సిందిగా తన ప్రత్యేక దళాల సైనిక కమాండర్లకు ఆదేశమిచ్చారు. ఐతే ఈ దీవిపై దండయాత్రకు గల చట్టబద్ధత, సాధ్యాసాధ్యాలల విషయంపై సైనిక అధికారులు సందేహంలో పడ్డారు. గ్రీన్‌లాండ్‌పై దండయాత్ర ఆలోచనపై సీనియర్ సైనిక అధికారులు అంత నమ్మకంతో లేరని వార్తలు వెల్లడిస్తున్నాయి. గ్రీన్‌లాండ్స్ ప్రాంతాన్ని రష్యా,చైనా దేశాలు తమ అధీనంలోకి తీసుకోకముందుగానే రాజకీయ సలహాదారుడు స్టీఫెన్ మిల్లెర్ నాయకత్వంలో ప్రపంచంలో అతిపెద్దదైన ఆ దీవిని తామే స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ చాలా ఆత్రుత ప్రదర్శిస్తున్నారని ‘దమెయిల్’ పత్రిక ఒక కథనం ప్రచురించింది. అదే విధంగా దండయాత్ర చేసేందుకు జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్‌కమాండర్ (జెఎస్‌ఓసి)కు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలియజేసింది. కొత్త సంవత్సరంలో మూడోరోజునే వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను చాలా విజయవంతంగా న్యూయార్క్‌కు కిడ్నాప్ చేసి తీసుకుపోయిన విజయగర్వంతో ఉన్న ట్రంప్ ఆ మరుక్షణం నుండి గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి తరచు కలవరిస్తున్నారు. వైట్‌హౌస్‌లో గడచిన శుక్రవారం వెనిజులాలో పెట్టుబడులకు సంబంధించి చమురు రంగం ఎగ్జిక్యూటివ్‌లతో జరిగిన సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, ఎవరికి నచ్చినా నచ్చకపోయినా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి తాము ఏదో ఒకటి చేయబోతున్నామని, ఎందుకంటే చైనా, రష్యా కంటే ముందుగానే ఆ ప్రాంతం తమ అధీనంలోకి రావాలని అన్నారు. రష్యా లేదా చైనాలను పొరుగు దేశంగా గుర్తించి సహజీవనం చేయడానికి అమెరికా సిద్ధంగా లేదని, దానిని సహించేది లేదని ఆయన అన్నారు. ‘‘డెన్మార్ భయాందోళన గురించి కూడా ఆయన ప్రస్తావిస్తూ, ‘‘మీకు (డెన్మార్క్‌కు) నేను చాలా పెద్ద అభిమానిని, మీకు చెప్పాల్సింది ఏమిటంటే, మీకు తెలుసా, డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజలు నాతో చాలా మంచిగా ఉంటారు, 500 సంవత్సరాలక్రితం మీరు అక్కడ పడవ దిగి వెళ్ళి మనుగడ ప్రారంభించారంటే, ఆ భూభాగం మీదని కాదు’’ అన్నారు. ముఖ్యంగా 1951 ఒప్పందం ప్రకారం అక్కడ సైనిక ఉనికి ఉన్నప్పటికీ, ఆ దీవిలో నివసిస్తున్న 57,000 మంది ప్రజల ఉనికి గురించి ట్రంప్ ముఖ్యంగా మాట్లాడుతున్నారు.

## ట్రంప్‌కు బహుమతి బదిలీకి నోబెల్ కమిటీ తిరస్కృతి



**వాషింగ్టన్ :** తనకు లభించిన నోబెల్ బహుమతిని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు షేర్ చేస్తానని వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు, శాంతి బహుమతి గ్రహీత–2025 మారియా కొరినా మచాడో చేసిన ప్రకటనను నోబెల్ కమిటీ తిరస్కరించింది. ఈ విధంగా ఒకరికి వచ్చిన నోబెల్ బహుమతిని మరొకరికి షేర్ చేయడం సాధ్యంకాని విషయమని, అందుకు అంగీకారం లేదని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది. ఒకసారి నోబెల్ బహుమతిని ఒకరికి ఇచ్చిన తర్వాత దానిని రద్దు చేయడం లేదా బదిలీ చేయడం లేదా మరొకరికి పంచి ఇవ్వడం సాధ్యంకాని విషయమని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది. తాము తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయమని, అది ఎప్పటికీ అమలులో ఉంటుందని తెలియజేసింది. వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మచాడో భద్రతా కారణాల రీత్యా వెనిజులా నుండి వెళ్ళిపోయి మరోదేశంలో తలదాచుకుంటున్నారు. ఇటీవల నికొలస్ మదురోను కిడ్నాప్ చేయడాన్ని ఆమె సమర్థించారు. తాను తిరిగి వెనిజులాకు త్వరలో వెళతానన్నారు. వచ్చేవారంలో ఆమె అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో సమావేశం కానున్నారు.

# అమెరికాలో వేలాది మంది నిరసన ప్రదర్శన



**మిన్నెపొలిస్ :** అమెరికా మిన్నెపొలిస్‌లో వరుసగా రెండోరోజు ఆదివారం కూడా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు జరిపారు. అమెరికా వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో కూడా ఈ ప్రదర్శనలు జరిగాయి. గడచిన బుధవారం (జనవరి 7) మిన్నెపొలిస్‌లో ఐసిఇ (ఇమ్మిగ్రేషన్,కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) భద్రతా ఏజంట్ కారులో ఉన్న ఒక మహిళను అతి సమీపం నుండి కాల్చి చంపిన సంఘటనకు వ్యతిరేకంగా ఈ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. భరించలేనంతగా చలి వాతావరణం ఉన్నప్పటికీ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ఆస్టిన్, సీటెల్, మిన్నెపోలిస్, లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్ సహా అమెరికాలోని ఇతర ప్రాంతాలలో కూడా ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. గట్టి మంచు గడ్డలను కొందరు పోలీసులపైకి విసిరారు. దీంతో ఒక అధికారి గాయపడ్డారు. మిన్నెపొలిస్ కానోపీ హోటల్ వద్ద వందలమంది గుమిగూడారు. వారంతా డ్రమ్స్ వాయిస్తూ, ఈలలు మోగిస్తూ నిరసనలు తెలియజేశారు. పోలీసులు వారిని చట్టవిరుద్ధమైన గుంపుగా ప్రకటించింది. కానీ అనేకమంది పోలీసులకు దొరక్కుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిన్నెపొలిస్ మేయర్ జాకబ్ ఫ్రే పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఈ విధంగా వేలాదిమంది వీధుల్లోకి వచ్చిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడంపట్ల హర్షం ప్రకటించారు. చాలా శాంతియుత పద్ధతులలో నిరసన ప్రదర్శనలు జరిగాయన్నారు.
అమెరికా కాంగ్రెస్‌లో డె మొక్రటిక్ పార్టీకి చెందిన మహిళా సభ్యులు ఇల్హాన్ ఒమర్, కెల్లీ మోరిసన్, అంగీ క్రెయిగ్ మాట్లాడుతూ, చట్టసభ్యులుగా తాము మిన్నెపొలిస్‌లో పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించకుండా హోంలాండ్ సెక్యూరిటీ, ఐసిఇ అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. పోలీసుల పట్ల దుందుడుకు దాడియత్నాలకు పాల్పడిన నిరసన ప్రదర్శకులలో 30 మందిని గడచిన రెండు రోజులుగా అరెస్టు చేశారు. వలస ప్రజల ఏరివేత చర్యల్లో భాగంగా ఐసిఇ ఏజంట్లు మిన్నెపొలిస్‌లో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఒక మహిళ కారులో వెళుతుండగా, ఐసిఇ ఏజంటు విజ్ఞప్తికి స్పందించకపోవడంతో ఆమెకారుపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రెనీ నికోల్ గుడ్ (37) మరణించారు. ఆత్మరక్షణకోసమే ఆ అధికారి మహిళపై కాల్పులు జరిపారని ట్రంప్ పాలనాయంత్రాంగం సమర్థించింది.

## గ్రీన్‌లాండ్‌లో యూరోపియన్ యూనియన్ సైన్యం!



గ్రీన్‌లాండ్‌లో యూరోపియన్ యూనియన్ సైన్యాన్ని మోహరించే ఆలోచనలో ఉంది! ఈ విషయంపై బ్రిటన్ ప్రభుత్వం మిత్రదేశాలతో చర్చలు ప్రారంభించింది. చైనా, రష్యాలు గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకోకముందుగానే ఆ దీవిలో సైన్యాన్ని మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినవిధంగానే ఆయనకు ఊరట కలిగించేందుకు యూ రోపియన్ యూనియన్ సేనలను మోహరించుకుని కూర్చోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తోందని విశ్లేషకులు ఈ పరిణామాలను అంచనావేశారు. ఇటీవల బ్రిటన్ అధికారులు యూరప్‌లో జర్మనీ, ఫ్రాన్స్ సహా ముఖ్యమైన మిత్రదేశాలతో సమావేశాలు జరిపారు. ఈ మేరకు రష్యా–చైనాలు దుస్సాహసం చేయకుండా మిత్రసేనల సైన్యాలు, యుద్ధనౌకలు,యుద్ధ విమానాలను తరలిస్తారని అంచనావేస్తున్నారు. బ్రిటన్ తన ప్రయత్నాలు కొనసాగిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# దెబ్బకు దెబ్బ తీస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నిస్తున్నారని, గతంలో లేనివిధంగా ఇరాన్ ప్రజలు స్వేచ్ఛకోసం పోరాడుతున్నారని, వారికి మద్దతు ఇస్తామని ట్రంప్ చేసిన ప్రకటనకు క్వాలిబాఫ్ పైవిధంగా హెచ్చరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా 15 రోజులుగా కొనసాగుతున్న హింసాత్మక ప్రదర్శనలు, ధరల పెరుగుదల, కరెన్సీ విలువ క్షీణత, వ్యవస్థను కుప్పకూల్చేందుకు సిఐఎ రహస్య కార్యకలాపాలు, అమెరికా ప్రత్యక్ష హెచ్చరికలపై ఇరాన్ పార్లమెంటు ఆదివారం చర్చించింది. స్పీకర్ మహ్మద్ బాకర్ క్వాలిబాఫ్ సభలో మాట్లాడుతూ, దాడియత్నాలు చేస్తే పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను, ఇజ్రాయెల్ సైనిక కేంద్రాలను దెబ్బతీస్తామన్నారు. ఇరాన్‌పై సైనిక చర్యలకు పాల్పడినా లేదా ప్రాంతాలను ఆక్రమించినా అమెరికా సైన్యాన్ని, నావికాదళ కేంద్రాలను చట్టబద్ధమైన దాడులకు లక్ష్యాలుగా ఎంచుకుంటామని హెచ్చరించారు. ‘‘ఇరాన్‌లో హింసాకాండకు పాల్పడి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేవారికి ఉరిశిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. దేశ ఆస్తులను, మౌలిక సదుపాయాలను సంరక్షించడానికి తీవ్ర అణచివేతకు, నిర్ణయాత్మకమైన చర్యలకు సిద్ధంగా ఉందని రివల్యూషనరీ ఆర్మీ కూడా ఒక హెచ్చరిక చేసింది. ఇరాన్‌లో రెండు వారాలుగా 115 మంది పైగా మరణించినట్లు చెబుతున్నప్పటికీ ఆసుపత్రివైద్యులు చెబుతున్న అనధికార సమాచారం ప్రకారం మృతులసంఖ్య 200కు పైగా ఉంది.

ఇరాన్‌పై దాడి చేసే విషయంపై గడచిన శనివారం అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో,ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఫోన్‌లో సంభాషణలు చేసిన తర్వాత పరిస్థితులు తారాస్థాయికి చేరాయి. ఇరాన్‌లో మరోసారి అమెరికా సైనికంగా జోక్యం చేసుకుంటుందనే ఉద్దేశంతోపాటు ఇరాన్‌లో దశాబ్దాలలో ఎన్నడూలేనంత తీవ్ర హింసాకాండ జరుగుతున్నందువల్ల ముందు జాగ్రత్త చర్యగా ఇజ్రాయెల్ తన సైన్యాలను హై ఎలర్ట్‌లో ఉంచి జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆ ప్రభుత్వాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, భవిష్యత్తుకోసం కీలకమైన పోరాటం చేస్తున్నారని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది.

2022–23లో మాషా అమిని లాకప్ డెత్ తర్వాత ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోలేక ఇరాన్‌దేశవ్యాప్తంగా అనేక రోజులపాటు హింసాత్మక ప్రదర్శనలు, తీవ్ర ఘర్షణలు,ప్రజాహింస చెలరేగడం ఇరాన్‌లో మళ్ళీ ఇదే. ఇరాన్‌లో డిసెంబరు 28న ప్రారంభమైన అల్లర్లు కొత్త ప్రాంతాలకు విస్తరించి కొనసాగుతున్నాయి. గడచిన 50 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ సదుపాయాన్ని రద్దుచేసి సమాచార ప్రచారం జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. కొందరు ఉగ్రవాదులు అమెరికాను సంతృప్తిపరచడంకోసం సాయుధ ఉగ్రవాదులు హింసకు పాల్పడుతున్నారని ఇరాన్ సర్వాధినేత ఆయతొల్లా అలీ ఖమేనీ విమర్శించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి కూడా ఇరాన్ ఫిర్యాదు చేసింది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ దేశ రాయబారి అమీర్ సయీద్ ఇరవానీ భద్రతామండలికి రాసిన లేఖలో అమెరికా బెదిరింపు ధోరణి ప్రపంచదేశాలకు ప్రమాదంగా మారిందని,ఇజ్రాయెల్‌తో కలిసి హింసను ప్రేరేపిస్తోందని పేర్కొన్నారు.

కాగా తండ్రి మరణానంతరం తనను తాను ఇరాన్ యువరాజుగా ప్రకటించుకున్న రెజ్లా పహ్లేనీ (60) అమెరికా మద్దతుతో ఇరాన్‌కు తిరిగివెళ్ళే ప్రయత్నాల్లో ఉన్నారు. ఖొమైనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడాలని ఇప్పటికే ఆయన అనేకసార్లు ప్రజలకు పిలుపు ఇచ్చారు.

### ఇరాన్‌లోని 100 నగరాలు, టౌన్లలో కొనసాగుతున్న హింస

ఇరాన్‌లో సైన్యం ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ ఆదివారం 15వ రోజు కూడా వీధుల్లో ప్రజా ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఇంటర్నెట్ సర్వీసులను ప్రభుత్వం 50 గంటలుపైగా స్తంభింపజేసినప్పటికీ కొందరు స్టార్‌లింక్ సేవలను ఉపయోగించుకుంటున్నారు. ఇరాన్‌లోని అన్ని రాష్ట్రాలలో 100 నగరాలు, పట్టణాలలో ప్రజా నిరసనలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రదర్శకులపై ఉక్కుపాదం మోపిందని, ప్రభుత్వ చర్యల్లో వందలమంది మరణించారని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ అటార్నీ జనరల్ కూడా తాజా హెచ్చరిక చేస్తూ, నిరసనలకు పాల్పడినవారిని దైవశత్రువులుగా భావించి మరణశిక్షలు విధిస్తామని ప్రకటించారు. గడచిన మూడు రోజులుగా భద్రతా దళాలు, రివల్యూషనరీ గార్డ్స్‌కు ప్రదర్శకులకు మధ్య ఘర్షణలు ఉద్ధృతరూపం దాల్చాయి. ఈ ఘర్షణల్లో అనేక మంది మరణించారు. 15 మంది భద్రతా సిబ్బంది, మరో 100 మంది ప్రజలు ప్రజాందోళనలో మరణించినట్లు అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఇరాన్‌లోని మానవహక్కుల సంఘం (హెచ్‌ఆర్ఎఎన్ఎ) ప్రకటించింది. రసాత్ సిటీ ఆసుపత్రికి శుక్రవారం రాత్రి 75 మృతదేహాలను తీసుకువచ్చిపెట్టారని వీడియోలు వెరిఫై చేసిన బిబిసి ప్రతినిధి ప్రకటించారు.

# మహానగరం ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడం నగరవాసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### పండుగ నిశ్శబ్దాన్ని ఆస్వాదిస్తున్న పట్నం..

సంక్రాంతి అంటే పల్లెల పండుగ. కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు, కనుమ సంబరాలు, గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించేందుకు హైదరాబాద్‌లో నివసించే వారు పెద్ద ఎత్తున గ్రామాల బాట పట్టారు. ఈ ప్రభావంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు గత కొన్ని రోజులుగా కిక్కిరిసిపోయాయి. ఇక నగరంలో మాత్రం వ్యతిరేక దృశ్యం కనిపిస్తోంది. ఐటీ సంస్థలకు వారంతాపు సెలవులు, విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో హాస్టళ్లు, పిజిలు ఖాళీ అయ్యాయి. సాధారణంగా రద్దీగా ఉండే ఫుడ్ పాయింట్లు, టీ స్టాల్స్ కూడా కస్టమర్ల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో సతమతమయ్యే ట్రాఫిక్ పోలీసులకు మాత్రం ఇది ఊరట కలిగించే పరిణామం. ప్రత్యేక ఏర్పాట్లు చేసినా, వాహనాల రాకపోకలు తక్కువగా ఉండటంతో విధులు సులభంగా మారాయి. సంక్రాంతి సంబరాలు ముగిసిన అనంతరం నగరం మళ్లీ తన అసలు రూపాన్ని సంతరించుకోనుంది. ప్రస్తుతం మాత్రం పల్లె సంబరాల ప్రభావంతో హైదరాబాద్ నగరం పండుగ నిశ్శబ్దాన్ని ఆస్వాదిస్తోంది.

### కిటకిటలాడుతున్న రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు..

పట్నం వాసులు తమ సొంతూళ్లకు పయనమయ్యేందుకు బయలుదేరడంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని టిజిఎస్‌ఆర్‌టిసి 6,431, ఎపిఎస్‌ఆర్‌టిసి 600 ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అలాగే సౌత్ సెంట్రల్ రైల్వే కూడా అదనపు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. కానీ, అవి కూడా సరిపోక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు వచ్చిన క్షణాల్లోనే నిండిపోవడంతో సీట్ల కోసం యుద్ధమే చేయవలసి వస్తుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారీతినా చార్జీలు వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

### విమాన టికెట్ల ధరలకు రెక్కలు..

ప్రయాణికుల రద్దీని చూసి విమానయాన సంస్థలూ ఈ నెల 11 నుంచి 14 వరకు టికెట్ ధరలను ఒక్కసారిగా మూడింతలు పెంచేశాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖ, తిరుపతికి వెళ్లే విమానాల టికెట్ల ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో విజయవాడ, వైజాగ్‌లకు రూ. 2,500 నుంచి రూ. 3,500 మధ్య ఉంటుండగా, ఆదివారం ధర రూ. 9వేలు ఉంది. తిరుగు ప్రయాణంలోనూ ఇదే తరహాలో రేట్లు కనిపిస్తున్నాయి.

### ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ నరకం..

హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా విజయవాడ వైపు వెళ్లే పంతంగి టోల్ ప్లాజా, వరంగల్ వైపు వెళ్లే రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తమ ప్రయాణ సమయాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# 18 మంది అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

విఎం బంజర పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 18మందిని అరెస్టు చేయడం జరిగిందని అలాగే మరో ఆరుగురు పరారీలో ఉన్నారని, వీరి ద్వారా సుమారు 547 కోట్ల రూపాయలు సైబర్ నేరాలకు పారిపోయినట్లు గుర్తించడం జరిగిందని సిపి తెలిపారు. నిందితులలో ప్రధానంగా పోట్రు కళ్యాణ్ 114.18 కోట్లు, మోడ సతీష్ 135.48 కోట్లు, మోడ భాను ప్రియ 40.21 కోట్లు, ఉడతనేని వికాస్ చౌదరి 80.41 కోట్లు, కిన్నెర నరసింహ 92.54 కోట్లు రూపాయలను కాజేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. పైన పేర్కొన్న నిందితులు మరో ఆరుగురు ఏజెంట్ల నియమించుకొని 350 అకౌంట్లు తెరిపించి వీరి ద్వారా సైబర్ క్రైమ్ సొత్తును తమ తమ అకౌంట్లో మళ్ళించుకున్నట్లు తెలిపారు. ఈ సొత్తును మరో పదకొండు మంది అమాయకులను నమ్మించి బ్యాంకు అకౌంట్ తెరిపించి వారి అకౌంట్లో ద్వారా డబ్బులు కాజేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 24 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు. వీరిలో గతంలో ఆరుగురిని మరో 12 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సిపి వివరించారు. నిందితులను 24 మందిలో 23 మంది సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వారు ఉండటంతో ఈ కేసును పూర్తిగా క్షుణ్ణంగా దర్యాప్తు జరుగుతున్నట్లు వివరించారు. నిందితులపై దేశంలోని 10 రాష్ట్రాలలో 100కు పైగా సేవక్ క్రిమినల్ కేసులు ఉన్నాయని అలాగే వేరే దేశాలు అయినా కాంబోడియా, ఆస్ట్రేలియా లాంటి అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నిరసనతో జతకట్టి విదేశాలలో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ వాటి ద్వారా భారతదేశంలోని పౌరులకు పెట్టుబడిపెట్టి మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్ బెట్టింగు, షేర్ మార్కెట్లు పెట్టుబడులు కరెన్సీ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడినారని సిపి వివరించారు. విచారణ ద్వారా రూ.547 కోట్లు కాజేసినట్లు గుర్తించామనొ, నేరస్తులు వాడిన బ్యాంక్ అకౌంట్ లను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ దాహాతో పరిశీలించి నప్పుడు బ్యాంక్ అకౌంట్‌లో పైన దేశ వ్యాప్తంగా అప్పల రాష్ట్రాలలో వందల సంఖ్యలో సేవా ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని కేసు విచారణలో వెలుగు చూసిన విషయాలను సైబర్ క్రైమ్ సంబంధించిన దర్యాప్తు సంస్థలకు అప్పగించడం జరుగుతుందని సిపి సునీల్ దత్ తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఈ సైబర్ క్రైమ్ నిందితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌లో ఇవ్వరాదని, మనీ ఆశ చూపిస్తే ఎవరు ప్రలోభాలకు గురి కావద్దని, నిందితులతో పాటు కేసులో బాధితులు కూడా నేరం చూపినట్లు అవుతుందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో కోడిపందాలు, పేకాటలపై పూర్తిగా నిషేధించినట్లు ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి జూద క్రీడలు ఆడిన శిక్షిస్తామని సిపి హెచ్చరించారు. ఈ సమావేశంలో కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్, సిఐ ముత్తు లింగంతో పాటు పలువు ఎస్సైలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఆధునిక పరిజ్ఞానం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఎస్ఎల్‌బిసి పనుల పురోగతిపైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. తొలగించిన టిబిఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారని, మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బిసిని పూర్తి చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి తెలిపారు. గత బిఆర్ఎస్ పదేళ్ల పాలన వల్లనే పనులల్లో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బిసిని పూర్తి చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఉత్తమ్ వివరించారు.

# ఇందిరమ్మ నిధులు

(మొదటి పేజీ తరువాయి)

6 కిలోల చొప్పున ప్రతినెల ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రూ.8,600 కోట్లు ఖర్చు చేసి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. రామగుండం పట్టణంలో 800 మె.వా. నూతన థర్మల్ విద్యుత్తు ప్లాంటు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. పాలకుర్తిలో ఎత్తిపోతల పథకం పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. గత పదేళ్ల కాలంలో రామగుండం ప్రాంతంలో ఏలాంటి పరిశ్రమలు, ప్రాజెక్టులను బీఆర్ఎస్ పాలకులు తీసుకురాలేదని విమర్శించారు. జెన్‌కో, డిస్కంలు, సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అమలు చేస్తున్నామని, అదే విధంగా రాష్ట్రంలోని 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కూడ కోటి రూపాయల ప్రభుత్వ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థను అన్నివిధాల కాపాడుకుంటామన్నారు. తన ఇంట్లో న్యాయం చేయనోడు ప్రజలకు ఏమి చేస్తాడని మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి డిప్యూటి సీఎం అన్నారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ పాలనలో స్కాములు, దోపిడీలు తప్ప పేద ప్రజలకు చేసింది ఏమి లేదని ఈ విషయమై ప్రజలు కూడ ఆలోచన చేయాలన్నారు. ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ నిత్యం అభివృద్ధి కోసం పాటుపడ్తున్నారని, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి పెంచుతూ రామగుండం నియోజకవర్గానికి అవసరమైన పనులను చేయించుకుంటున్నారని, పట్టుబట్టి తనను ఈ పర్యటనకు రప్పించారంటూ మక్కన్‌సింగ్‌ను ఆయన ప్రశంసించారు.

### సింగరేణి స్థలాలకు త్వరలో పట్టాలు : మంత్రి పొంగులేటి

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాట నెరవేరుస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. మొదటి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే మూడేళ్లలో 3విడతలుగా ఇండ్లు ఇస్తామన్నారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందిస్తున్నామన్నారు. రామగుండంలో మరో 300 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించి అందజేస్తామన్నారు. రామగుండం నగరపాలికలో మరో తహసీల్దార్‌ను నియమించేందుకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వైఎస్సార్ జారీ చేసిన 76 ఉత్తర్వులను నేడు మరొసారి అమలు చేసి అర్హులైన వారికి సింగరేణి స్థలాల్లో ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు.

### బాధితులకు అండగా ఉంటా, న్యాయం చేస్తా : మంత్రి శ్రీధర్‌బాబు

రామగుండంలో వాణిజ్య, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రోడ్డు విస్తరణ చేపడ్తున్నామని, ఇండ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని, అందరికి స్థలాలు, పరిహారం, ఉపాధి అందేలా చూస్తామని రాష్ట్ర ఐ.టి., పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ నిత్యం అభివృద్ధి కోసం పాటుపడ్తున్నారన్నారు. రామగుండం నియోజకవర్గంలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలోగా వేచి ఉండకుండా అర్హులందరికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

### జర్నలిస్టులకు సొంతిల్లు నిర్మిస్తాం : మంత్రి కొండా సురేఖ

జర్నలిస్టులకు సొంతిల్లు నిర్మించి ఇస్తామని, గతంలో కెసిఆర్ మోసం చేశారని, మన ప్రజా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి అర్హులైన జర్నలిస్టులకు సొంత ఇండ్లు మంజూరు చేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్లకు ఇంటి నివాస స్థలాలు మంజూరు చేసి రామగుండంలో పట్టాలు అందజేసినట్లు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేస్తామని, ముఖ్యమంత్రి ఎస్.డి.ఎఫ్. నుంచి మరిన్ని నిధుల మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు.

### సింగరేణి కార్మికుల పరిష్కారానికి కృషి : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సింగరేణి మెడికల్ బోర్డు నుంచి కార్మికులకు ఎదురౌతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టి, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. స్థానికంగా ఎస్.సి. గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. తాను చదువుకున్న స్థానిక జూనియర్ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రామగుండం నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు.

# శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం

**కార్మికుల హక్కులు సాధించడంలో సిపిఐ కీలకపాత్ర**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** స్వేచ్ఛ, హక్కు, స్వాతంత్రం కావాలని ఎఐటియుసిచే అనేక కార్మిక సంఘాలు స్థాపించి ప్రజలను చైతన్యపరిచి జమీందార్ జాగిర్ధర్ పాలన అంతం కావాలని, శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎఐటియుసి ద్వారా అనేక పోరాటాలు చేసి 29 చట్టాలను సాధించుకుంటే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి చట్టాలను నిర్వీర్యం చేసిందని అన్నారు. సిపిఐ వందేళ్ళ కాలంలో రాజపాలన రద్దు, బ్యాంకుల జాతీయ కరణ, పేదలకు లక్షల ఎకరాల భూమి పంపిణీ, కార్మికులకు చట్టాలు సాధించి రైతులకు పోడు భూములను పంచిందన్నారు. శ్రమకు తగ్గ ఫలితం, ఉపాధి హామీ , సమాచార హక్కు చట్టం ఇవన్నీ సాధించడంలో సిపిఐ తల్లి పార్టీగా ప్రజల పక్షాన ఉండి అనేక పోరాటాలు చేస్తుందన్నారు. అధికారం లేకున్నా ప్రజల పక్షపాతిగా అసమానతలు లేని సమాజం కోసం పోరాడుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని జి రామ్ జి చట్టంగా మార్చడం దుర్మార్గమన్నారు. 100 కేంద్ర ప్రభుత్వ నిధుల్లో 40 శాతం రాష్ట్రం భరించాలనడం ముమ్మాటికీ సరైనది కాదని, ఈ పథకం రద్దు అవుతుందన్నారు. పేరు మార్చడానికి గాంధీ ఏం పాపం చేశారన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ధ్వంసం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పజెప్పుతున్నారని, అవినీతిని ప్రోత్సహిస్తూ పన్నులను అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ సిలిండర్ ధరలు పెరిగాయి అంటే మీ ప్రభుత్వమే అని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం మతోన్మాద, నియంతృత్వ ఫాసిస్టు వ్యతిరేక చర్యలకు పూనుకుంటుందని మండిపడ్డారు. రాబోయే కాలంలో ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలన్నారు. ఎర్ర జెండా పార్టీలు ఒక వేదిక మీదికి రావాలని జనవరి 18న సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఎర్రజెండా పార్టీలు ఏకమై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, గుంటి వేణు, పంతం రవి, అజ్జ వేణు, అనసూర్య, కుర్ర రాకేష్, మంద అనిల్, మీసం లక్ష్మణ్, సోమనాగరాజు, మంత్రి చంద్రయ్య, కార్మిక సంఘాల నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలపై దాడులను తిప్పికొట్టాలి



**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు**

**వరంగల్‌లో సిపిఐ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**

**ప్రజాపక్షం/వరంగల్ :** దేశ సంస్కృతి, సాంప్రదాయాలపై మతోన్మాద విష సంస్కృతిని ఎదిరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. ఆదివారం వరంగల్ శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్ ఎదుట ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మహిళలను గౌరవించే సంస్కృతిని పెంపొందించాలని, కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో మహిళలను మార్కెట్ వస్తువులుగా చిత్రీకరిస్తూ మహిళలపై చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ శక్తుల విష సంస్కృతి పెరిగి మహిళలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని అన్నారు. అనాదిగా జరుపుకుంటున్న పండుగలను కూడా బిజెపి తన స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుంటూ మతం రంగును పులిమే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ప్రజల విశ్వాసాలపై, నమ్మకాలపై, తీసుకునే ఆహారం, కట్టుకునే బట్టలపై జరుపుతున్న నియంతృత్వ చర్యలను వ్యతిరేకించాలన్నారు. బిజెపి తీసుకుని వస్తున్న మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వాల నియంత్రణ లేకపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, దీంతో మహిళలు పండుగను జరుపుకునే పరిస్థితి కూడా లేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు వంట గ్యాస్ ధరను భారీగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై మహిళలు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు మంద సదాలక్ష్మి, జిల్లా నాయకులు పాలక కవిత, తాళ్లపల్లి రోహేలా, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట చంద్రకళ, గన్నారపు రమేష్, గుండె బద్రి, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి సుంకరి భవాని, షభానా, అక్బర్ పాషా, లాదెళ్ల శరత్, ఓర్సు రాజు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

**వంద సంవత్సరాల సిపిఐ ఉద్యమ ప్రస్థానం**

# నిర్బంధాల నుండే ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేయడంతోనే సిపిఐ నాయకుల పైన కాన్పూర్, మీరట్ కుట్ర కేసులు నమోదు చేసి, జైళ్లలో నిర్బంధించారని సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి కార్యదర్శి స్టాలిన్ తెలిపారు. సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ప్రచార జాత కార్యక్రమం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో రెండవ రోజు ఆదివారం అంబర్‌పేటలోని గోల్నాక లేబర్ అడ్డా, చార్మినార్, సనత్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం జాత ముగింపు సభను సికింద్రాబాద్‌లోని తార్నాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ వంద సంవత్సరాల సిపిఐ ఉద్యమ ప్రస్థానం నిర్బంధాల నుండే ప్రారంభమైందన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ భూస్వామ్య వర్గాలు ప్రజలపై పెత్తనం చేస్తూ, పండించిన పంటలపై అధిక పన్నులను వసూలు చేస్తున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాన్ని నిర్మించి, భూస్వాముల కోటలను బద్దలు కొట్టిందని, పే ద వర్గాలకు భూములు పంపిణీ చేసిందని వివరించారు. అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ అంబర్‌పేట్ నియోజకవర్గం కార్యదర్శి బి.వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, అంబర్‌పేట్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కాశన్న, కౌన్సిల్ సభ్యులు కల్యాణ్, లింగస్వామి, శ్రీనివాస్, రాము, రవీందర్, భారతమ్మ శాంతమ్మ రేణుక లక్ష్మి పాల్గొన్నారు. చార్మినార్‌లో జరిగిన కార్యక్రమంలో సిపిఐ చార్మినార్ కార్యదర్శి ఆరుట్ల రాజ్ కుమార్, నాయకులు వినోద్, రోహిత్, జీవన్, తిలక్ దాస్, సనత్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజక వర్గ కార్యదర్శి సలీం ఖాన్, కౌన్సిల్ సభ్యులు సైఫ్ ఖాన్ ,దశరథ్ ఆఫ్తాబ్, సల్మాన్ పాల్గొన్నారు. కాగా సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన తార్నాకలో జరిగిన జాగ ముగింపు సభలో సిపిఐ నాయకులు వలివుల్లా ఖాద్రి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమర్ ఖాన్, సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు,తార్నాక డివిజన్ కార్యదర్శి గౌస్‌లు ఎఐఎస్‌ఎఫ్ ఒయు కార్యదర్శి లెనిన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాంలో నీట మునిగి తల్లి, ఇద్దరు పిల్లలు మృతి

*** సిద్దిపేట జిల్లా కస్తూరిపల్లిలో విషాదం**






**ప్రజాపక్షం/సిద్దిపేట :** ప్రమాదవశాత్తు చెక్‌డ్యాం నీటిలో మునిగి ముగ్గురు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కస్తూరిపల్లిలో చోటుచేసుకుంది. చేపలవేటకు వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు నీటిమునిగిపోతుండగా .. వారికి రక్షించేందుకు వెళ్లిన తల్లి సైతం నీటి మునిగి తనువు చాలించిన విషాదకర ఘటన ఇది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలావున్నాయి. కస్తూరిపల్లి గ్రామానికి చెందిన మందాల నారాయణరెడ్డి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు ఇక్కడే నివాసం వుంటు పనిచేస్తున్నారు. సాయంత్రం సమీపంలోని చెక్‌డ్యాంలో చేపలు పట్టడానికి ముగ్గురు చిన్నారులు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు ముంజేయి బీరజ్ (6), కిరణ్ కుమార్ (12)లు నీట మునిగారు. పక్కనే ఉన్న ముంజేయి సోను ఈ విషయాన్ని తన తల్లి ముంజేయి ఉమాదేవి (32)కి చెప్పాడు. అక్కడకు హుటాహుటిన చేరుకున్న ఆమె వారిని రక్షించపోయి నీట మునిగి మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ సైఫ్ అలీ, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీను తెలిపారు. కాగా ముంజేయి బీరజ్, ముంజేయి ఉమాదేవి తల్లి కొడుకులు మృతిచెదంటంతో బోరున విలపించారు.

*** తక్షణ సహాయం కింద రూ.20వేల ఆర్థిక సహాయం**

ఘటనపై మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బతుకు దేరువు కోసం వచ్చి దురదృష్టవశాత్తు మృతిచెదటం బాధకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుబూతిని వ్యక్తం చేశారు. తక్షణ సహాయం కింద రూ.20వేలు బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకిషన్‌శర్మ. మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేతలు శ్రీహరియాదవ్, వైకుంఠం, సర్పంచ్ స్వామి కలసి అందచేశారు. ప్రమాదవశత్తు మృతిచెందిన బీహారి వలస కుటుంబానికి బిఆర్ఎస్ పక్షాన అండగా ఉంటామన్నారు.

# మేడారం అభివృద్ధిని దేశానికి చాటి చెబుదాం

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూస్తాం**

**అన్ని ఏర్పాట్లు త్వరలో పూర్తి అవుతాయి**

**ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క**




**ప్రజాపక్షం/ములుగు/హనుమకొండ :** ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతరకు దేశంలో లేని విధంగా 20051 కోటి నిధులతో పనులు ప్రారంభించామని, మేడారం ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెబుతామని మేడారం అభివృద్ధి దేశానికే చాటి చెబుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మేడారం జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రులు పరిశీలన చేసి అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతర అభివృద్ధి పనులు 20051 నిధులతో పనులు ప్రారంభించగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని సౌకర్యాలు చేకూర్చుతామని త్వరలో గుడి పనులు పూర్తవుతాయని అన్నారు. స్టక్చర్లను త్వరగా బిగించి జాతర సమయానికి పనులు పూర్తి చేస్తామని వారు అన్నారు. ఎక్కడ లేని విధంగా మేడారం జాతరలో ఒక నైపుణ్యతవైన గుడిలు ఏర్పాటుచేస్తూ గిరిజన సాంప్రదాయాల ప్రకారం గిరిజనులు చెప్పే విధంగానే సమ్మక్క సారలమ్మ గుడిని ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే జాతర సమయం వరకు గిరిజనులతో వెన్నంటే ఉండి గిరిజన సాంప్రదాయాల ప్రకారం గుడి అభివృద్ధి పనులు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపిస్తామని వారు అన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, పినపాక ఎంఎల్‌ఎ, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఎ పిఓ చిత్ర మిశ్రా, డిఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, తదితరులు ఉన్నారు.

**మేడారానికి బారులు తీరిన భక్తులు**

మేడారం మహా జాతర మరో 18 రోజులు ఉండగానే ఆదివారం భక్తజనం మేడారానికి పోటెత్తింది. శనివారం సాయంకాలం నాలుగు గంటల నుంచి భక్తజనం మేడారం వైపు పరుగులు పెట్టగా ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల నుండి వేలాది వాహనాలు మేడారం వైపు పరుగులు పెట్టాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకే మూడు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకోవడానికి గద్దెల ప్రాంతంలో బారులు తీరారు. ఒకవైపు ఆరుగురు మంత్రులు మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడానికి వస్తున్న క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేయగా జిల్లా యంత్రాంగం భక్తుల ఏర్పాటులో నిమగ్నమైంది. గోవిందరావుపేట మండలం బాసర గ్రామం నుంచి నార్లాపూర్ వరకు వాహనాలు నిలిచిపోకుండా పలు దారుల గుండా మేడారం వైపు భక్తులను తరలించడానికి చర్యలు తీసుకున్నారు. జంపన్న వాగు కు చేరుకున్న వాహనాలను గద్దెల ప్రాంతానికి నేరుగా వెళ్లకుండా పలు ప్రాంతాల ద్వారా తరలించారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం
2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు
వేలాదిగా తరలి రండి!

# పార్టీ చీలికకు 60ఏళ్లు, ఏదీ ఆత్మపరిశీలన

అమృత్‌సర్ కాంగ్రెస్‌లో సిపిఐ మొట్టమొదటిసారి భారతదేశంలో సోషలిజంలోకి శాంతియుత పరివర్తన ధ్యేయాన్ని అంగీకరించింది, ఆమోదించింది. ఆ మహాసభ తదుపరి మూడు ముఖ్యమైన ఘటనలు జరిగాయి. ఒకటి, 1959లో కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం బర్తరఫ్. రెండు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాకు వ్యతిరేకంగా మావోయిస్టు దాడి ప్రారంభం. ఇది ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీపై, ప్రజాతంత్ర ఉద్యమంపై తీవ్రంగా ప్రతికూల ప్రభావం చూపింది. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందగా, 1949లో చైనా విముక్తి జరిగింది. అనంతరం ఇరుదేశాల మధ్య స్నేహ సంబంధాలు పరిఢవిల్లాయి. ''ఇండి–చినీ భాయి భాయి'' ఇంటింటి నినాదమైంది. సిపిఐ ఆ ఉద్యమం అగ్రభాగంలో ఉంది.



ఎస్‌ఎ డాంగే, చైర్మన్



ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శి

రెండు కమ్యూనిస్టు పార్టీల మధ్య సోదర సంబంధాలు వృద్ధి చెందుతున్నాయి. అయితే 1959 నాటికి పరిస్థితి మార్పు చెందసాగింది. చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం రెండూ దుస్సాహసిక వైఖరుల్లోకి, గొప్పరాజ్యమన్న దురహంకారంలోకి జారుకోవడం మొదలైంది. అది మావోయిజం ఆవిర్భావానికి దారితీసింది.

1959 మార్చిలో టిబెట్‌లో భూస్వామ్య అనుకూల తిరుగుబాటుతో మతగురువు దలైలామా భారత్‌లో ప్రవేశించారు, భారత ప్రభుత్వం ఆయనకు ఆశ్రయం కల్పించింది. ఇది ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత క్షీణింపజేసింది. ఇదిలా వుండగా, 1959నాటికి సరిహద్దు విభేదాలు బయటకు వచ్చాయి. చైనా ప్రధాని చౌన్–ఎన్–లై భారత ప్రధాని నెహ్రూకు రాసిన లేఖలో మెక్‌మహన్ రేఖను చైనా గుర్తించటంలేదని, ఆ రేఖకు దక్షిణంగా ఉన్న 90వేల కిలోమీటర్లు చైనాదేనని పేర్కొన్నారు. వాయవ్య దిక్కున అక్సాయ్‌చిన్ ప్రాంతంలో ఉన్న వివాదాలకు ఇది అదనం. చైనాకు, సిపిఐకి వ్యతిరేకంగా దుష్ప్రచారం పెంపు చేయటానికి ఇది అభివృద్ధి నిరోధకులకు, భారత ప్రభుత్వానికి సహాయకారి అయింది. చైనా కమ్యూనిస్టు పార్టీ వైఖరిలో వచ్చిన ఈ తీవ్రమైన మలుపు భారత్‌కు వ్యతిరేకంగా మాత్రమే కాదు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాకు వ్యతిరేకంగా అది ప్రారంభించిన దాడిలో భాగం. ఈ అతివాద ఒంటెత్తు పోకడ పంథా ఇక్కడ పాల్ఘాట్, అమృత్‌సర్ కాంగ్రెస్‌లు ఆమోదించిన పంథాపై దాడిచేయటానికి, ముఠా కార్యకలాపాలు పెంపుచేయటానికి కొందరు సిపిఐ నాయకులను ప్రోత్సహించింది.

మూడవ ముఖ్యమైన పరిణామం – 1960లో మాస్కోలో జరిగిన 81 కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం. ఆ మహాసభ ఆమోదించిన రెండు విరుద్ధ సామాజిక వ్యవస్థల మధ్య శాంతియుక సహజీవనం, శాంతియుత పోటీ, సోషలిజంలోకి శాంతియుత పరివర్తనకు అవకాశం అనే మౌలికాంశాలతో సిపిఐ నాయకులు కొందరు విభేదించారు. ''చైనా పంథా'' భారతదేశంలో ''మిలిటెంట్'' రివల్యూషనరీ పంథాను ముందుకు తీసుకువెళ్ళటానికి తోడ్పడుతుందని, మాస్కో డిక్లరేషన్ ''రివిజనిస్టు పంథా'' అని అది సిపిఐ పోరాటానికి అవరోధమని, వర్గ సంక్రమణానికి, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు దారితీస్తుందని ఆ నాయకులు వాదించారు. తమ ప్యాక్షనల్ సమావేశాల్లో తమ పంథాను ప్రచారంలో పెట్టారు. అటు తర్వాత సిపిఐ(ఎం)గా ఏర్పడింది ప్రధానంగా వీరే.

ఈ నేపథ్యంలో 1961 ఏప్రిల్ 7–16 తేదీల్లో విజయవాడలో సిపిఐ ఆరవ కాంగ్రెస్ జరిగింది. పార్టీ చరిత్రలో తొలిసారి మిఖాయిల్ సుస్లోవ్ నాయకత్వంలో సిపిఎస్‌యు నుంచి సౌహార్ద్ర ప్రతినిధివర్గం హాజరైంది. ప్రధాన కార్యదర్శి అజయ్‌ఘోష్ తమ ప్రారంభోపన్యాసంలో 1960 మాస్కో డిక్లరేషన్‌ను హర్షిస్తూ, ప్రపంచం, భారతదేశ పరిస్థితిపై సమగ్ర విశ్లేషణ చేశారు. అయితే కాంగ్రెస్‌తో సర్వసాధారణ యునైటెడ్ ఫ్రంట్ ఉండబోదని, మన సంబంధాలు ''ఐక్యత–పోరాటం''గా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అయినా మాస్కో డిక్లరేషన్‌కు వ్యతిరేకంగా ''చైనా పంథాను'' బలపరుస్తున్న కామ్రేడ్స్, రాజకీయ తీర్మానం ముసాయిదాలోని అంశాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేశారు. సుదీర్ఘంగా, రాత్రులు పొద్దుపోయేవరకు సైతం వాదోపవాదాలు జరిగాయి. భిన్న మార్గంలోని వారు వాకౌట్లు, అరుపులు తదితర పద్ధతుల్లో ఆటంకాలు కల్పించారు. దీనివల్ల విజయవాడ కాంగ్రెస్ రాజకీయ తీర్మానం ఆమోదించలేదు. చర్చల నేపథ్యంలో తన ప్రసంగాన్ని సరిదిద్దవలసిందిగా అజయ్‌ఘోష్‌ను ఆదేశించింది. పార్టీలో చీలిక నివారణకు ఆ అసాధారణ ప్రొసీజర్ ఆమోదించబడింది. పార్టీలో ఒక విధమైన చీలిక విజయవాడ కాంగ్రెస్‌లోనే స్పష్టమైంది.

పార్టీ కార్యక్రమానికి సంబంధించి మరో ముఖ్య వివాదం భారతదేశానికి అత్యంత అనువైనది ఏది? జాతీయ ప్రజాస్వామ్యమా? లేక జనతంత్ర ప్రజాస్వామ్యమా? ప్రగతిశీల శక్తులందరితో కలిసి జాతీయ ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తి చేయటం మొదటి పంథా కాగా, కార్మికవర్గ నాయకత్వాన ప్రజాస్వామ్య విప్లవం పూర్తిచేయటం రెండో పంథా.

పార్టీ సంస్థల ఎన్నికలు వచ్చేసరికి, ఆ పిడివాదుల్లో కొందరు ప్యానల్ నుంచి ఉపసంహరించుకుని పెద్ద సంక్షోభం సృష్టించే ప్రయత్నం చేశారు. జాతీయ సమితి సభ్యుల సంఖ్యను పెంచి చివరి నిమిషంలో రాజీ జరిగింది. కొత్త జాతీయ సమితి కేంద్ర కార్యవర్గ కమిటీని , కేంద్ర కార్యదర్శి వర్గాన్ని కాంగ్రెస్‌లో ఎన్నుకోలేదు. 1962లో కామ్రేడ్ అజయ్‌ఘోష్ మరణానంతరం పార్టీనాయకత్వాన్ని స్వాధీనం చేసుకోవటానికి ఆ గ్రూపు తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఐక్యతను కాపాడే నిమిత్తం జాతీయ సమితి పార్టీ నిబంధనావళిని సవరించి చైర్మన్ పదవిని పునరుద్ధరించింది. చైర్మన్‌గా ఎస్.ఎ. డాంగే, ప్రధాన కార్యదర్శిగా ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఇ.ఎం.ఎస్ విజయవాడ కాంగ్రెస్‌లో అతివాద ఒంటెత్తు వాద వైఖరితో లేరు. ఆయన తన సొంత పంథా ప్రతిపాదించారు. అయితే అది చర్చకు రాలేదు.

**మావోయిస్టు నాయకత్వం పిలుపు :**

చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) మావోయిస్టు నాయకత్వం ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల్లో చీలికకు పలుమార్లు పిలుపు ఇచ్చింది. ''రివిజనిస్టులపై'' తిరుగుబాటు చేసి, ''విప్లవ కమ్యూనిస్టు పార్టీల'' ఏర్పాటుకై బయటకు రావల్సిందిగా కోరింది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికకు పిలుపునిచ్చింది. ''అంతర్జాతీయ రివిజనిజంపై పోరాడు'' పేరుతో సోదర కమ్యూనిస్టు పార్టీల్లో చీలికకు 1963 లో చైనా పార్టీ పిలుపు ఇచ్చింది. భారత దేశంలో నిజమైన '' మార్కిస్టు– లెనినిస్టు పార్టీ ఏర్పాటుకు బహిరంగా పిలుపు ఇచ్చి, ''రివిజనిస్టు డాంగే ముఠా''తో సంబంధాలు తెంచుకోమని కోరింది. కొన్ని ప్రజాసంఘాలు సహా అన్ని స్థాయిల్లో పోటీ సంఘాల ఏర్పాటుతో పార్టీ చీలికకు ప్రణాళిక సిద్ధమైంది. చైనా ప్రచారంలో చేరిన ఇండోనేషియన్ కమ్యూనిస్టు పార్టీ చైర్మన్ డిఎన్ ఐదిత్ సిపిఐని చీల్చాల్సిందిగా భారత కమ్యూనిస్టులకు బహిరంగ పిలుపు ఇచ్చారు. ప్రపంచమంతటా''చైనా విప్లవ పంథా''ను అనుసరించాలని పిలుపులు ఇవ్వబడ్డాయి. ''చైనాబాట మన బాట'' అని విరివిగా ప్రచారం చేయబడింది.

ఈలోపు,1962 అక్టోబర్ 20న భారత భూభాగంలోకి చైనా సైన్యం యుద్ధానికి తెగబడింది. దాన్ని'దురాక్రమణ' యుద్ధంగా తొలుత డాంగే , ఆతర్వాత పార్టీ ప్రకటించాయి. చీలిక వాదులు వ్యాఖ్యను గట్టిగా వ్యతిరేకించారు. నెహ్రూ ప్రభుత్వం వారిని దేశరక్షణ చట్టం కింద జైళ్లలో పెట్టింది. అస్సాంలోకి వచ్చిన చైనాసైన్యాలు 31రోజుల తర్వాత ఉపసంహరించుకున్నాయి. ఖైదీలందరూ విడుదలైనారు.

చీలిక వాదులు భారత జాతీయ పురావస్తు భాండాగారంనుంచి 'డాంగే లేఖలు' అనేదాన్ని సంపాదించి అమెరికన్ వారపత్రిక 'కరెంట్'లో ప్రచురింపజేశారు. డాంగే 1924 నుంచీ బ్రిటిష్ ఏజెంట్ అని రుజువుచేయాలనే ప్రయత్నం అది. జాతీయ సమితి మెజారిటీ ఆ నిందను తిరస్కరించారు. అయితే పార్టీ ఐక్యత పరిరక్షణకోసం దర్యాప్తు కమిటీ వేసింది. ఆ లేఖలు ఫోర్జరీ అని ఆ కమిటీ తేల్చింది.

పార్టీని చీల్చడానికి ప్రణాళికలు ముందే సిద్ధమైనాయి. అసలు సమస్యలు సిద్ధాంతపరమైనవి, రాజకీయ, నిర్మాణ సంబంధమైనవి కాగా ' డాంగే లేఖలు' అనేవి పార్టీని చీల్చటానికి సాకు మాత్రమే . మావోయిజంను అనుసరిస్తున్నవారు,లేదా దాని పట్ల సానుభూతి కలిగి ఉన్నవారు, సిపిసి వ్యూహం, ఎత్తుగడలను బలపరిచేవారు వేరే పార్టీ ఏర్పాటు చేయటానికి నిర్ణయించుకున్నారు.1964 ఏప్రిల్ 11న ముందస్తు ప్రణాళిక ప్రకారం జాతీయ సమితి సభ్యులు 101 మందిలో 32 మంది వాకౌట్ చేశారు. ఒక పత్రికా ప్రకటనలో, తమ పోటీ కార్యక్రమం ప్రకటించి, పోటీ కాంగ్రెస్‌కు పిలుపు ఇచ్చారు. ఆవిధంగా 1964లో సిపిఐలో చీలిక తెచ్చారు. వారు ఆ చీలికను ' చారిత్రక ఆవశ్యకత'గా సమర్థించారు, భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని 'రక్షించామని' భావించారు.

60సంవత్సరాలు గడిచిపోయాయి.ఈ చీలిక కమ్యూనిస్టు వ్యతిరేకులు, మితవాద అభివృద్ధి నిరోధకుల పెరుగుదలకు మాత్రమే దోహద కారి అయ్యింది. కమ్యూనిస్టు ఉద్యమం తొలి చీలిక నుంచి డజన్ల చీలికల పీలికలైంది. చరిత్ర ఎన్నో అనుభవాలు ఇచ్చింది. మంచిచెడులను బేరీజు వేసుకుందాం. కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు ఇస్తున్నది. అది పీడిత ప్రజల ఆకాంక్ష. మిగతా వామ పక్ష పార్టీల్లోనూ పునరాలోచన అవసరం.

– అనిల్ రాజింవాలె

రోడ్డు ప్రమాదాలు నివారించే లక్ష్యంతో

## నేడు 'అరైవ్ అలైవ్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించాలనే సంకల్పంతో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా సోమవారం యూసుఫ్‌గూడలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించే 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని డిజిపి బి.శివధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రచారం జనవరి 13 నుంచి 24 వరకు, పండుగ సెలవులు మినహా పది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు డిజిపి వెల్లడించారు.ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను గణనీయంగా తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డిజిపి తెలిపారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యత ప్రతి తెలంగాణ పౌరుడి మనసులో బలంగా నాటిపోవాలన్నదే 'అరైవ్ అలైవ్' ఆశయమని చెప్పారు. ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి సీనియర్ అధికారుల నుంచి చివరి స్థాయి పోలీసు సిబ్బంది వరకు అందరూ పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీస్ కమిషనర్ లేదా జిల్లా ఎస్పీ నేతృత్వంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారుల సహకారంతో ఈ ప్రచారం అమలవుతుందని, డివిజన్ స్థాయిలో ఎస్డీపీఓలు, మండల స్థాయిలో సీఐలు, ఎస్హెలు, గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ ట్రాఫిక్ సేఫ్టీ కమిటీల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, యువత, ఎన్‌సిసి ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ యజమానులు తదితరులను ఈ ఉద్యమంలో భాగస్వాములుగా చేస్తామని చెప్పారు. ఈ పది రోజుల ప్రచారంలో డిఫెన్సివ్ డ్రైవింగ్, విద్యార్థులుయువత, గ్రామీణ రోడ్డు భద్రత, మహిళలుకుటుంబ భద్రత, మద్యం సేవించి వాహనం నడపేవారిపై జీరో టాలరెన్స్, సెలబ్రిటీలుమీడియా, కార్పొరేట్‌రవాణా రంగం, స్వచ్ఛంద సంస్థలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని డిజిపి తెలియజేశారు.ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని డిజిపి తెలియజేశారు.

## నిజాయితీకి ప్రతిరూపంగా నిలిచిన మహానేత లాల్ బహదూర్ శాస్త్రి

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయనకు టిపిసిసి అధ్యక్షులు ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్ ఘనంగా నివాళ్లు అర్పించారు. దేశ రెండవ ప్రధానమంత్రి, నిజాయితీకి ప్రతిరూపంగా నిలిచిన మహానేత లాల్ బహదూర్ శాస్త్రి అని మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. జై జవాన్.. జై కిసాన్ అనే నినాదంతో దేశ రక్షణకూ, రైతుల సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం కల్పించిన మహానేత లాల్ బహదూర్ శాస్త్రి అని, అతి సాధారణ జీవితం గడుపుతూ అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించిన ఆయన, దేశానికి స్ఫూర్తిదాయక ఆదర్శం అని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధ సమయంలో దేశాన్ని ధైర్యంగా నడిపించిన శాస్త్రి నాయకత్వం దేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా పెంచిందనిగుర్తుచేశారు. రాజకీయాల్లో విలువలు, నిజాయితీ, క్రమశిక్షణలకు ప్రతీకగా నిలిచిన ఆయన జీవితం నేటి తరానికి మార్గదర్శకమనిమన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని, రైతులు, సైనికులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.

## సచివాలయంలో సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోంది

తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం థియేటర్ల కంటే సచివాలయంలోనే ఒక పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? ఉంటే ఎవరి నియంత్రణలో ఉంది అనే అనుమానం ప్రతి ఒక్కరికీ కలుగుతోందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వైపు టికెట్ ధరలు పెంచుతూ జీవో బయటికి వస్తుందని, మరోవైపు ఆ శాఖకు బాధ్యత వహించాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి తనకు తెలియదని, తన ప్రమేయం లేదని, తన వద్ద ఆ ఫైల్ రాలేదని నిస్సహాయంగా చేతులెత్తేస్తారని పేర్కొన్నారు. శాఖ ఒకరిది?, పెత్తనం మరొకరిదా? , .జిఒ ఇచ్చేది ఇంకొకరిదా? అని ప్రశ్నించారు. సాక్షాత్తు ఒక క్యాబినెట్ మంత్రికి తెలియకుండానే ఆయన శాఖలో ఇంత పెద్ద నిర్ణయం జరిగిపోతుంటే ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరని అన్నారు. టికెట్ల పెంపు విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినప్పటికీ ఈ ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమన్నారు. ఆ శాఖ మంత్రికి తెలియకుండానే సినిమా రేట్ల కమిషన్ల దందాపై గవర్నర్ దృష్టి సారించాలని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

నూతన మార్గదర్శకాలతో..

# పాత భవనాలకు ఊరట



ఓసి తీసుకునేందుకు మార్గం సుగమం

వేలాది మందికి చేకూరనున్న లబ్ధి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో చాలా కాలం క్రితమే భవన నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ, వివిధ కారణాల వల్ల ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసి) పొందలేక ఇబ్బందులు పడుతున్న భవన యజమానులకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) భారీ ఊరటనిచ్చింది. నిర్మాణ అనుమతి గడువు ముగిసినప్పటికీ, వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసి) పొందలేకపోయిన వారికి కొత్త మార్గదర్శకాలను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈ నిర్ణయంతో భవన నిర్మాణం పూర్తయినా ఓసి పొందలేని వారికి భారీ ఊరట లభించనుంది. నిబంధనల ప్రకారం నిర్మించిన నాన్ హైరైజ్ భవనాలకు ఓసి జారీ చేయనున్నారు. చాలా వరకు వెయ్యి గజాల స్థలాల్లోపు నిర్మించినవే ఎక్కువ శాతం ఉంటాయని అధికారులు చెప్తున్నారు. అయితే భవన నిర్మాణాలు పూర్తయ్యాక, నిర్మాణ గడువు ముగిసిన వెంటనే ఓసికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలా మంది నిర్మాణం పూర్తయ్యాక కూడా సంవత్సరాలు గడుస్తున్న వివిధ కారణాలతో ఓసిలు తీసుకోలేని వారు ఉన్నారు. అయితే గడువు ముగిసిన తరువాత ఓసి తీసుకునే అంశంలో నిర్దిష్టమైన నిబంధనలు లేకపోవడంతో ఎవరికి తోచినట్లు వారు ఓసిలు జారీ చేస్తున్నారు. దీంతో కమిషనర్ కర్ణన్ ఇందుకు సంబంధించి నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అయితే స్థల యజమానులు, బిల్డర్లు, డెవపర్ల మధ్య గొడవలతో ఓసి తీసుకోలేకపోయిన వారు ఉన్నారు. ఇలాంటి అపార్ట్‌మెంట్‌లలో సాధారణ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాల ప్రజలకు వెసులుబాటు కలగనుంది. ఓసి లేకపోవడంతో ఫ్లాట్‌లు విక్రయించుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. బ్యాంకు రుణాలు లభించకపోవడంతో ఆస్తులు ఉన్నా అవసరానికి ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. అటు ఆస్తులు అమ్ముకోలేక, కనీసం రుణాలు తీసుకోలేని పరిస్థితులు ఉండటంతో చాలా మంది సాధారణ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అలాగే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకపోవడంతో ఆస్తిపన్ను నూటికి నూరుశాతం విధింపు, జలమండలి, విద్యుత్ కనెక్షన్‌లు తీసుకోవడం, తీసుకున్న రెట్టింపు రుసుం చెల్లింపులతో ఆర్థిక భారాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి కొత్త మార్గదర్శకాలతో భారీ ఊరట లభించనుంది. పాత భవనాలకు ఓసి తీసుకునే మార్గదర్శకాలు ఇక నుంచి శాశ్వతంగా అమలు ఉంటాయని అధికారులు చెప్పారు.

**నివాసయోగ్య పత్రం (ఓసి) అంటే ఏమిటి?**

నివాసయోగ్య పత్రం లేదా ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ అనేది భవనం సురక్షితంగా ఉందని, మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం నిర్మించబడిందని నిర్ధారించే అధికారిక పత్రం. తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు పొందడం, బ్యాంకు లోన్లు తీసుకోవడం, ఆస్తి విక్రయం లేదా రిజిస్ట్రేషన్ వంటి ప్రక్రియలకు ఇది తప్పనిసరి.

**ఎవరికీ ప్రయోజనం? :** భవన నిర్మాణ అనుమతి తీసుకుని నిర్మాణం పూర్తయినా, అనుమతి గడువు ముగిసిపోవడం వల్ల ఓసి పొందని భవన యజమానులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ముఖ్యంగా నీటి కనెక్షన్లు (జలమండలి), విద్యుత్ కనెక్షన్లు (టిఎస్ఎస్‌పిడిసిఎల్) పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, అదనపు టారిఫ్‌లు చెల్లిస్తున్న వారికి ఇది ఉపశమనం కలిగించనుంది. బ్యాంకు రుణాలు పొందేందుకు, ఆస్తి విక్రయం లేదా రిజిస్ట్రేషన్ చేయడానికి కూడా ఓసి ఎంతో కీలకంగా ఉపయోగపడుతుంది.

**రెండు కేటగిరీలుగా దరఖాస్తులు :** ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తులను జిహెచ్‌ఎంసి రెండు విభాగాలుగా విభజించింది.

**కేస్-1 (అనుమతి గడువు ముగిసి 2 ఏళ్ల లోపు) :** భవన నిర్మాణ అనుమతి గడువు ముగిసి రెండేళ్లు దాటకుండా ఓసి కోసం దరఖాస్తు చేసినట్లయితే, పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతి రుసుములు, లింక్ రోడ్డు ఛార్జీలు, సిఆర్‌ఎంపి ఫీజు తదితర లెవీలు చెల్లించిన పక్షంలో దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు.

**కేస్-2 (అనుమతి గడువు ముగిసి 2 ఏళ్లు దాటినవి).** భవన అనుమతి గడువు ముగిసి రెండేళ్లు దాటిన తర్వాత ఓసి కోసం దరఖాస్తు చేస్తే, దరఖాస్తు చేసిన తేదీ నాటికి మొత్తం నిర్మిత విస్తీర్ణానికి వర్తించే ప్రస్తుత రేట్ల ప్రకారం అన్ని రకాల రుసుములు, ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

**షరతులు ఇలా :** ఈ సడలింపులు పొందాలంటే భవనాలు తప్పనిసరిగా మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మించి ఉండాలి. సెట్‌బ్యాక్‌ల విషయంలో గరిష్ఠంగా 10 శాతం వరకు మాత్రమే డీవియేషన్‌కు అనుమతి ఉంటుంది. (ఫ్రంట్ సెట్‌బ్యాక్‌కు ఈ సడలింపు వర్తించదు). అలాగే ఈ నిర్ణయం 18 మీటర్ల ఎత్తు వరకు అనుమతి పొందిన నాన్ హైరైజ్ భవనాలకు మాత్రమే వర్తిస్తుంది.

**దరఖాస్తు విధానం.. :** ఓసి కోసం జిహెచ్‌ఎంసి ఆన్‌లైన్ పోర్టల్ లేదా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి భవన నిర్మాణ అనుమతి పత్రాలు, ఆస్తి పన్ను చెల్లింపు రశీదు, నీటి విద్యుత్ బిల్లులు, యజమాని గుర్తింపు కార్డులు అవసరం. అలాగే నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను కూడా పాటించాలి. దరఖాస్తు సమర్పించిన అనంతరం జిహెచ్‌ఎంసి అధికారులు భవనాన్ని పరిశీలించి, అన్ని నిబంధనలు పాటించినట్లయితే ఓసిని జారీ చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించిన భవనాలు లేదా ఓసి లేని భవనాలను సీల్ చేసే అధికారం జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు ఉంటుందని టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు.

**వేలాదిమందికి చేకూరనున్న లబ్ధి :** ఈ నూతన మార్గదర్శకాలతో నగరంలో వేలాదిమంది భవన యజమానులు, కొనుగోలుదారులకు ఉపశమనం లభించనుంది. ఆలస్యమైనా సరే, నిబంధనలను పాటించి నిర్మించిన భవనాలకు ఓసి జారీ చేయడం ద్వారా పాత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిహెచ్‌ఎంసి అధికారులు భావిస్తున్నారు.

## తలసేమియా రహిత తెలంగాణను సాధిద్దాం

మంత్రి దామోదర్ రాజనర్సింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణను దేశంలోనే మొట్టమొదటి తలసేమియా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. తలసేమియా అండ్ సికిల్‌సెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని కమల హాస్పిటల్‌లో నిర్వహించిన ఏసియన్ తలసేమియా కాన్‌క్లేవ్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేషెంట్లు, దేశ, విదేశాల నుంచి వచ్చిన డాక్టర్లు, ఇతర నిపుణులను ఉద్దేశించి మంత్రి దామోదర్ రాజ నర్సింహ మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు కేవలం వైద్యపరమైన నిర్ధారణలు మాత్రమే కావని, అవి బాధిత కుటుంబాలను, సమాజాన్ని జీవితకాలం వెంటాడే తీవ్రమైన సవాళ్లు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రక్తసంబంధీకుల మధ్య వివాహాలు (మేనరికం) చేసుకోవడం వల్ల తల్లిదండ్రుల నుంచి పిల్లలకు ఈ జన్యుపరమైన వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. దీనిని నివారించడానికి ముందస్తు స్క్రీనింగ్, కౌన్సిలింగ్, సామాజిక అవగాహన కల్పించడమే సరైన మార్గమని, నివారణే అత్యుత్తమ చికిత్స అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాధుల నియంత్రణకు, బాధితుల సంక్షేమానికి ప్రభుత్వంపటిష్టమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందిస్తున్నమని, తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ సహకారంతో మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో విజయవంతంగా ప్రతి గర్భిణీకి పరీక్షలు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తలసేమియా బాధితులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు ఇప్పటికే ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో డే కేర్ సెంటర్లను నిర్వహిస్తున్నామని, త్వరలో ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్ లలో అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో సికిల్‌సెల్ వ్యాధిని గుర్తించేందుకు ఇప్పటివరకు 11 లక్షల మందికి పైగా స్క్రీనింగ్ పూర్తి చేశామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నిమ్స్ హాస్పిటల్‌లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

**తలసేమియా, సికిల్ సెల్ పేషెంట్లు అందరికీ పెన్షన్ :** తెలంగాణ హెల్త్ విజన్ 2047లో భాగంగా అందరికీ అందుబాటులో మెరుగైన వైద్యాన్ని అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, రాజనర్సింహ తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ పేషెంట్లు అందరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందిస్తూ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా పేషెంట్లకు అవసరమైన అన్ని రకాల పరీక్షలను దయాగ్నస్టిక్స్ సెంటర్లలో ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఇంకా ఏవైనా టెస్టులు అవసరమైనా ఉచితంగా చేసేందుకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనారోగ్యం కారణంగా ఏ కుటుంబం పేదరికంలోకి వెళ్లకూడదన్నదే తమ ఆశయమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం, వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేసి మిషన్ తలసేమియా ఫ్రీ తెలంగాణ లక్ష్యాన్ని సాకారం చేసుకుందామని మంత్రి పిలుపునిచ్చారు.



## ఫిబ్రవరి 21న 5వ మాక్ ట్రిబ్యునల్ పోటీలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిఎ వేముల చంద్రశేఖర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : యువ పన్ను నిపుణులు, విద్యార్థులలో విద్యా నైపుణ్యం, ఆచరణాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈనెల 21వ తేదీన 5వ మాక్ ట్రైబ్యునల్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిఎ వేముల చంద్రశేఖర్ తెలిపారు.. 5వ మాక్ ట్రైబ్యునల్ పోటీలను హైదరాబాద్ ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షులు విజయ పాల్ రావు, ఐటిఎటి హైదరాబాద్ బెంచ్ సభ్యులు జి. మంజునాథ, మధుసూదన్ సవాడియా, రవి సూద్‌లను ప్రారంభించనున్నారన్నారు.1970లో స్థాపించిన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ రెండు తెలుగు రాష్ట్రాలలో పన్ను నిపుణుల వృత్తిపరమైన అభివృద్ధి, జ్ఞాన భాగస్వామ్యం, సామర్థ్య నిర్మాణంలో చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. లక్ష్యాలు, నిర్మాణం, న్యాయవాద నైపుణ్యాలను బలోపేతం చేయడం, అప్పీలేట్ ప్రొసీడింగ్‌లను అర్థం చేసుకోవడం కోసం ఈ పోటీలలో పాల్గొనడం ద్వారా యువ న్యాయవాదులకు, విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిఎ ఆశిష్ జోషి, ఉపాధ్యక్షులు నారాయణ రావు, సీనియర్ సలహాదారులు రామ్‌దేవ్ భూతడా, సిఎ అమృత్ కుమార్ కోట తదితరులు పాల్గొన్నారు.

ఐఎఎస్, ఐపిఎస్ అధికారులపై..

## అనుచిత వ్యాఖ్యలు సహించం

టిజిఓ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.బి.కృష్ణాయాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐఎఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత స్థాయి అధికారులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కథనాలు రాయడం దురదుష్టకరమని హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం (టిజిఓ ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సభ్య సమాజానికి సిగ్గుచేటని సంఘం అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, కార్యదర్శి ఎం.ఎ. అబ్దుల్ ఖాదర్, నాయకులు, ఆశన్న, వి. శ్రీరామ్, రమణ, మహిళా ప్రతినిధులు ఎంజుల రెడ్డి, ఘటనను తీవ్రంగా ఖండించారు. మహిళా అధికారులను లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమన్నారు. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఇటీవల కొందరు ఉన్నత అధికారుల మనోభావాలు దెబ్బతినేలా వార్తలు రాయడం శోచనీయమన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు

# బిజెపి ప్రత్యామ్నాయం కాబోదు

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాబోదని, రాష్ట్రంలో ఏనాటికీ ఆ పార్టీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి సాధించిన విజయం గాలివాటమేనన్నారు. ఆదిలాబాద్, మెదక్ జిల్లాలకు సంబంధించిన జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో కెటిఆర్ హైదరాబాద్‌లో ఆదివారం పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ 24 నెలల కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు, గత పదేళ్ల కాలంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని, కచ్చితంగా మరోసారి బిఆర్‌ఎస్ వైపే ప్రజలు నిలిచేందుకు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల నుంచి మొదలుకుని పంచాయతీ సర్పంచ్ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికల్లో ప్రజలు బిఆర్‌ఎస్‌వైపు నిలబడ్డారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్క బిజెపి సీనియర్ నేతలు ఘోరమైన ఓటమి పాలయ్యారన్నారు. రానున్న భవిష్యత్తులో కాంగ్రెస్, బిజెపిలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

**బిఆర్‌ఎస్‌లో చేరిన మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్‌గౌడ్**

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సమక్షంలో తెలంగాణభవన్‌లో ఆదివారం రాజేంద్ర నగర్ నియోజకవర్గం బండ్ల గూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ తదితరులు బిఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాను కప్పి బిఆర్‌ఎస్‌లోకి కెటిఆర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రైతులను, రైతు కూలీలను, కౌలుదారులను, విద్యార్థులను, మహిళలను ,వృద్ధులను, ప్రభుత్వ ఉద్యోగులను కూడా రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే సిఎం రేవంత్ రెడ్డి తనకు తెలిసిన భాషలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎవరి వద్ద డబ్బులు లేని పరిస్థితులు అని, వ్యాపారాలు తగ్గిపోయాయని, ఉపాధిలేకుండా పోయిందని, ఇందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. పార్టీ ఫిరాయించిన ఎంఎల్‌ఎల పరిస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు.రాజేంద్రనగర్ ఎంఎల్‌ఎ ప్రకాష్ గౌడ్ ఏ అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరారో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

## మోదీకి దేశ అభివృద్ధే లక్ష్యం

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం అవినీతి కోసమే పాకులాడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. నగరంలో జరిగిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ''(విజి జి రామ్ జి) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, మోదీ నాయకత్వంలో 4వ స్థానానికి చేరుకుందని, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ కేవలం రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తే, మోదీ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. పాలనలో పారదర్శకత కోసమే కొత్త చట్టాలు తెస్తున్నామని, దీనిని కాంగ్రెస్ కావాలనే వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా ఇవ్వడానికి వెనకడుగు వేయడం సరికాదని, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సంస్థాగత ఇన్ ఛార్జ్ చంద్రశేఖర్ తివారీ తదితరులు పాల్గొన్నారు.



## సాయిబాబా మరణం టిడిపికి తీరని లోటు

పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగుదేశం సీనియర్ నాయకులు పిన్నమనేని సాయిబాబా అకాల మరణం పార్టీకి తీరని లోటని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం. అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన సాయిబాబా సంస్మరణ సభలో పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ అభిమాన సంఘాల నుంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన సాయిబాబా, వికలాంగుల సంక్షేమ సంస్థ ఛైర్మన్‌గా, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా విశేష సేవలు కొనియాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. సాయిబాబా కుటుంబానికి టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ సభలో బక్కని నరసింహులు, నగర నాయకులు నల్లెల కిషోర్, నాగు నగేష్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు పాశం సురేందర్, పి. బాలరాజ్ గౌడ్, పరశురాం, ఎస్. ప్రకాష్, చంద్రమోహన్ గౌడ్, శ్యాంసుందర్, బాలాజీ గోస్వామి, భానుప్రకాష్, నర్సింగ్, అనిల్, భవాని శ్రీనివాస్, శ్రీకాంత్, జోగేంద్ర సింగ్, బి. శ్రవణ్ కుమార్, తయ్యబా తస్లీమ్ ప్రమీల, ఝాన్సీ, వెంకటేశ్ చౌదరి పాల్గొన్నారు.

## పంజాగుట్టలో 'జివామె'ఇన్ స్టోర్



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** జివామె మహిళల లోదుస్తుల వ్యవహారంలో ధైర్యం, సౌకర్యాన్ని ఇస్తుందనటంతో సందేహం లేదని సినీ నటి శ్రద్ధాదాస్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ పంజాగుట్టలోని నెక్స్ట్ గల్లేరియా మాల్‌లోని జివామె మహిళల భిన్నమైన లోదుస్తుల ఇన్‌స్టోర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు నిజజీవితంలో ధరించగలిగే విధంగా ఎంతో ఆలోచనాత్మకంగా ఇంటిమేట్ దుస్తులను జివామె రూపుదిద్దిందని అభినందించారు. జివామె మార్కెటింగ్ హెడ్ దామస్ బలి మాట్లాడుతూ రాబోతున్న తమ గ్రాండ్ లాంజర్ ఫెస్టివల్‌తో మహిళలు నిజంగా విశ్వసించగలిగేవాటిని సృష్టిస్తూ, పరిష్కారాలకు దారితీసే ఇంటిమేట్ దుస్తులను అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషిచేస్తున్నామన్నారు. ఈ నెల 30 నుంచి జివామె గ్రాండ్ లాంజర్ ఫెస్టివల్ నిర్వహించున్నట్టు తెలిపారు.

## వడ్డెర్లకు రాజకీయంలో ప్రాధాన్యమివ్వాలి

జాజుల

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అత్యంత వెనుకబడిన వడ్డెరలను రాజకీయ రంగంలో ప్రాధాన్యం కల్పించాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్ని రాజకీయ పార్టీలను కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 219వ జయంతోత్సవం ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. దీనికి జాజుల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, పలువురు వడ్డెర సంఘం నేతలతో కలిసి ఆయన ఓబన్న చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జాజుల మాట్లాడుతూ వడ్డె ఓబన్న వడ్డెర సమాజానికి ప్రతీక అని,ఆయన చేసిన త్యాగం, సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఓబన్నచేసిన త్యాగాలు, సేవలను గుర్తించి ఆయన విగ్రహాన్ని హైదరాబాద్‌లో ప్రతిష్ఠించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కుంచాల ఏడుకొండలు, రూపాణి లోకనాథం, జాతీయ యువజన అధ్యక్షులు వేముల భరత్, వైస్‌ప్రెసిడెంట్ గోపాల్, రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్, గ్రేటర్ అధ్యక్షులు బోదాసు రవి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల భవాని, గ్రేటర్ అధ్యక్షులు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి- అనకాపల్లి మధ్య

## 3 అదనపు ప్రత్యేక రైళ్లు

సిపిఆర్‌ఒ ఎ.శ్రీధర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. చర్లపల్లి-అనకాపల్లి మధ్య మూడు అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఈ రైళ్లు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొన్నారు.చర్లపల్లి- అనకాపల్లి-చర్లపల్లి ప్రత్యేక రైళ్లలో ఎసి-2 టియర్, ఎసి-3 టియర్, స్లీపర్, జనరల్ కోచ్‌లు జనరల్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ ప్రత్యేక రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ సూచించారు.

## పంజాబ్‌లో అశాంతిని సృష్టించేందుకు బిజెపి కుట్ర

**ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ మండిపాటు**
**ఢిల్లీ మాజీ సిఎం అతిషీ వీడియోను కాషాయ పార్టీ వక్రీకరించిందని ధ్వజం**

**బతిందా:** బిజెపిపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో మతపరమైన అశాంతిని సృష్టించే కుట్రలో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషీకి సంబంధించిన ఒక వీడియోను కాషాయ పార్టీ వక్రీకరించిందన్నారు. అయితే ఇటువంటి ప్రయత్నాలను తన ప్రభుత్వం విజయవంతం కానివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం బతిందాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాన్ మాట్లాడుతూ భారతీయ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి చేసిన అసెంబ్లీ ప్రసంగాన్ని బిజెపి ఎడిట్ చేసి, తప్పుడు సబ్‌టైటిల్స్‌ను, గురు తేజ్ బహదూర్ పేరును చొప్పించిందని ఆరోపించారు. ఆయన ఈ చర్యను 'దైవదూషణ'గా అభివర్ణించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు మాట్లాడుతూ అతిషీ ఆ వీడియోలో 'గురు' అనే పదాన్ని ఎప్పుడూ ఉపయోగించలేదని ఫోరెన్సిక్ దర్యాప్తు స్పష్టంగా నిర్ధారించిందని చెప్పారు. 'బిజెపి మతం, ద్వేష రాజకీయాలను అనుసరిస్తుంది, ఇది ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో కనిపిస్తోంది. అతిషీ గురువుకు వ్యతిరేకంగా అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించారనే అభిప్రాయాన్ని సృష్టించడానికి బిజెపి ప్రయత్నించింది, కానీ వాస్తవానికి ఆమె అలా చేయలేదు' అని మాన్ అన్నారు. ఢిల్లీ మంత్రి కపిల్ మిశ్రాపై పంజాబ్ పోలీసులు తీసుకున్న చర్యను ముఖ్యమంత్రి మాన్ సమర్థించారు. వక్రీకరించిన క్లిప్ అసెంబ్లీ అధికారిక రికార్డులలో ఎక్కడా లేదని అన్నారు. అటువంటి ప్రకటన చేసి ఉంటే, అది అసెంబ్లీ కార్యకలాపాలలో భాగంగా ఉండేదని, స్పీకర్‌కు తెలిసి ఉండేదని అన్నారు. అతిషీకి సంబంధించిన ఎడిట్ చేసిన, వక్రీకరించిన వీడియోను అప్‌లోడ్ చేసి, ప్రచారం చేసినందుకు జలంధర్ పోలీస్ కమిషనరేట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని మాన్ చెప్పారు. ఇక్బాల్ సింగ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదైందని, అతిషీ ఆడియో ఉన్న వీడియో క్లిప్‌ను మిశ్రా సోషల్ మీడియా ఖాతా నుండి డౌన్‌లోడ్ చేసి, పరీక్ష కోసం ఎస్ఎఎస్ నగర్‌లోని ఫోరెన్సిక్ సైన్సెస్ లాబొరేటరీ డైరెక్టర్‌కు పంపినట్లు జలంధర్ పోలీసు ప్రతినిధి శుక్రవారం తెలిపారు. 'మేము దానిని పరిశీలించాము. అతిషీ అలాంటి పదాన్ని ఏదీ మాట్లాడలేదని తేలింది. ఇది బిజెపి నీచమైన మనస్తత్వాన్ని చూపిస్తుంది. గతంలో కూడా ఇది ఇలాంటి పనులకు పాల్పడింది. ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని రెచ్చగొట్టడం దాని విధానం. మేము దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము' అని మాన్ అన్నారు.

## వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు

**సిజెఐ సూర్యకాంత్ హితవు**



**గువహతి :** కొత్త మౌలిక సదుపాయాల అభివృద్ధిని వ్యతిరేకించడానికి 'వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు చెల్లుబాటు అయ్యే కారణాలు కాకూడదు' అని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ హితవు పలికారు. ఆదివారం ఆయన ఇక్కడ బార్ అసోసియేషన్ నిరసనల మధ్య సిజెఐ సూర్యకాంత్ అసోంలో కొత్త కోర్టు సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన నిరసనల పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అసోం రాష్ట్రం కామ్‌రూప్ జిల్లాలోని ఉత్తర గువహతిలో గౌహతి హైకోర్టు బార్ అసోసియేషన్ నిరసనల మధ్య సిజెఐ సూర్యకాంత్ సమీకృత జ్యుడీషియల్ కోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. న్యాయవాదుల నిరసనల నేపథ్యంలో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్‌లకు హైకోర్టుగా పనిచేసే గౌహతి హైకోర్టు కొత్త సముదాయాన్ని జ్యుడీషియల్ టౌన్‌షిప్‌లో భాగంగా ప్రతిపాదించారు. ఇది న్యాయవాదుల నుండి నిరసనలకు దారితీసింది. ఈ నిరసనల పట్ల ఆశ్చర్యచకితులైన సిజెఐ సూర్యకాంత్ 'కొత్త కోర్టు సముదాయాన్ని వ్యతిరేకించే వారు అవగాహనలేనివారు లేదా బార్ కొత్త సభ్యుల అవసరాలను గ్రహించనివారు అయ్యి ఉంటారు. భవిష్యత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వ్యతిరేకించడానికి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు చెల్లుబాటు అయ్యే కారణాలు కాకూడదు' అని నిరసనకారులకు ఉద్బోధించారు.'ఇంటిగ్రేటెడ్ జ్యుడీషియల్ కోర్టు కాంప్లెక్స్ భవిష్యత్తు ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించబడింది' అని ఆయన చెప్పారు. ఈ కొత్త కాంప్లెక్స్ స్థలం వ్యూహాత్మకంగా ఉంచబడిందని, అన్ని సౌకర్యాలను ఒకే కప్పు కింద అందించబడ్డాయని సిజెఐ జోడించారు. దేశ న్యాయవ్యవస్థ అధిపతి అయిన సూర్యకాంత్ ఈ న్యాయవాద వృత్తిలోకి వచ్చే వారి అవసరాలను తీర్చడానికి తాను సిద్ధంగా ఉన్నానని సిజెఐ నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు ప్రముఖులు కూడాహాజరయ్యారు. అయితే ఈ సమయంలో గౌహతి హైకోర్టు బార్ అసోసియేషన్ (జిహెచ్‌సిబిఎ) ఈ కార్యక్రమాన్ని బహిష్కరించి గురువారం గౌహతి హైకోర్టు పాత భవనం ముందు నిరాహారదీక్షను ప్రారంభించి నాలుగు గంటలపాటు కొనసాగించింది. 'నగరానికి గుండెకాయ అయిన ప్రస్తుత స్థానం నుండి హైకోర్టును మార్చడాన్ని మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. మేం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిరాహార దీక్ష ప్రారంభించాము. మా సభ్యులు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాము' అని జిహెచ్‌సిబిఎ ఉపాధ్యక్షుడు సాంతాను ఉపాధ్యక్షుడు సాంతాను బోర్తాకూర్ ఆదివారం ఈ కార్యక్రమానికి ముందు 'పిటిఐ'కి చెప్పారు. కోర్టు సముదాయాన్ని మార్చే చర్యను జిహెచ్‌సిబిఎ మొదటి నుండీ వ్యతిరేకిస్తోందన్నారు. కానీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించి ఇప్పుడు కొత్త న్యాయ మౌలిక సదుపాయాలను నిర్మించడానికి ముందుకు వెళుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ చర్యను కోర్టులో సవాల్ చేస్తామని జిహెచ్‌సిబిఎ తెలిపింది. ప్రభుత్వం రంగమహల్ వద్ద 48 బిఘాల (దాదాపు 49 ఎకరాలు) భూమిలో కొత్త జ్యుడీషియల్ టైన్‌షిప్‌ను నిర్మించాలని యోచిస్తోంది. గత ఏడాది నవంబర్‌లో ఉత్తర గౌహతిలో ఒక జ్యుడీషియల్ టౌన్‌షిప్ నిర్మించడానికి రాష్ట్ర మంత్రివర్గం మొదటి దశలో రూ.479 కోట్లను ఆమోదించింది. అందరు వాటాదారులు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌ను వెంటనే నిలిపివేయాలని అంతకుముందు జిహెచ్‌సిబిఎ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

## కేంద్ర సర్కార్ 'గాలి నాణ్యత'ను గాలికొదిలేసింది

**దేశవ్యాప్త సమస్యపై సరైన స్పందన లేదు: కాంగ్రెస్**



**న్యూఢిల్లీ:** గాలి నాణ్యత అనేది దేశవ్యాప్త సమస్య అని, దానిపై కేంద్ర ప్రభుత్వ స్పందన ఏ మాత్రం ప్రభావవంతంగా లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సమస్యాత్మకంగానే ఉందని, దీనిపై సర్కారు సరిగ్గా స్పందించడం లేదని విమర్శించారు. గాలి నాణ్యతను గాడిన పెట్టేందుకు 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సిఎపి) ద్వారా పకడ్బందీగా సంస్కరణలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మాజీ పర్యావరణ శాఖ మంత్రి, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం'ను కేంద్ర ప్రభుత్వం 'నోషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం'గా మార్చిందని ఆయన మండిపడ్డారు. 'నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం'ను ఊహాజనిత అంశంగా మోదీ సర్కారు మిగిల్చిందన్నారు. దాని అమలుపై అస్సలు ఫోకస్ పెట్టలేదన్నారు. 'గాలి నాణ్యత అనేది దేశవ్యాప్త సమస్యగా ఉందనే రహస్యాన్ని చాలాకాలం పాటు దాచారు. ఇటీవలే సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సిఆర్ఇఎ) విశ్లేషణలో ఈ వాస్తవాన్ని వెల్లడించారు. అయినప్పటికీ ఈ నిర్మాణాత్మక సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తున్న తీరు సరిగ్గా లేదు. గత ఐదేళ్లుగా (2019–2024) మన దేశ గాలిలో 'పర్టిక్యులేట్ మేటర్ 2.5' (పిఎం 2.5) స్థాయి కాలుష్య ఉద్గారాల మోతాదు పెరుగుతూపోతోంది. దేశంలోని దాదాపు 44 శాతం నగరాల్లో తీవ్ర వాయు కాలుష్యం ఉందని శాటిలైట్ సమాచారం ద్వారా సిఆర్ఇఎ గుర్తించింది. అంటే దేశంలోని 4,041 నగరాలు, పట్టణాలకుగానూ 1,787 చోట్ల కాలుష్యం తీవ్ర రూపం దాల్చింది. ఈ విషయం కేంద్రానికి తెలిసినా, కేవలం 130 నగరాలనే 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సిఎపి)లో చేర్చారు. ఈ 130 నగరాలకుగానూ 28 చోట్ల ఇప్పటివరకు నిరంతర గాలి నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. 102 నగరాల్లోనే గాలి నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాలు ఉండగా, వీటిలోని 100 నగరాల గాలిలో 80 శాతానికిపైగా 'పిఎం 10' స్థాయి కాలుష్య ఉద్గారాలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం దేశంలో తీవ్ర కాలుష్యాన్ని ఎదుర్కొంటున్న కేవలం 4 శాతం నగరాలపైనే 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సిఎపి) ఫోకస్ పెడుతోంది' పకడ్బందీగా అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

## సిఎం కుర్చీ కోసం కుమ్ములాట లేదు

**అదంతా మీడియా సృష్టే : సిద్ధరామయ్య**



**మంగళూరు:** కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పీఠం కోసం మళ్లీ వివాదం ప్రారంభం కానుందన్న వార్తలను సిఎం సిద్ధరామయ్య ఖండించారు. రాష్ట్రంలో సిఎం కుర్చీ కోసం ఎలాంటి గొడవ లేదని, ఇదంతా కేవలం మీడియా సృష్టి మాత్రమేనన్నారు. అనవసరమైన ప్రశ్నలతో గందరగోళం సృష్టించ వద్దని మీడియాపై సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి తర్వాత కాంగ్రెస్‌లో అసలు సిసలైన కుర్చీ పోరు మొదలవుతుందని బిజెపి సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. తన ప్రభుత్వానికి, పదవికి ఎలాంటి ఢోకా లేదని, ఐదేళ్లు తామే సుస్థిర పాలన అందిస్తామని ఆయన పరోక్షంగా స్పష్టం చేశారు.

**విద్వేష ప్రసంగాల బిల్లుపై రచ్చ**

ఈ సందర్భంగా గవర్నర్ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న 'ద్వేషపూరిత ప్రసంగాల నిరోధక బిల్లు' గురించి కూడా సిఎం మాట్లాడారు. ఈ బిల్లును ఆమోదించవద్దని బిజెపి గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను కోరింది. దీనిపై సిఎం స్పందిస్తూ, 'ఈ బిల్లును చట్టసభలు ఆమోదించాయి. గవర్నర్ దీన్ని తిరస్కరించలేదు, వెనక్కి పంపలేదు, అలాగని ఆమోదమూ తెలపలేదు. ఆయన ఎప్పుడు పిలిస్తే అప్పుడు రాజ్ భవన్‌కు వెళ్తాను. బిల్లు ఆవశ్యకత గురించి గవర్నర్‌కు స్వయంగా వివరిస్తాను' అని చెప్పారు. ద్వేషపూరిత ప్రసంగాలు, నేరాలకు పాల్పడితే రూ.50 వేల జరిమానాతో పాటు ఏడాది నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో కఠిన నిబంధనలు ఉన్నాయి.

**బళ్లారి పాదయాత్ర, బిజెపి డ్రామా?**

బళ్లారిలో ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో బిజెపి 'బళ్లారి టు బెంగళూరు' పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించింది. దీనిపై స్పందించిన సిఎం, వాళ్లను యాత్ర చేసుకోనివ్వండి. వద్దని ఎవరు చెప్పారు? అంటూ సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. 'గతంలో మేం (కాంగ్రెస్) పాదయాత్ర చేసింది ఒక నిర్దిష్ట కారణం కోసం. అప్పట్లో బళ్లారిని గాలి జనార్ధన్ రెడ్డి సోదరులు అక్రమ మైనింగ్‌తో రిపబ్లిక్ ఆఫ్ బళ్లారిగా మార్చేశారని లోకాయుక్త నివేదిక ఇచ్చింది. అసెంబ్లీలో నేను మాట్లాడితే అప్పటి సిఎం యడియూరప్ప, రెడ్డి సోదరులు అడ్డుకున్నారు. అందుకే నేను పాదయాత్ర చేసి వారి అక్రమాలను బయటపెట్టాను. అది 2013లో మా గెలుపునకు పునాది వేసింది. కానీ ఇప్పుడు బిజెపి చేస్తోంది కేవలం రాజకీయ లబ్ధి కోసమే' అని విమర్శించారు.

## ఇండోర్‌లో 'స్వచ్ఛ జల్ అభియాన్' ప్రారంభం

**ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించడం రాష్ట్ర బాధ్యత : సిఎం మోహన్ యాదవ్**



**భోపాల్:** ఇండోర్‌లో కలుషిత నీటి కారణంగా సంభవించిన మరణాల నేపథ్యంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ జల్ అభియాన్‌ను ప్రారంభించారు. ఈ ప్రచారంలో నీరు, మురుగునీటి పైప్‌లైన్‌ల జిఐఎస్ మ్యాపింగ్, కూడలి పాయింట్ల గుర్తింపు, రోబోలను ఉపయోగించి లీకేజీల తనిఖీలు వంటివి ముఖ్యమైన అంశాలుగా ఉండనున్నాయి. నీటి భద్రత, పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో, ఈ ప్రచారం రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశ జనవరి 10 నుండి ఫిబ్రవరి 28 వరకు, రెండవ దశ మార్చి 1 నుండి మార్చి 31 వరకు జరుగుతుంది. ఈ ప్రచారంలో పౌరుల గళాన్ని వినే హక్కును నిర్ధారించడానికి, స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ప్రతి మంగళవారం జల్ సున్వాయి (ప్రజా విచారణ) ఉంటుంది. సమర్థవంతమైన అమలు కోసం ప్రజల అవగాహన, సమాజ భాగస్వామ్యంపై దృష్టి సారిస్తారు. అలాగే, 181 (సిఎం హెల్ప్‌లైన్) ద్వారా తాగునీటికి సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడానికి ప్రత్యేక సదుపాయం కల్పించబడుతుంది. ఇది తాగునీటి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను కాలపరిమితిలోగా పరిష్కరించడంపై కూడా ప్రధానంగా దృష్టి సారిస్తుంది, అదే సమయంలో దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందిస్తుంది. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ ప్రచారాన్ని ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించడం రాష్ట్ర బాధ్యత. సాంకేతికతను ఉపయోగించి జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలి. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి. నీరు కలుషితమైన సందర్భంలో తక్షణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కలుషిత నీటి సరఫరా విషయంలో సున్నా సహనం పాటించాలి. ప్రచారం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. ఇండోర్‌లోని భగీరత్‌పురా ప్రాంతంలో ప్రాణాంతక అతిసార వ్యాధి ప్రబలిన నేపథ్యంలో ఈ ప్రచారం ప్రారంభమైంది. డిసెంబర్ 24 నుండి ఈ వ్యాధి కారణంగా 21 మంది మరణించగా, 40 మందికి పైగా ఆసుపత్రిలో చేరారు.

## కేరళలో లైంగిక దాడి కేసు... ఎమ్మెల్యే రాహుల్ మమ్కూతతిల్ అరెస్ట్



**పతానంతిట్ట :** కేరళలో కాంగ్రెస్ బహిష్కృత ఎమ్మెల్యే రాహుల్ మమ్కూతతిల్‌ను లైంగిక దాడి కేసులో ఆదివారం తెల్లవారుజామున పాలక్కాడ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పోలీసు క్యాంపునకు తరలించారు. పోలీసుల ప్రకారం ఈనెల 8న పతానంతిట్ట జిల్లాకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు మేరకు పాలక్కాడ ఎమ్మెల్యేపై ఇటీవల మూడవసారి లైంగిక దాడి కేసు నమోదైంది. ప్రస్తుతం కెనడాలో ఉన్న ఆ మహిళ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసులకు తన వాంగ్మూలాన్ని ఇచ్చింది. వర్గాల సమాచారం ప్రకారం, ఫిర్యాదుదారు వివాహిత మహిళ. ఆమె తన వైవాహిక జీవితంలో సమస్యల కారణంగా 2024లో మమ్కూతతిల్‌తో పరిచయం ఏర్పరచుకుంది. పెళ్లి చేసుకుంటానని వాగ్దానం చేసి, ఏప్రిల్ 2024లో ఒక హోటల్‌లో మమ్కూతతిల్ తనపై అత్యాచారం చేశాడని ఆమె పోలీసులకు తెలిపింది. అత్యాచారానికి ముందు ఆమెపై దారుణంగా దాడి జరిగిందని రిమాండ్ నివేదిక పేర్కొంది. ఆమె గర్భవతి అయినప్పుడు, మమ్కూతతిల్ బాధ్యత తీసుకోవడానికి నిరాకరించి, అబార్షన్ చేయించుకోవాలని బెదిరించాడని పోలీసులు తెలిపారు. మమ్కూతతిల్ తన నుండి చాలాసార్లు డబ్బు కూడా తీసుకున్నాడని బాధితురాలు ఆరోపించింది. కేసు నమోదు చేసిన తర్వాత, పోలీసులు మమ్కూతతిల్‌పై నిఘా పెట్టారు. ఆ తర్వాత, ఒక డిప్యూటీ ఎస్పీ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం తెల్లవారుజామున 12.15 గంటల ప్రాంతంలో అతను బస చేస్తున్న హోటల్ గదికి చేరుకుందని వర్గాలు తెలిపాయి. తెల్లవారుజామున 12.30 గంటల ప్రాంతంలో అతడిని హోటల్ నుండి అదుపులోకి తీసుకుని, ఉదయం 5.30 గంటలకు పతానంతిట్ట పోలీసు క్యాంపునకు తరలించారు. అతనిపై ఇదే తరహాలో ఉన్న మరో రెండు కేసులను దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కే తాజా కేసు దర్యాప్తు బాధ్యతలను కూడా అప్పగించినట్లు వర్గాలు తెలిపాయి. సిట్ అధిపతి జి పూంగుజాలి పోలీసు క్యాంపునకు చేరుకుని మమ్కూతతిల్‌ను విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం అతన్ని అరెస్టు చేశారు. వైద్య పరీక్షల తర్వాత, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, ఆయన అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సిట్ అతని కస్టడీ కోరుతూ ఒక దరఖాస్తు దాఖలు చేసింది, దీనిని సోమవారం పరిశీలించనున్నారు. మమ్కూతతిల్ బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాడని, దానిని కూడా అదే రోజు పరిశీలిస్తారని పోలీసులు తెలిపారు. తరువాత, అతన్ని అలప్పుజ జిల్లాలోని మావెలికర సబ్ జైలుకు తరలించారు.

## ఉత్తరాదిని చంపేస్తున్న చలి..

**కశ్మీర్‌లో పాక్షికంగా గడ్డకట్టిన దాల్ సరస్సు**



**న్యూఢిల్లీ :** ఉత్తరాది రాష్ట్రాలను చలి చంపేస్తోంది. ముఖ్యంగా హిమాలయాల సమీపంలో ఉన్న రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. జమ్ము కశ్మీర్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నది. వీధుల్లో, ఇండ్లపైన ఎక్కడికక్కడ మంచు పేరుకుపోయింది. కశ్మీర్ లోయలోని సరస్సులు, చెరువులు, కుంటలలో ఉన్న నీరు గడ్డకట్టుకుపోయింది. కశ్మీర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన దాల్ సరస్సులో కూడా చలి తీవ్రతకు నీరు పాక్షికంగా గడ్డకట్టింది. సరస్సు పైభాగంలో చాలావరకు నీరు గడ్డకట్టి మంచు పొర ఏర్పడింది. ఇలాంటి సమయంలో దాల్ సరస్సును వీక్షించడం భక్తులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది.

**ఢిల్లీ 'గజగజ'**

దేశ రాజధాని ఢిల్లీని 'చలి' పులి గజగజ వణికిస్తోంది. నగరంలోని కొన్ని ప్రాంతాలలో ఆదివారం తీవ్రస్థాయిలో చలిగాలులు వీచాయి. కొన్ని ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు 4.1 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు అయ్యాయి. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 4.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యింది. ఇది కాలానుగుణ సగటు కంటే 2.6 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. తీవ్రతరమైన ఈ చలిగాలులకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. భారత వాతావరణ శాఖ ప్రకారం సోమవారం కూడా చలిగాలులు కొనసాగే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రత సగటు ఉష్ణోగ్రత కంటే 4.5 నుంచి 6.5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా ఉన్నప్పుడు శీతల గాలులు (కోల్డ్ వేవ్) ప్రకటిస్తారు. ఆదివారం నాడు సఫ్దర్‌జంగ్‌లో అతి తక్కువగా 4.8డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది. పాలంలో 3 డిగ్రీల సెల్సియస్ (సీజనల్ సగటు కంటే 4.3 నోచెస్ తక్కువ), లోధి రోడ్‌లో 4.6 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 1.4 నోచెస్ ఎక్కువ), ది రిడ్జి లో 3.7 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 4.4 నోచెస్ ఎగువన), అయానగర్‌లో 2.9 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 4.2 నోచెస్ తక్కువ) అని భారత వాతావరణ శాఖ డేటా చూపింది. ఢిల్లీ నగరంలో సాపేక్ష ఆర్ద్రత ఉదయం 8.30గంటలకు 97 శాతంగా నమోదు అయ్యింది. ఢిల్లీలోని వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ) ఉదయం 9గంటలకు 295 వద్ద 'పూర్' కేటగిరీ వద్ద ఉన్నదని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) డేటా చూపింది. 050 మధ్య 'గుడ్' అని, 51100 మధ్య 'సంతృప్తికరం' అని, 101200మధ్య 'మోడరేట్' కేటగిరీ 201 300 మధ్య 'పూర్' అని, 301400 మధ్య 'వెరీ పూర్' కేటగిరీ, 401500 మధ్య 'తీవ్రం'గా ఉందని భావిస్తారు. వాతావరణ శాఖ ఆదివారం చల్లటి గాలుల 'ఎల్లో అలర్ట్'ను అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

## ప్రముఖ సింగర్ ప్రశాంత్ తమాంగ్ కన్నుమూత



**న్యూఢిల్లీ:** ప్రముఖ సింగర్, ఇండియన్ ఐడల్ మూడవ ఎడిషన్ విజేత ప్రశాంత్ తమాంగ్ కన్నుమూశారు. గుండెపోటుతో ఆయన మరణించినట్టు తెలుస్తోంది. ప్రశాంత్ మరణాన్ని ఆయన స్నేహితుడు, ఇండియన్ ఐడల్ కో కంటెస్టెంట్ భవేన్ ధనాక్ ధ్రువీకరించారు. అకస్మాత్తుగా ప్రశాంత్ ఈ లోకాన్ని వీడటం తమను షాక్‌కు గురి చేసిందని చెప్పారు. గుండెపోటుతో ప్రశాంత్ మరణించినట్టు అనుకుంటున్నామని చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. ప్రశాంత్ కొంతకాలంగా ఢిల్లీలో ఉంటున్నారని ఆయన చెప్పారు. ఇండియన్ ఐడల్ సమయంలో తాము రూమ్ మేట్స్‌గా ఉండేవాళ్లమని కూడా వివరించారు. ఇండియన్ ఐడల్ ద్వారా పాప్యులర్ కాకమునుపు ప్రశాంత్ పశ్చిమ బెంగాల్ పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పని చేశారు. ఆయన భార్య, ఒక కూతురు ఉన్నారు. ఇక ప్రశాంత్ మృతిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తమను కలచివేసిందని అన్నారు. ఇండియన్ ఐడల్ షోలో రాణించడంతో పాటు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారని తెలిపారు. డార్జిలింగ్‌కు చెందిన ప్రశాంత్ పోలీసు శాఖలో కూడా పనిచేసి రాష్ట్ర ప్రజలకు మరింత దగ్గరయ్యారని అన్నారు. ఆయన కుటుంబసభ్యులు, స్నేహితులు, అభిమానులకు సంఘీభావం తెలిపారు. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన బ్యాటిల్ ఆఫ్ గల్వాన్‌లో ప్రశాంత్ ఇటీవల తళుక్కుమన్నారు.

## 'సోమనాథ్' పునర్నిర్మాణ వ్యతిరేక శక్తులు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయ్

**వాటిని ఓడించేందుకు భారత్ అప్రమత్తంగా, ఐక్యంగా, శక్తివంతంగా ఉండాలి : ప్రధాని మోదీ**



**సోమనాథ్:** స్వాతంత్ర్యం తర్వాత గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయని, వాటిని ఓడించడానికి భారతదేశం అప్రమత్తంగా, ఐక్యంగా, శక్తివంతంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సోమనాథ్ చరిత్ర విధ్వంసం, ఓటమికి సంబంధించినది కాదని, అది విజయం, పునరుజ్జీవనానికి సంబంధించినదన్నారు. 'ఇది కాలచక్రం, దాని కారణంగా మతతత్వ దురాక్రమణదారులు ఇప్పుడు చరిత్ర పుటలకే పరిమితమయ్యారు, కానీ సోమనాథ్ ఆలయం మాత్రం నేటికీ సగర్వంగా నిలబడి ఉంది' అని ఆయన అన్నారు. 1026వ సంవత్సరంలో గజనీ మహమూద్ సోమనాథ్ ఆలయంపై దాడి చేసి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడ జరిగిన సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో మోదీ ఆదివారం ప్రసంగించారు. శతాబ్దాలుగా దానిని నాశనం చేయడానికి అనేకసార్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ, సోమనాథ్ ఆలయం దాని ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడానికి చేసిన సామూహిక సంకల్పం, ప్రయత్నాల కారణంగా నేడు స్థితిస్థాపకత, విశ్వాసం, జాతీయ గర్వానికి శక్తివంతమైన చిహ్నంగా నిలుస్తోంది. 'విద్వేషం, అకృత్యం, భయభ్రాంతుల నిజమైన చరిత్రను మన నుండి దాచిపెట్టారు. ఆ దాడి ఆలయాన్ని దోచుకోవడానికి చేసిన ప్రయత్నమని మనకు బోధించారు' అని చెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత, సర్దార్ వల్లభాయ్ పటేల్ సోమనాథ్ ఆలయాన్ని పునర్నిర్మించడానికి ప్రతిజ్ఞ చేయగా, ఆయన మార్గానికి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. 'బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడిన వారు తీవ్రవాద మనస్తత్వం ఉన్న అలాంటి వ్యక్తుల ముందు మోకరిల్లారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించిన ఆ శక్తులు ఇప్పటికీ మన మధ్యనే ఉన్నాయి. అలాంటి శక్తులను ఓడించడానికి మనం అప్రమత్తంగా, ఐక్యంగా మరియు శక్తివంతంగా ఉండాలి' అని మోదీ అన్నారు. 'సోమనాథ్ కథ భారతదేశ కథ; ఈ ఆలయం వలెనే విదేశీ దురాక్రమణదారులు భారతదేశాన్ని చాలాసార్లు నాశనం చేయడానికి ప్రయత్నించారు. ఆలయాన్ని ధ్వంసం చేయడం ద్వారా తాము గెలిచామని ఆ దురాక్రమణదారులు భావించారు. కానీ 1,000 సంవత్సరాల తర్వాత కూడా సోమనాథ్ జెండా సగర్వంగా రెపరెపలాడుతోంది' అని మోదీ అన్నారు. 1,000 సంవత్సరాల ఈ పోరాటానికి ప్రపంచ చరిత్రలో సాటి లేదని ఆయన పేర్కొన్నారు.

## మనోభావాలు దెబ్బతీసినట్లు ఆరోపణలు స్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

**రాయ్‌పూర్:** దేశంలో మతవాదులు పేట్రేగిపోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మతపరమైన మనోభావాలను దెబ్బతీసినట్లు ఆరోపణలు రావడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది. 4వ తరగతి ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో అడిగిన ప్రశ్న సస్పెన్షన్‌కు దారితీసింది. కాంట్రాక్టు మహిళా ఉపాధ్యాయురాలు అయిన పేపర్ మోడరేటర్‌ను సర్వీస్ నుండి తొలగించడానికి కూడా క్రమశిక్షణా చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. రాయ్‌పూర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల జరిగిన అర్ధ వార్షిక పరీక్షల సమయంలో, ఒక ఇంగ్లీష్ పేపర్‌లో మోనా కుక్క పేరు ఏమిటి? అనే ప్రశ్నకు జవాబుగా ఎంచుకునేందుకు నాలుగు ఆప్షన్లు ఇచ్చారు. ఒక ఆప్షన్‌లో 'రామ్' అనే పేరు ఉంది. ఇది హిందూ మతంలో శ్రీరాముడు గౌరవనీయమైన దేవుడు కాబట్టి అభ్యంతరాలను రేకెత్తించింది. ఇతర ఎంపికలు 'బాలా', 'షేరు', 'నో వన్' అని ఉన్నాయి. ఈ విషయం మొదట మహాసముంద్ జిల్లాలో, తరువాత రాయ్‌పూర్ డివిజన్‌లోని ఇతర జిల్లాల్లో వెలుగులోకి వచ్చింది. ఇది వివాదానికి దారితీసింది. ఉదారవాద సంస్థల నుండి నిరసనలకు దారితీసింది. ఫిర్యాదుల ఈ విషయాన్ని పరిశీలించడానికి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

## బంగ్లాదేశీయుల నుంచి ముంబయికి విముక్తి

**సాంకేతికత ఆధారిత పాలనను అందిస్తాం మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోలో 'మహాయుతి' హామీ**

**ముంబయి:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి ఆదివారం మేనిఫెస్టోను విడుదల చేసింది. బంగ్లాదేశీయులు, రోహింగ్యాల నుండి ముంబయి నగరాన్ని విముక్తి చేస్తామనే హామీతో పాటు సాంకేతికత ఆధారిత పాలనను అందిస్తామని హామీనిచ్చింది. అవినీతిని అరికట్టడానికి, అనుమతులను వేగవంతం చేయడానికి, సేవా బట్వాడాను మెరుగుపరచడానికి కృత్రిమ మేధస్సు (ఎఐ)ను వినియోగిస్తామని కూడా వాగ్దానం చేసింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్నికల ప్రణాళికా పత్రాన్ని ఆవిష్కరించారు. దీర్ఘకాలిక పౌర సమస్యలను పరిష్కరించడానికి, పౌరుల మొబైల్ ఫోన్‌లకు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి స్థానిక అధికారయ యంత్రాంగంతో జపనీస్ టెక్నాలజీని జతపర్చాలని కూడా కూటమి ప్రణాళిక వేసిందని చెప్పారు. నగరం గత 25 సంవత్సరాలు అసమర్థత పాలనను చూసిందని, ఇప్పుడు పరిపాలనలో పారదర్శకతను తీసుకురావడానికి తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు చెప్పాలనుకుంటున్నానన్నారు. 'అవినీతి రహిత మునిసిపల్ కార్పొరేషన్ మా లక్ష్యం' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు. మొబైల్‌లో మునిసిపాలిటీ సేవలు, భవన అనుమతులను వేగంగా ట్రాక్ చేయడానికి, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకతను నిర్ధారించడానికి ఎఐ ఆధారిత సేవలను వినియోగిస్తామన్నారు. భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి మున్సిపల్ పాఠశాలల్లో ఎఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# కమ్యూనిజమే సాహిత్యానికి ప్రాణం..

కమ్యూనిస్టు దృక్పథం నేటి సాహిత్యంలో ఎందుకు మరింత కీలకంగా మారిందో అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనం జీవిస్తున్న సామాజిక– ఆర్థిక– రాజకీయ కాలాన్ని గమనించాలి. 21వ శతాబ్దపు తొలి పావు భాగం పూర్తవుతున్న ఈ దశలో ప్రపంచం ఒక వైపు అపూర్వమైన సాంకేతిక అభివృద్ధిని చూస్తుంటే, మరో వైపు అంతకుమించిన స్థాయిలో అసమానతలు, అస్థిరతలు, యుద్ధాలు, వలసలు, వాతావరణ సంక్షోభం, ఉపాధి సంక్షోభం వంటి బహుళ సంక్షోభాల మధ్య ఊగిసలాడుతోంది. ఈ విరోధాభాసాల మధ్య సాహిత్యం ఒక సున్నితమైన సిస్మోగ్రాఫ్‌లా పనిచేస్తూ సమాజపు లోతైన కంపనాలను పట్టుకుంటోంది. ఈ సందర్భంలో కమ్యూనిస్టు ఆలోచన ఒక రాజకీయ నినాదంగా కాకుం డా, ఈ కంపనాలను అర్థం చేసుకునే ఒక విశ్లేషణాత్మక కంటిలాగా సాహిత్యంలోకి తిరిగి ప్రవేశిస్తోంది. కమ్యూనిజం గురించి మాట్లాడేటప్పుడు చాలామందికి వెంటనే 20వ శతాబ్దపు సోవియట్ యూనియన్, చైనా సాంస్కృతిక విప్లవం, తూర్పు యూరప్ నియంతృత్వాలు గుర్తుకు వస్తాయి. అయితే అవి తీవ్రమైన లోపాలతో, మానవ హక్కుల ఉల్లంఘనలతో, రాజకీయ అణచివేతలతో గుర్తించబడిన చరిత్రాత్మక అనుభవాలన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. ఆ కోణంలోనే పుంఖాను పుంఖంగా రచనలు వెలువడ్డాయి కూడా. అయితే ఆ అనుభవాలను మార్క్స్ ప్రతిపాదించిన మూల సిద్ధాంతంతో సమానంగా చూడటం ఒక మేధో తప్పిదం. మార్క్సిజం అనేది ప్రధానంగా కాపిటలిస్టు సమాజాన్ని విశ్లేషించే ఒక విమర్శాత్మక సిద్ధాంతం. అది సంపద ఎలా ఉత్పత్తి అవుతుంది, ఎలా పంపిణీ అవుతుంది, ఆ ప్రక్రియలో ఎవరు లాభపడుతున్నారు, ఎవరు నష్టపోతున్నారు అనే ప్రశ్నలను అడుగుతుంది. సాహిత్యానికి ఈ ప్రశ్నలు అత్యంత సహజమైనవి, ఎందుకంటే సాహిత్యం ఎప్పుడూ మనుషుల జీవితం, వారి పోరాటాలు, వారి ఆశలు, వారి ఓటముల గురించే మాట్లాడుతుంది. కాగా, నేటి గ్లోబల్ కాపిటలిజం ఒక విచిత్రమైన దశలో ఉంది. ఒకవైపు బిలియనీర్ల సంఖ్య పెరుగుతోంది, స్టాక్ మార్కెట్లు రికార్డులు సృష్టిస్తున్నాయి, టెక్నాలజీ కంపెనీలు అపూర్వమైన లాభాలు ప్రకటిస్తున్నాయి. మరోవైపు కోట్లాది మంది ప్రజలు నిరుద్యోగం, తక్కువ వేతనాలు, అప్పులు, ఆరోగ్య వ్యయాలు, గృహాల కొరత వంటి సమస్యలతో పోరాడుతున్నారు. మధ్యతరగతి క్రమంగా సంకుచితమవుతోంది. ఈ ఆర్థిక విరోధం సాహిత్యంలో ప్రతిధ్వనించకుండా ఉండలేదు. ఆధునిక నవలలు, కథలు, కవితలు కార్పొరేట్ ప్రపంచంలో నలిగిపోతున్న వ్యక్తులను, గిగ్ ఎకానమీ కార్మికులను, డెలివరీ బాయ్స్, కాల్ సెంటర్ ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లను, స్టార్టప్ కలల వెనుక దాగి ఉన్న అనిశ్చితిని చిత్రిస్తున్నాయి. కమ్యూనిస్టు దృక్పథం ఈ కథనాలకు ఒక నిర్మాణాత్మక అర్థాన్ని ఇస్తుంది. ఈ బాధలు వ్యక్తిగత వైఫల్యాల వల్ల కాదు, వ్యవస్థలోని లోపాల వల్ల అని అది స్పష్టం చేస్తుంది. మార్క్స్ ప్రతిపాదించిన 'పరాయీకరణ' భావన నేటి డిజిటల్ యుగంలో మరింత గాఢంగా కనిపిస్తోంది. ఒకప్పుడు కార్మికుడు తన చేతులతో తయారు చేసిన వస్తువును చూసి కొంత సంతృప్తి పొందేవాడు. ఇప్పుడు అల్గారిథమ్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మధ్య మనిషి తన పని ఫలితాన్ని కూడా గుర్తించలేని స్థితిలో ఉన్నాడు. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాసిన కోడ్ ప్రపంచంలోని ఏదో మూలలో ఎవరో ఉపయోగిస్తారు, కానీ అతనికి ఆ వినియోగం యొక్క మానవీయ కోణం కనిపించదు. ఒక గిగ్ వర్కర్ యాప్ ద్వారా ఆదేశాలు అందుకుని పనులు చేస్తాడు, కానీ తన యజమాని ఎవరో కూడా తెలియదు. ఈ అనామకత్వం, ఈ విభ్రాంతి, ఈ అర్థరహితత సాహిత్యంలో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లుగా రూపాంతరం చెందుతోంది. కమ్యూనిస్టు విశ్లేషణ ఈ పరిస్థితిని ఒక వ్యక్తిగత డిప్రెషన్‌గా కాకుండా, ఉత్పత్తి సంబంధాల ఫలితంగా చూపిస్తుంది. అందువల్ల ఒక కథానాయకుడి ఒంటరితనం కూడా రాజకీయ అర్థాన్ని పొందుతుంది.

నేటి మీడియా సంస్కృతి కూడా మార్క్స్ చెప్పిన పాలక వర్గపు ఆలోచనలు భావనను గుర్తు చేస్తుంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మన దృష్టిని ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్స్, వైరల్ వీడియోలు, సెలబ్రిటీ గాసిప్‌ల వైపు మళ్లిస్తుంటాయి. వినియోగం ఒక జీవనశైలిగా మారింది. బ్రాండ్లు మన స్వీయ గుర్తింపులు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసమానతలు, కార్మిక హక్కులు, పర్యావరణ విధ్వంసం వంటి మౌలిక ప్రశ్నలను తరచూ అంచుల్లోకి నెట్టివేయడం కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. సాహిత్యం, కమ్యూనిస్టు దృష్టితో, ఈ మాయాజాలాన్ని ఛేదించగలదు. ప్రకటనల వెనుక ఉన్న శక్తి సంబంధాలు, మీడియా యాజమాన్యాల రాజకీయాలు, వినోద పరిశ్రమలోని వర్గభేదాలు కథలుగా వెలుగులోకి వస్తాయి. ఈ విధంగా సాహిత్యం ఒక సాంస్కృతిక ప్రతిఘటనగా మారుతుంది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు, రైతు పోరాటాలు, మహిళా హక్కుల ఉద్యమాలు, జాతి వివక్షకు వ్యతిరేక ఉద్యమాలు మళ్లీ ఊపందుకున్నాయి. ఇవి రాజకీయ వార్తలుగా మాత్రమే కాదు, సాహిత్య ఇతివృత్తాలుగా కూడా మారుతున్నాయి. నిరసనల్లో పాల్గొనే యువత, పోలీస్ అణచివేత, సోషల్ మీడియా ద్వారా



సంఘీభావం, ఉద్యమాల అంతర్గత విభేదాలు... వంటి అంశాలన్నీ రచనల్లో ప్రతిబింబిస్తున్నాయి. కమ్యూనిస్టు ఆలోచన ఈ పోరాటాలకు ఒక చారిత్రక–సిద్ధాంతాత్మక నేపథ్యాన్ని ఇస్తుంది. అది ఈ ఉద్యమాలను విడివిడిగా కాకుండా, ఒక విస్తృత తరగతి పోరాటంలో భాగంగా చూపిస్తుంది. వాతావరణ సంక్షోభం నేటి సాహిత్యంలో అత్యంత కీలక అంశంగా ఎదిగింది. వరదలు, కరువులు, అడవుల నాశనం, సముద్ర మట్టం పెరుగుదల, వలసలు తదితరాలన్నీ మనిషి–ప్రకృతి సంబంధం ఎంత అస్థిరంగా మారిందో చూపిస్తున్నాయి. కార్పొరేట్ లాభాల కోసం భూమిని, నీటిని, గాలిని దోచుకోవడం ఈ సంక్షోభానికి మూల కారణం. ఈ నేపథ్యంలో ఈకో–సోషలిస్టు ఆలోచనలు సాహిత్యంలోకి వస్తున్నాయి. సామూహిక యాజమాన్యం, స్థిరమైన వినియోగం, స్థానిక సమాజాల హక్కులు వంటి భావనలు కథలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఒక అడవి గ్రామం తన భూమిని కార్పొరేట్ మైనింగ్ నుంచి రక్షించుకునే కథ, ఒక తీరప్రాంత సమాజం వాతావరణ మార్పులతో పోరాడే గాథ వంటివన్నీ కమ్యూనిస్టు దృష్టితో ఒక పెద్ద పర్యావరణ–సామాజిక కథనంగా మారుతాయి.

భారతీయ సందర్భంలో కూడా ఈ దృక్పథం ఎంతో ప్రాసంగికం. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నప్పటికీ, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ యువత, పట్టణ పేదరికం, అసంఘటిత రంగ కార్మికుల అస్థిరత వంటి వాస్తవాలు తీవ్రమైన వ్యత్యాసాన్ని చూపుతున్నాయి. తెలుగు, హిందీ, మలయాళం, తమిళం వంటి భాషల్లో వస్తున్న నేటి సాహిత్యం ఈ వ్యత్యాసాలను బలంగా పట్టుకుంటోంది. ఐటీ నగరాల మెరుపుల వెనుక ఉన్న వలస కార్మికుల కష్టాలు, గ్రామాల నుంచి నగరాలకు తరలివచ్చే యువత యొక్క కలలు–నిరాశలు, ప్రైవేటీకరణ వల్ల నష్టపోతున్న ప్రజా రంగం... ఇవన్నీ ఆధునిక కథనాల కేంద్రంగా ఉన్నాయి. కమ్యూనిస్టు విశ్లేషణ ఈ అనుభవాలను ఒక సామాజిక మ్యాప్‌లో అమర్చుతుంది.

డిజిటల్ యుగంలో సాహిత్య ఉత్పత్తి, పంపిణీ, వినియోగం కూడా మారిపోయింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఈ–బుక్స్, సోషల్ మీడియా కవిత్వం, వెబ్‌సిరీస్‌ల రూపంలో కథనాలు విస్తరిస్తున్నాయి. కానీ ఈ డిజిటల్ ప్రజాస్వామ్యానికి కూడా కార్పొరేట్ యాజమాన్యాలు, అల్గారిథమ్‌లు, డేటా ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయనే వాస్తవం ఉంది. ఎవరి కథలు కనిపిస్తాయి, ఎవరి కథలు కనిపించవు అన్నది కూడా మార్కెట్ లాజిక్ నిర్ణయిస్తుంది. కమ్యూనిస్టు దృష్టి ఈ కొత్త సాంస్కృతిక రాజకీయాలను విశ్లేషించడానికి సాహిత్యానికి ఉపకరిస్తుంది. ఏదిఏమైనా, కమ్యూనిస్టు భావజాలం నేటి సాహిత్యంలో ఒక సిద్ధాంతపు సంకెళ్లుగా కాదు, ఒక విమర్శాత్మక స్వేచ్ఛగా కనిపిస్తోంది. అది రచయితలకు సమాజాన్ని లోతుగా చూడడానికి, పాఠకులకు తమ అనుభవాలను పెద్ద చిత్రంలో అర్థం చేసుకోవడానికి సహాయపడుతోంది. అసమానతల కాలంలో, విభ్రాంతి కాలంలో, సంక్షోభాల కాలంలో సాహిత్యం కేవలం వినోదం కాదు; అది ఒక నైతిక, మేధో బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో కమ్యూనిస్టు దృక్పథం ఒక కీలక మిత్రంగా నిలుస్తోంది. అందుకే నేటి సాహిత్య పత్రికలు, విమర్శకులు, రచయితలు ఈ దృష్టిని తిరిగి పరిశీలిస్తున్నారు. అది మనకు ఒకే ఒక్క రాజకీయ సమాధానాన్ని ఇవ్వకపోవచ్చు, కానీ మనం అడగాల్సిన ముఖ్యమైన ప్రశ్నలను మాత్రం స్పష్టంగా మన ముందుంచుతుంది. ఈ ప్రశ్నలే సాహిత్యాన్ని సజీవంగా ఉంచుతాయి, సమాజాన్ని కదిలిస్తాయి, భవిష్యత్తును ఊహించుకునే శక్తిని మనకు ఇస్తాయి.

– బిఎల్

## ఈ వారం కవితలు (వందేళ్ల సిపిఐ సంబురాల సందర్భంగా)

### సిపిఐ నూరేళ్ల గీతం



నెత్తుట తడిసిన జెండాను
ఎక్కుపెట్టి పిడికిళ్లను ఎత్తింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

కత్తులు ఎదురొస్తుంటేను
ఎదురు నిలిచి
జై కొట్టి కుత్తుకలనిచ్చింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

మొట్టమొదట సంపూర్ణ స్వరాజ్యం
మా హక్కు చాటింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

నిజాం దొరలను తరిమింది
ప్రజలకు గొంతుకనిచ్చింది
ప్రజాకవుల సృష్టించింది

ఇదిరా వందేళ్ల చరిత్ర
ఇదిరా నూరేళ్ళ చరిష్మా
కదులు ఈ నిజం తెలిసి
కదులు నీ భుజం కలిపి
సోదరీ... సోదరా

బ్రిటీషు కుట్ర కేసులను స్వీకరించి
చిరునవ్వుతు ఢీకొంది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
సాయుధ పోరున

నాల్గువేల ప్రాణాలనిచ్చి
తెలంగాణను ఎరుపెక్కించింది

దేశంలో కోటీ ఎకరాల భూమి
పేదలకు పంచింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
॥ఇదిరా వందేళ్ల॥

ప్రజాసామ్యదేవాలయమనె
పార్లమెంటు ప్రారంభం చేసింది
రావి నారాయణ రెడ్డి
కమ్యూనిస్ట్ – కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
పార్లమెంటు తొలిసారి మహిళ బిల్లు
రూపొందించినది
గీత ముఖర్జీ బెంగాలీ
కమ్యూనిస్ట్ – కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
ప్రపంచాన ఎన్నిక ద్వారా
గెలిచిన తొలి కేరళ రాష్ట్రం
నంబూద్రిపాద్ సిఎం
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
॥ఇదిరా వందేళ్ల॥

కార్పొరేట్ ప్రభువులను
ప్రజల చేత ఛీకొట్టి జయించేది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్


మతోన్మాదుల కుట్రలను
మూటకట్టి భూమట్టం చేసేది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
కమ్యూనిస్టులను కలుపుకొని
ఢిల్లికోటపై జెండెగరేసేది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
॥ఇదిరా వందేళ్ల॥

– సుద్దాల అశోక్ తేజ

# 'నా మౌనం.. చితాభస్మం కాదు'

జనవరి 12న అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా

పొట్టి పొట్టి కవితలతో గట్టిగా చెప్పినవాడు అలిశెట్టి ప్రభాకర్. ప్రారంభంలో బొమ్మలు వేస్తూ ఆర్టిస్టుగా ఎదిగాడు. జగిత్యాల సాహితీ మిత్రదీప్తి సంస్థ పరిచయంతో కవిత్వరంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వారపత్రిలో 'పరిష్కారం' మొదటి కవిత అచ్చయింది. తన కళ ప్రజల కోసమే అని చివరివరకు నమ్మినవాడు. ఎర్రపావురాలు(1978) మొదటి కవితా సంకలనం. మంటల జెండాలు, చురకలు(1979), రక్తరేఖ(1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990), సిటీలైఫ్ (1992) ముద్రించిన కవిత్వ సంకలనాలు. అలిశెట్టి ప్రభాకర్ స్త్రీల కోణంలో రాసిన కవితలకు పరిమితమై ఈ వ్యాసం రాయదల్చుకున్నాను.అలిశెట్టికి జీవితం పట్ల, సమాజం పట్ల ఖచ్చితమైన భౌతికవాద దృక్పథం ఉన్నది. ఒకవైపు అనుభూతి కవిత్వం, మరోవైపు వ్యక్తివాద కవిత్వం పోటీ పడుతున్న సమయం. అభ్యుదయ కవిత్వం మరోవైపు విప్లవ కవిత్వం రావటం. ప్రజలు పోరాటం చేస్తుంటే వాళ్ళ కుటుంబాలు అనూహ్యమైన బాధలకు గురవుతున్న సమయం. అలాంటి కాలంలో తగినంత భావశక్తి, సరైన భావజాలం ఉన్నవాడు అలిశెట్టి ప్రభాకర్. అదే భావజాలాన్ని పాఠకులకు సులభంగా అందించే సంక్షిప్త భాషా పటిమ కలిగిన ప్రభాకర్ తన బలం కవిత్వమే అని నమ్మినవాడు. దానినే ఆయుధంగా చేసుకున్నవాడు. సుప్రసిద్ధ గాయని బెల్లి లలితను పద్నాలుగు ముక్కలు చేసినప్పుడు గొంతు కోస్తే/పాట ఆగిపోదు/అదిముక్తకంఠం/గొలుసు వేస్తే/పోరు నిలిచిపోదు/అదిప్రజాయుద్ధం అని రాయగల్గిన కవి. చిన్న కవితలతో ఎంత ముద్ర వేశాడో పెద్ద కవితలు కూడా అంతే బాగా రాశాడు. నేలమీద పురుగులతో సమానమైన, జనాభాలో సగం అయిన స్త్రీల గురించి కవికి చాలా గౌరవం. చాలా కవితల్లో వారి గురించి రాశాడు. 'వేశ్య'కవిత తెలియని కవి ఉండడంటే అతిశయోక్తి కాదు.



**తను శవమై/ఒకరికి వశమై**
**తనువు పుండై... ఒకడికి పండై**
**ఎప్పుడూ ఎడారై... ఎందరికో ఒయాసిసై**

వేశ్య దుర్భర జీవితాన్ని, హింసను చిన్న కవితలతో చెప్పిన పద్ధతి మనకు కన్నీళ్లు తెప్పించక మానదు. వెల(యాలు)మరో కవితలో భిన్నంగా వేశ్యలు కన్నుగొట్టి రమ్మన్నా/గుండె బిగబట్టుకు సాగిపోయేవాడు/సాధారణంగా సామాన్యుడు అని అన్నాడు. ఆమె యవ్వనం రాయని వీలునామా లో ఆమెది ఉరి బిగించుకున్న జీవితం అంటాడు.అంటే విలవిల్లాడటం.మూగబోయిన గొంతైనా పాడక తప్పదంటూ రోజుకో పదిమంది కీచకులకి స్వాగ తం పలకటంగా అభివర్ణించిన తీరులో ఒక మనోవేదన కూడా కనిపిస్తుంది. అత్యాచారం చేసి లేదా పెళ్లి చేసుకుంటానని అమ్మాయిని శారీరకంగా వాడుకొని మొహం చాటేస్తారు. ఇలాంటి వాటి ని కొన్నిచోట్ల పెద్దమనుషుల్లో పెట్టి పంచాయతీ అని చేసి కొంత డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వాటిని ఖండిస్తూ శీలం విలువను కొలువడానికి, కుమిలి పోడానికి కవి హృదయం లేదంటాడు. స్త్రీకి జరిగిన అన్యాయం గురించి ఆలోచించకుండా, జరగడానికి ఏర్పడిన పరిస్థితులు గమనించకుండా, డబ్బుతో ముడిపెట్టి చూడటం బాధపెట్టే అంశం. 'వీరుడితో కరచాలం' అనే కవితలో ప్రస్తావించబడింది. అందుకే అశ్రుకావ్యం కవితలో ఆమె నెత్తుటి గాయాల సంపుటి/రగిలే బాధల కుంపటి అని నిర్ధారించాడు. అంతేగాక

**కర్కశ పాదాల్ని మోస్తూ/కఠోర తపస్సులా...**
**శకలాలుగా మిగిలిన రాత్రుళ్ళపై**
**శవాసనం వేసే విషాద భరిత చిత్రంలా... ఆమె అగ్ని సముద్రం మీదే అందాల పడవ** అంటాడు. ప్రసవం స్త్రీకి పునర్జన్మ అంటాడు. ఆ సమయంలో నొప్పుల బాధ తట్టుకోలేకపోతుంది. స్త్రీ ప్రసవ వేదనను గావుకేక, చావుకేక అంటాడు. స్త్రీని సూటిగా శరీర సౌందర్యాన్ని బహిర్గతం చేసే ఉల్లి పొర లాంటి చీరనా? వెండితెరనా? ప్రశ్న తలెత్తటం కన్పిస్తుంది. నాగరిక ప్రపంచంలో స్పృహకు వచ్చి కోల్పోయిన కాలంలో ఏది ప్రేమ రాసలీల ప్రకటనల క్యాన్వసుగా మారిందనేది కూడా కవి ప్రశ్న. ముక్కు మొహం తెలియని వ్యక్తి పెళ్లి చేసుకోడానికి రావటం, కట్నం డిమాండ్ చెయ్యడం. అలాంటి ఆగాతకున్ని సునిశితంగా పరిశీలించాలనే ధోరణి కనిపిస్తుంది. మార్కెట్‌లో వస్తువును తీసుకున్నప్పుడు రేటు కట్టడం లాంటిది. ఖరీదు కట్టి తెచ్చుకున్న వస్తువు మనింటికే వస్తుంది. ఉపయోగించుకుంటాం. కానీ ఇక్కడ రివర్స్‌గా కొనసాగుతుంది. అమ్మాయే డబ్బులిచ్చి అబ్బాయి ఇంటికి వెళ్ళి వెట్టిచాకిరి చేస్తుంది. స్త్రీలు వేశ్యా గృహాల్లో బంధించబడుతున్నారు. వెండితెర అనే విషపు కోరల్లో చిక్కుకుంటున్నారు. అనేక రకాలుగా వెలివేయబడుతున్నారు. మీరెవరంటూ అబలలా?అందాల రాశులా? చిలుకలా? సీతాకోకచిలుకలా? ఏదో తేల్చుకొమ్మనట్టుగా ఉంటుంది ఈ కవిత. స్త్రీల మానభంగంకు పురాణాలు, ప్రబంధాలు వేదికలే. పురుషహంకారం ఉన్నచోటల్లా ఆడది క్షణికమైన కోరికగా మారిందనే ప్రస్తావన కనిపిస్తుంది. పగలూ, రాత్రి విలపించేది కూడా ఎవరు? ఇంకెవరూ ఆడది మొహందీలా వాడది అనటంలోనే స్త్రీల జీవితాలను అర్థం చేసుకున్న వైనం, సామాజిక పరిశీలన అర్థం అవుతుంది. జీవితాంతం సంసారంలో శక్తి హీనురాలే మొ'గుడి' ముందు చేతులెత్తి నమస్కరిస్తూ భక్తురాలుగా బ్రతుకీడుస్తుందంటాడు. స్త్రీలు శక్తివంతులుగా మారాలనేది కవి అభిప్రాయం. ఒక్క స్త్రీపై సమూహపు అత్యాచారాలను పిచ్చివాళ్ళ సామూహిక విధ్వంసకాండగా చెపుతూ నీచమైన ప్రపంచం అంటాడు. అందుకే మహిళా కళాశాలలో గానీ, హాస్టల్ గదిల్లో గానీ తాత్కాలికంగానైనా కత్తులు మెరవాలంటాడు. స్త్రీలు తమను తాము రక్షించుకోవాలనే సందేశం ఇందులో కనిపిస్తుంది. నీతి లేకుండా పోయింది. ప్రేమ లేదు. శరీరాన్ని కాంక్షిస్తున్నారు. ఆత్మసౌందర్యం వదిలి, ఆభరణాలను ఒలుచుకుంటున్నారు. ఇంద్రధనుస్సులా కలలు కన్న స్త్రీల జీవితాలు, కళ్యాణమంటపాల మంటల్లోనే బూడిదవుతున్నాయి. ఇంత దుర్మార్గం కూడా సర్వసాధారణంగా మారిందంటాడు. అమ్మపాల అమ్మక దేశ ద్రోహం, మానభంగాలు, లైంగిక దోపిడీ, వరకట్నపు చావులు, అత్యాచారాల మధ్య నలిగిపోయి అవశేషాలుగా మిగులుతున్న స్త్రీజాతి అవశేషాలే మళ్ళీ మగ సంతానం కోసం ఉవ్విళ్లూరుతున్నారని అంటాడు. కానీ ఆ మగ సంతానం కోసం కుటుంబాల్లో స్త్రీలపై ఎంత ఒత్తిడి, హింస ఉంటుందో? తెలియని విషయం కాదు. వంశం కోసం కొడుకే ఉద్ధరిస్తాడని పున్నామ నరకం తప్పిస్తాడని మూఢమైన ఆలోచనల వల్ల కూడా స్త్రీలు పుత్ర సంతానం కోసం ఆరటపడ్డారని చెప్పక తప్పదు. కవి సహచరి భాగ్యలక్ష్మిని ఉద్దేశించి ఆమెకు ప్రసిద్ధిగాంచిన బెర్నార్డ్ షా, షేక్స్‌పియర్, చలం, గురజాడ తెలియదంటాడు. అడుగంటిన కిరసనాయిలుతో స్టవ్ మీద అన్నం వండటం, గాజు కుప్పెల్లాంటి అతని కళ్ళల్లోనే ఆశల అగరొత్తులు వెలిగించుకుంది అంటాడు. ఎప్పుడూ ఐశ్వర్యం, బంగారం కోరలేదంటాడు. ఉన్నదాంతోనే సర్దుకుపోయి, ప్రభాకర్‌ని అర్థం చేసుకొని సాధారణమైన జీవితం గడిపినామెను గొప్పగా ఆవిష్కరించాడు. అలిశెట్టి యువకుడుగా ఎదిగే సమయంలోనే సిరిసిల్లా, జగిత్యాలలో రైతాంగ పోరాటాలు జరిగాయి. భావకుడుగా, కళాత్మక దృష్టి దీన్ని ప్రభాకర్ కవిగా, చిత్రకారుడిగా ముందుకు రావటం, ఈ రైతాంగం పోరాటాలు కాలానికి కంచెకు కొత్త దృష్టిని, పదునునూ నిత్యనూతన చైతన్యం అందించాయి. తనొక నిబద్ధత, పీడిత ప్రజల రచయితగా ప్రకటించుకున్నాడు. పీడిత ప్రజలలో అత్యంత పీడితులు స్త్రీలుగా గుర్తించాడు. ఈ వ్యవస్థ మీద కసితో ఆయన పదునెక్కిన కవిత్వం మనకు నిరంతరం స్పృశిస్తుంది.

– శోభ రమేష్
8978656327

# వామపక్షభావ సాహిత్య కీర్తిశిఖరం 'జాక్ లండన్'



అమెరికన్ రచయిత 'జాక్ లండన్'ను ఆయన 150వ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా సాహిత్య, వామపక్ష వర్గాలు స్మరించుకుంటున్నాయి. జాక్ లండన్ జీవితం ఒక అసాధారణ ప్రయాణం. అది ఒకవైపు అణగారిన వర్గాల నుంచి ఎదిగిన రచయిత కథ అయితే, మరోవైపు విప్లవాత్మక ఆలోచనల నుంచి వెనక్కి తగ్గిన ఒక విషాద గాథ కూడా. ఆయన కేవలం రచయిత మాత్రమే కాదు.. తన కాలంలోని సామాజిక అన్యాయాలపై గళమెత్తిన ఉద్యమకారుడు, సోషలిస్టు ఆలోచనల ప్రచారకుడు. జాక్ లండన్ 1876 జనవరి 12న జన్మించారు. పేదరికం, కఠినమైన శారీరక శ్రమ ఆయన బాల్యాన్ని ఆక్రమించాయి. ఫ్యాక్టరీల్లో పని చేయడం, నిరుద్యోగం, ఆకలి— ఇవన్నీ ఆయనకు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క కఠినతను ప్రత్యక్షంగా అనుభవింపజేశాయి. ఈ అనుభవాలే ఆయనను సోషలిజం వైపు నడిపించాయి. 1894లో అమెరికాలో తీవ్రమైన ఆర్థిక మాంద్యం నెలకొన్న సమయంలో, నిరుద్యోగుల ఉద్యమంగా ప్రసిద్ధి చెందిన 'కెల్లీ ఆర్మీ'తో కలిసి వాషింగ్టన్ డిసికి చేసిన పాదయాత్ర ఆయన ఆలోచనలను మలుపు తిప్పింది. ఇది అమెరికా చరిత్రలోనే మొదటి పెద్ద నిరసన మార్చ్‌గా నిలిచింది.ఈ ప్రయాణంలో జాక్ లండన్ తొలిసారి మార్క్స్, ఎంగెల్స్ రచనలను చదివారు. ముఖ్యంగా 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ఆయనపై గాఢమైన ప్రభావం చూపింది. తరగతి పోరాటం వాస్తవమని, వ్యక్తిగత యాజమాన్యం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని, చివరికి సోషలిజం తప్పనిసరిగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఆయన జీవితాంతం నిలిచిపోయింది. ఈ అనుభవాల్ని ఆయన 'ది రోడ్' (1907) అనే రచనలో పొందుపరిచారు. ఈ దశ నుంచే జాక్ లండన్ రచయితగా, ఉద్యమకారుడిగా అత్యంత ప్రభావవంతమైన కాలంలోకి ప్రవేశించారు. సోషలిస్ట్ లేబర్ పార్టీ, తరువాత సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికాలో క్రియాశీల సభ్యుడిగా మారారు. ప్రముఖ ఉపన్యాసకుడిగా యేల్, హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో కూడా విప్లవం సమీపంలో ఉందని ధైర్యంగా ప్రకటించారు. ఆయనకు సాహిత్యం ఒక ఆయుధం. 'ది పీపుల్ ఆఫ్ ది అబిస్' (1903) అనే రచనలో లండన్ నగరంలోని పేదల జీవన నరకాన్ని చిత్రించి, పెట్టుబడిదారీ వ్యవస్థపై తీవ్రమైన విమర్శ చేశారు. ఈ రచనతో ఆయనకు అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో గుర్తింపు వచ్చింది. ఈ కాలంలో ఆయన అనేక వ్యాసాలు, కథలు రాశారు. 'వార్ ఆఫ్ ది క్లాసెస్' (1905)లో ఆయన సోషలిస్టు ఆలోచనలను స్పష్టంగా వివరించారు. బాల కార్మికుల దోపిడీపై 'ది అపోస్టేట్', కార్మిక నాయకులపై జరిగిన కుట్రలను ప్రశ్నించిన 'సమ్థింగ్ ఈజ్ రాటెన్ ఇన్ ఐడహో', సామూహిక బలాన్ని చాటిన 'ది స్ట్రెంగ్త్ ఆఫ్ ది స్ట్రాంగ్' వంటి రచనలు ఉద్యమానికి సిద్ధాంత ఆయుధాలుగా మారాయి. ఇవి పాంఫ్లెట్ల రూపంలో విస్తృతంగా ప్రచారం పొందాయి. ఈ కాలానికి శిఖరంగా నిలిచిన రచన 'ది ఐరన్ హీల్' (1908). ఇది జాక్ లండన్ మేధో వారసత్వానికి ప్రతీక. ఏకాధిపత్య పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా నియంతృత్వంగా మారుతుందో, ఆర్థిక శక్తులు ఎలా ప్రజాస్వామ్యాన్ని, మీడియాను, చట్టాన్ని, మతాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకుంటాయో ఈ నవల తీవ్రంగా చూపిస్తుంది. శాంతియుత మార్గాల్లో వ్యవస్థ మారదన్న స్పష్టమైన హెచ్చరిక ఇందులో ఉంది. ఇది కేవలం విప్లవాత్మక నవలే కాదు; ఆధునిక డిస్టోపియన్ సాహిత్యానికి పునాది. 1905 రష్యా విప్లవం రక్తపాతంతో అణచివేయబడిన తర్వాత, పాలక వర్గం స్వచ్ఛందంగా అధికారాన్ని వదిలిపెట్టదన్న నిశ్చయానికి జాక్ లండన్ వచ్చారు. 1917–18 విప్లవాలు, మొదటి ప్రపంచ యుద్ధం, ఫాసిజం ఎదుగుదలను ఆయన ముందే ఊహించారు. ఇటలీ, జర్మనీలో వచ్చిన నియంతృత్వాలకు ఆయన 'ఐరన్ హీల్' స్పష్టమైన ముందస్తు హెచ్చరికగా నిలుస్తుంది. అయితే, ఆయన జీవితంలో తీవ్రమైన విరుద్ధతలు కూడా ఉన్నాయి. 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్' వంటి రచనలతో వచ్చిన అపార సంపద ఆయనను విలాస జీవితం వైపు నడిపించింది. గ్లెన్ ఎలెన్‌లో రాంచ్ కొనుగోలు చేసి, వాణిజ్య రచనల వైపు మొగ్గుచూపారు. ఒకప్పుడు అంతర్జాతీయ కార్మిక ఐక్యతను ప్రచారం చేసిన ఆయన, తరువాత కాలంలో ఆంగ్లో–సాక్సన్ జాతి ఆధిక్యత భావాలను వ్యక్తం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 1911లో మెక్సికన్ విప్లవాన్ని సమర్థించిన జాక్ లండన్, 1914లో అమెరికా సామ్రాజ్యవాద జోక్యాన్ని సమర్థించడం ఆయన రాజకీయ పతనానికి సంకేతం. చివరికి 1916లో సోషలిస్ట్ పార్టీ నుంచి రాజీనామా చేశారు. జీవితాంతంలో ఆయన అనారోగ్యం, ఒంటరితనం, నిరాశలో మునిగిపోయారు. 'మార్టిన్ ఈడెన్' నవలలో ఆయన వర్ణించిన నిరాశే ఆయన జీవితానికి ప్రతిబింబంగా మారింది. 1916లో కేవలం 40 ఏళ్ల వయసులో ఆయన మరణించారు. ఎన్నో వైరుధ్యాల మధ్యన కూడా జాక్ లండన్ ఒక గొప్ప కార్మిక వర్గ రచయితగానే నిలుస్తారు. పోరాటంలో పుట్టిన స్వరం, ప్రతిభతో విస్తరించిన ఆలోచన, చివరకు అదే వ్యవస్థ విరోధాభాసాల్లో మౌనమైన ఒక విప్లవాత్మక మేధావి ఆయన. ముఖ్యంగా 'ది ఐరన్ హీల్' ప్రపంచ సాహిత్యంలో సామ్రాజ్యవాద యుగాన్ని విశ్లేషించిన తొలి డిస్టోపియన్ నవలగా, నేటికీ అత్యంత ప్రాసంగికమైన రచనగా నిలిచింది.

### కమ్యూనిస్టు కంచుకోట ఖమ్మం పిలుస్తోంది పద కామ్రేడ్

కమ్యూనిస్టు కంచుకోట
ఖమ్మం పిలుస్తోంది పదకామ్రేడ్
వందేళ్ళ సిపిఐ ఉత్సవాల సభకు
రారామ్మని
ఖమ్మం పిలుస్తోంది పద కామ్రేడ్స్
నల్లబంగారు నేలపైన
ఎర్రదండు పోటెత్తినట్లు
ఎర్ర సంద్రమేదో పొంగి పొర్లి
ఖమ్మమంతా ముంచెత్తినట్లు
ఎర్ర జెండాల జాతర
సాగుతుందట
ఆ ఉత్సవాల సభ చూసొద్దాం పద
కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
గిరిజన లంబాడీ కోయదొరల
డప్పు దరువులుంటయంట
ఎర్రసేన కర్రసాము
కవాతులు చేస్తరంట
విప్లవగేయాల హోరులోన
ఖమ్మమంతా మారుమోగి పోతదంట
వందేళ్ళ కమ్యూనిస్టు సభల
సంబరాలు చూసొద్దాం పద
కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
పోరుబిడ్డలు శేషగిరి రజబలి
నల్లమల గిరి ప్రసాదులు
నడయాడిన పుణ్యభూమి
తాకి వద్దాం పద కామ్రేడ్స్
దేశ దేశాల కమ్యూనిస్టు నేతలు
విప్లవ సందేశాలిస్తరంట
ఆ సందేశాలు విని వద్దాం పద
కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
అలనాటి కమ్యూనిస్టు పార్టీ
నిర్మాతలు కామ్రేడ్ ఘాటే జోషి
చంద్ర డాంగేలు తెలంగాణ
సాయుధ
పోరుకు పిలుపునిచ్చిన రావి,
బద్దం, మఖ్దూం
నైజాం జైలు గదుల్లో జంగ్ నడిపిన
ధర్మభిక్షం
ఉద్యమాల రణం మన
సురవరంలకు
జోహార్లు అర్పిద్దాం పద కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
ఎర్రజెండా వందేళ్ళ ఉద్యమాలకు
ఎనలేని వీరుల త్యాగాలకు
లాల్‌సలాములు చేసొద్దాం పద
కామ్రేడ్స్
ఖమ్మం ఉత్సవాల సభను
చూసొద్దాం పద కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥

– బొమ్మగాని నాగభూషణం
9849622633

### వందేళ్ళ జెండా

వందేళ్ళ జెండా
బీదసాదల చేతుల్ల జెండా
గుండెలనిండా భరోసానిచ్చే జెండా
ఎర్రెర్రని జెండా ఎగరాలి వాడవాడల్లా!

కాన్పూర్ తొలిమెట్టై
సకల జనుల హక్కులకోసం
కదిలిన జెండా!
ఎన్నెన్ని ఒడిదుడుకులు ఎదురైనా
వెన్ను చూపని జెండా!
సామ్యవాదం ఎజెండాగా
మార్క్సిజమే సిద్ధాంతంగా పోరు
సల్పుతున్న జెండా!
॥వందేళ్ళ॥
భూమికోసం భుక్తి కోసం
పల్లెపల్లెను కదిలించిన జెండా!
వనితలంతా కొంగు నడుముకు
చుట్టి
గడీలపై తిరుగుబాటుకు
ఊతమిచ్చిన జెండా!
గడీలనే కూల్చిన జెండా!
॥వందేళ్ళ॥
తుపాకీ గుళ్ళకి నేలకొరిగిన త్యాగ
మూర్తులతో స్ఫూర్తినొందిన
జెండా!
ఊడిగం బతుకుల చెర నుండి
విముక్తి ప్రసాదించిన జెండా!
రజాకార్ల దేశ్‌ముఖ్‌ల భరతం
పట్టిన జెండా!
ఊరూరా ఇంకా వెలిసిపోని ఎర్ర
జెండా దిమ్మెలు స్తూపాలు చరిత్రకి
ఆనవాళ్ళుగా!
॥వందేళ్ళ॥
ఎవడెవ్వడో
నిరక్షరకుక్షులెందరో
మత ఛాందస మెదళ్ళు పోరాటాన్ని హైజాక్ చేయ చూసినా
చెక్కు చెదరని సిద్ధాంత వాసన
పోని పల్లెలే తరిమికొడుతున్నాయ్!
అదే! అదే! ఎర్రజెండా నిజాయితీ
అండదండగా!
॥వందేళ్ళ॥
ప్రైవేటు సంస్థల జాతీయకరణ
పోరాటాలతో మెరిసిన జెండా
అట్టడుగు వర్గాల సామాజిక
న్యాయ ఎజెండాగా జెండా
నిషేధాలు ఆంక్షలు అరెస్టులు
ఆపలేని జెండా పోరు నిరంతరం
జనంలో జనంకోసం నిలబడ్డ
జెండా!
॥వందేళ్ళ॥

– గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## సామాజిక సేవలతో సంతృప్తి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ఎంతో సంతృప్తి లభిస్తుందని మార్కెట్ చైర్మన్ సంజీవ్‌యాదవ్ అన్నారు. ఆదివారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి, వాసవిక్లబ్ కల్వకుర్తి సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం చేశారు. వాసవిక్లబ్ గవర్నర్ లయన్స్‌క్లబ్ కల్వకుర్తి చార్టర్ ప్రెసిడెంట్ కల్మచర్ల రమేష్ కుమారుడు సాయితేజస్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్ యాదవ్ మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వివిధప్రాంతాల నుండి వచ్చే రైతుల ఆకలి తీర్చాలనే సంకల్పంతోపాటు సామాజికసేవలో భాగంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుకు వచ్చిన 400మంది రైతులకు బోజనం అందించారు. కార్యక్రమంలో క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు చిగుళ్లపల్లి శ్రీధర్, బాదం హరీష్, వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ కల్వ హరికృష్ణ, చిదిరే శ్రీనివాస్, గుబ్బకిషన్, దారమోనిగణేష్, గోవింద, శ్రీనివాస్, అప్పాయిపల్లి శ్రీనివాస్, శంకర్, రమేష్, బాదం రాఘవేందర్, పాలకూర్ల రవిగౌడ్, కోటేశ్వర్, రాఘవేందర్ ఉన్నారు.

## బూర్గుపల్లిలో మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/జడ్చర్ల :** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బూర్గుపల్లి గ్రామంలో " గరుడ యువసేన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో " ఎస్ వీఎస్ మెడికల్ కాలేజ్ హాస్పటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరం, గ్రామ ప్రజలకి హెల్త్ క్యాంపు చెకప్ జయవంతం అయ్యాంది. గ్రామంలోని శివస్వాములు, యువత, పెద్దలు ముందుకు వచ్చి 80 మంది రక్తదానం చేశారని. 450 మందికి పైగా అదే ఉచితంగా వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. 13 మందికి కంటి పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గరుడ యువసేన ఆర్గనైజేషన్ అధ్యక్షులు కావలి నరేందర్, ఉపాధ్యక్షులు పొలె వెంకటేష్, జెనరల్ సెక్రటరీ పెద్ద గొల్ల మహేష్, జాయింట్ సెక్రటరీ ఎరుకలి శివ, కోశాధికారి కావలి చెన్నయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జాజిమోగ్గ రాజశేఖర్ బుషన్ శెట్టి శ్రీశైలం, కురుమూర్తి, కన్నయ, భరత్ కుమార్, సాయి కావలి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలపై స్పెషల్ డ్రైవ్



16 వాహనాలపై కేసులు నమోదు : ఎస్సై రేవతి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణ కేంద్రంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాల పై ఎస్సై రేవతి ఆధ్వర్యంలో మక్తల్ పోలీసులు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి నెంబర్ ప్లేట్ లేని 16 వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించి సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రేవతి మాట్లాడుతూ.. వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేక పోవడం వల్ల అవి దొంగతనాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉండటమే కాకుండా, ఇతర నేరాలకు ఉపయోగించే ప్రమాదం కూడా ఉన్నట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, ఇది రోడ్డు భద్రతకూ, ప్రజా భద్రతకూ ముప్పుగా మారుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణంగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటువంటి స్పెషల్ డ్రైవ్ లు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులందరూ పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై రేవతి కోరారు.

## దేవాలయానికి విరాళం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని గానుగుగట్టుతండాలో నూతనంగా నిర్మిస్తున్నా వెంకటేశ్వరస్వామి(బాలాజీ టెంపుల్) దేవాలయ నిర్మాణానికి పొచమ్మతండాకు చెందిన రాత్లావత్ అజిత్‌నాయక్ రూ.50 వేలు విరాళం అందజేశారు. అదేవిధంగా ఉబ్బాలగట్టుతండా సర్పంచ్ కేశ్వనాయక్ రూ.5వేలు, సిలోనిబండతండా సర్పంచ్ లక్ష్మీపతి నాయక్ రూ.5వేలు, వార్డు సభ్యులు జ్యోతీ సూర్య నాయక్‌లు రూ.5 వేల దేవాలయ ఛైర్మన్ లోక్యానాయక్, దేవాలయ పూజారి తరుణ్‌స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మౌనిక లచ్చిరాంనాయక్ దాతలను శాల్వలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌నాయక్, రాముడు నాయక్, కోఠినాయక్, వావిళ్ల వెంకటయ్య, తండా వాసులు పాల్గొన్నారు.

## అభివృద్ధే శ్రీరామరక్ష

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** వనపర్తి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన కళ్లు చెదిరే అభివృద్ధియే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం. పార్టీకి శ్రీరామరక్ష అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ అధ్యక్షతన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ హాజరయ్యారు. అభివృద్ధిని ప్రజలకు వివరించండి ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తాము చేసిన రోడ్ల విస్తరణ, పార్కుల సుందరీకరణ, మాతా శిశు సంక్షేమ కేంద్రం, కలెక్టరేట్ భవనం, సమీకృత మార్కెట్ మరియు నిత్యం మంచినీటి సరఫరా వంటి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఐక్యంగా పనిచేద్దాం. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, పాలనలో వైఫల్యం చెందిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, నాయకులు కురుమూర్తి యాదవ్, గంధం బాలపీరు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువవుతున్న 'ప్రజాపక్షం'

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రజలకు చేరువవుతుందని ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ముందుకు సాగడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలోని ప్రజాపక్షం దినపత్రిక కార్యాలయంలో ఆయన 2026 సంబంధించిన ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం చేసే మంచి చెడులను వివరిస్తూ దినదిన అభివృద్ధి చెందుతుందని ఆయన కొనియాడారు. అదేవిధంగా ఇంకా ఎంతో అభివృద్ధి చెంది అడుగులు ముందుకు వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన ఆకాంక్షించారు. నిజాన్ని నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తూ ఉనికిని చాటుకుంటున్న వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ప్రజాపక్షం కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి దినపత్రిక నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాంబూలం శ్రీనివాసులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలలో పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు చక్రవర్తుల వెంకటరమణాచార్యులు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ పిట్టల మురళి, వార్డు కౌన్సిలర్ సతీష్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస యాదవ్, ఇంతియాజ్, కొండల్, దోనూర్ శ్రీనివాస్ రెడ్డి, కొండల్ వివిధ దినపత్రికలకు చెందిన యూట్యూబ్ ఛానల్ విలేకరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీ

ఉదయం 11:00 నుండి 12:00 వరకు

కాంటాక్ట్ నంబర్ 0850 6281182



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజల సమస్యలను తెలుసుకోవడం, పరిష్కరించడంలో భాగంగా నేడు (సోమవారం) జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ప్రజలు, ఫిర్యాదుదారులు కాల్ చేయాలనుకునే వారు ఎస్పీ ఆఫీస్ నెంబర్ : 0850 6281182కు ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ప్రజలతో మాట్లాడి ఫిర్యాదులు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తక్షణ పరిష్కార మార్గాలను సూచిస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

## నేడు డిసిసి చీఫ్‌గా ప్రశాంత్ కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకం అయినా కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1:00 గంటలకు స్థానిక మెట్రో ఫంక్షన్ హాల్‌లో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, నియోజకవర్గ ఇంచార్జీలు ఏనుముల తిరుపతి రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డిలతో పాటు ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు, గ్రంథాలయ చైర్మన్లు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అందరు కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై దిగ్విజయం చేయాలని కోరారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ లోని టీచర్స్ కాలనీ పార్క్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా కళ్లజోడు అందించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా పేదలు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన సల్మాన్ షరీఫ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజాసేవలో ముందుంటారని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి ఎమ్మెల్యే స్వయంగా ఉచితంగా కళ్లజోడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మణ్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యానికి అద్దం పట్టిన ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** సంక్రాంతి ముగ్గుల పోటీలు మహిళలు, బాలికల చైతన్యానికి అద్దం పట్టాయని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు, కేతేపల్లి ఉప సర్పంచ్ కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శి గీత అన్నారు. ఆదివారం వనపర్తి సిపిఐ జిల్లా ఆఫీస్ ఆవరణలో సంక్రాంతి పండగ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ముగ్గుల్లో సంక్రాంతి పండుగ సంస్కృతిని ప్రతిబింబించే గంగిరెద్దులు, చెరుకు గడ్డలు, గాలిపట్టాలు, పాల పొంగులతో పాటు, నవచైతన్యం ఉట్టిపడే సిపిఐ వందేళ్ళ ఉత్సవాలు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సింబర్, ఆపరేషన్ సింధూర్, తదితర అంశాలు ముగ్గుల్లో చోటు చేసుకున్నాయన్నారు. ప్రథమ బహుమతి గాయత్రి, ద్వితీయ బహుమతి శ్రీవిద్య, తృతీయ బహుమతి శ్రీదేవి, బార్గవి లకు లభించాయి. రిటైర్డ్ ప్రభుత్వ లెక్చరర్ గులాం హుస్సేన్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు, మాజీసర్పంచ్ కళావతమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమ్మ, గీత పట్టణ కన్వీనర్ జయమ్మ తదితరులు విజేతలకు బహుమతులను అందజేశారు. న్యాయం నిర్ణయితలుగా రిటైర్ట్ లెక్చరర్ గులాం హుస్సేన్, సీనియర్ జర్నలిస్ట్ ఊషన్న వ్యవహరించారు. పట్టణ కోకన్వీనర్ శిరీష, ప్రసన్న, యాదమ్మ, గాయత్రి, లావణ్య, శారత, శ్రీదేవి, జ్యోతి, జయశ్రీ, బిందు, శాన్వి సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

మాజీ ఎంపీటీసీ ఇస్లావత్ నాగులు నాయక్



**ప్రజాపక్షం/వెల్దండ:** క్రీడలు ఆటడం వల్ల మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయని మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని కేస్లీతండాల్లో కేస్లీతండ ప్రీమియర్ లీక్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగులు నాయక్ మాట్లాడుతూ యువత క్రీడలపై అసక్తి పెంపొందించుకోవాలని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, సహనం వంటి విలువలు అలవాటు అవుతాయని అన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడలు యువకులకు ఎంతగానో ద్రోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కేస్లీ తండా సర్పంచ్ శ్రీనునాస్, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, కేస్లీ తండా ప్రిమీయర్ లీగ్ నిర్వహకులు శంకర్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ యువనాయకులు రాజునాయక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

**మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం...**

మండల పరిధిలోని గానుగుగట్టుతండా సమీపంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ మౌనికలచ్చిరాంనాయక్‌లు పేర్కొన్నారు.ఈ టోర్నమెంట్‌కు మొదటి బహుమతిని గిరిజన నాయకులు పాత్లవత్ బక్కునాయక్ రూ.25 వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందించనున్నట్లుత తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు మండలంలోని అన్ని గ్రామాల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో హృదయవిచారక సంఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓ యువకుడు బ్లేడుతో తన కుడి చేతిపై కోసుకుని అనంతరం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికులను కలచివేసింది. పోలీసులు మరియు కుటుంబీకుల కథనం ప్రకారం బొల్లారం గ్రామానికి చెందిన కురుమయ్య భాగ్యముల కుమారుడు నవీన్ యాదవ్ (17) వ్యవసాయ పనులకు తల్లిదండ్రులకు సహకరిస్తూ, మేకలు కాస్తూ జీవనం సాగించేవాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో నవీన్ యాదవ్ ముందుగా కుడి చేతిపై బ్లేడుతో కోసుకుని, అనంతరం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. సాయంత్రం పొలం పనుల నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు కుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. ఒక్కసారిగా చోటు చేసుకున్న ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు.

## కాలువలో చిక్కుకున్న నెమలి

కాపాడిన గ్రామస్థులు



**ప్రజాపక్షం/పానుగల్:** పానుగల్ మండల పరిధిలోని కొత్తపేట, మందాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న భీమ కాలువలో పడి చిక్కుకున్న జాతీయ పక్షి నెమలిని గ్రామస్తులు కాపాడి స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి సమాచారాన్ని ఫారెస్టు అధికారులకు అందించగా ఫారెస్టు అధికారులు వచ్చి అస్వస్థకు గురైన నెమలిని పట్టుకోని చికిత్స అనంతరం మండల పరిధిలోని మాధవరావుపల్లి గ్రామ అడవులలో వదిలి పెట్టినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు.

## పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

60 లక్షలతో చేపట్టిన వీధిదీపాల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** రెండు సంవత్సరాల లోనే వనపర్తి పట్టణ అభివృద్ధికై రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ రూ.807 కోట్లు మంజూరు చేసినట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రెండు కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరయ్యాయని ఇందుకు సంబంధించి పట్టణంలో అధునాతన వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి 60 లక్షల ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం వీధిదీపాల ఏర్పాటు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పెబ్బేరు మున్సిపాలిటీకి సైతం ఒక రూ.కోటి 23 లక్షలు మంజూరయ్యాయని ఇందులో రూ.20 లక్షలను వీధి దీపాల ఏర్పాటుకు కేటాయించి నేడు వీధిదీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ భాస్కర్, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**లాల్ బహదూర్ శాస్త్రీకి ఘన నివాళి**

స్వాతంత్ర సమరయోధుడు తెల్ల విప్లవాన్ని ప్రారంభించి హరిత విప్లవానికి శ్రీకారం చుట్టిన నిరాడంబరడైన నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లాల్ బహదూర్ శాస్త్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు శ్రీనివాస్ గౌడ్, జిల్లా దిశా కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, తిరుపతయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటానికి ప్రతీక వడ్డే ఓబన్న



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** పోరాటానికి, త్యాగానికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు వడ్డే ఓబన్న అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వడ్డే ఓబన్న 219వ జయంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీ, గ్రీన్ బెల్ట్‌లో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులార్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, రఘు, వడ్డెర సంఘం అధ్యక్షుడు పీట్ల యాదయ్య, ఉపాధ్యక్షుడు పీట్ల ఊషన్న, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జయంతి పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పద్మావతి కాలనీలో వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి వారి జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి వెనుబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర, వడ్డేర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని వక్తలు కీర్తించారు. ఆ మహనీయుని జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి హాల్‌లో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి సంక్షేమ శాక అధికారి అబ్దుల్ ఖలీల్ జిల్లా వడ్డెర సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులార్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర మంజలి దత్తు, ప్రధాన కార్యదర్శి వేముల గంగాధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎర్ర మంజలి సత్యమ్మ, జిల్లా కోశాధికారి కంసాన్ పల్లి కృష్ణయ్య, అధ్యక్షులు పి. వెంకట్ రాములు, ఉపాధ్యక్షులు వెంకట రాములు, పెద్ద వెంకటయ్య, బాల్ రాజ్ , రాజమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి ఎల్లప్ప, కార్యదర్శులు నవీన్, మల్లికార్జున, తిరుపతయ్య, మాసనమ్మ, సలహా సంఘం సభ్యులు లక్ష్మయ్య, బాలరామ్, ఆయా సంఘాల ప్రతినిధులు, వార్డెన్ మంజుల, సంక్షేమ శాఖ కార్యాలయ ఉద్యోగులు శివ, నరేష్, అజయ్ మురళి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో తమ ఆరాధ ధైవమైన వడ్డెర ఓబన్న 219వ జయంతిని అధికార మండల వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు గండికోగ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. వడ్డెర కులస్తులు మల్లేశ్వరీ, లావణ్య, సులోచన, పార్వతమ్మ, సైదులు, శివ, శ్రీను, యాదగిరి, ఈశ్వర్ తదతరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణం వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్మించారు. వడ్డెర నాయకులు చిత్రపటానికి పూలమాల వేసి ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, మాజీ సిడిసి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, కొత్తకోట పట్టణ వడ్డేర సంఘం అధ్యక్షులు గోవుల శ్రీను, అయ్యన్న, వెంకటేశ్, వడ్డెర సంఘం నాయకులు, సంఘం పెద్దలు పాల్గొన్నారు.



## ప్రజలకు వారధిగా 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఆదివారం మాజీ జిల్లా వైస్ చైర్మన్ పాండరి ఆధ్వర్యంలో ప్రజాపక్షం దినపత్రిక నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కుసుమాని హరిచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు శ్రీను, సత్యనారాయణ, కృష్ణహరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ సత్యంకు రైతుల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని అంతమ్మగూడెం గ్రామ సమీపంలో ఉన్న హజాలో లాబరేటర్, శ్రీ జయ లాబరేటర్, పరిశ్రమలు చేస్తున్న కాలుష్య సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించినందుకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కాలుష్య బాధిత గ్రామ రైతులు ఎమ్మెల్సీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం గురించి సమాచారం సేకరించి నివేదికలను ఎమ్మెల్సీకి అందజేశారు. పరిశ్రమల వ్యర్థ వ్యాధుల కారణంగా పీల్చే గాలిలో బెంజీన్, తోలి ఇథైల్ బెంజీన్ వంటి క్యాన్సర్ కారక రసాయనాలతో పాటు అనేక రకాల విషపూరిత వ్యర్థాలు గాలిలో చేరుతాయని బోరుబావులలో నీటిలో టీడీఎస్ విలువ 50 వేలకు పైగా చేరిందని, వ్యవసాయ భూములలోని మట్టిలో కెమికల్ ఆక్సిజన్ విలువ 16 వేల వరకు చేరిందని రుజువు నివేదిక రూపంలో ఎమ్మెల్సీకి తెలిపినారు. గ్రామంలో ఉండలేక పరిశ్రమల కారణంగా వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పిబిసి ఉన్నతాధికారులు పరిశ్రమలపై చర్యలు తీసుకోకుండా కేవలం ఆదేశాలకు పరిమితమయ్యారని, అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మి దామోదర్ రెడ్డి, వస్పరి నరసింహ, రేణుక, లింగయ్య, తరుణ్, సురుకంటి కృపనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : 2026/27 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో ప్రవేశాలకు అర్హులైన ఎస్సి, ఎస్టి, బిసి జనరల్ విద్యార్థులు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షతోపాటు 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లకు కూడా భర్తీకి అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించాలని దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం, ఆధార్, బర్త్ సర్టిఫికెట్, పాస్‌ఫోటో వివరాలు సమర్పించాల్సి ఉంటుందని విద్యార్థులు అందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## సమర్థవంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వాహణ కార్యాచరణ



**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వాహణ కార్యాచరణను సమర్థవంతంగా పూర్తిచేయుటకు ప్రణాళికబద్దంగా సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌రెడ్డి చండూరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. త్వరలో జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో చండూరు మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల సన్నాహక పనులపై ఆయన సమీక్షించారు. మున్సిపాలిటీలో ఉన్న జనాభా, మొత్తం ఓటర్ల సంఖ్య తో పాటు 10 వార్డులకు గాను ఒక్కొక్క వార్డులో ఎంత మంది ఓటర్లు ఉన్నారని తెలుసుకొని ఓటర్ జాబితాను పరిశీలించారు. మున్సిపాలిటీఉన్న మొత్తం 10 వార్డులకు 20 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదింబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీలో 128 అభ్యంతాలు రాగ వాటిని పరిగణలోకి తీసుకొని అభ్యంతరాలు తెలిపిన వారిని పరిగణలోకి తీసుకొని వాటిని నిర్ధిష్ట ప్రొఫార్మాలో నమోదు చేయడం అవసరమని అన్నారు. రాబోయో రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణ లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ కమీషనర్ మల్లేశం , వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్య కల్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి** : విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాసము సందర్భంగా కూడారై ఉత్సవము గోదామ్మవాళ్లు సాక్షాత్తు శ్రీనివాసుడికి 108 గంగాలల తోటి పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# 'హలో కామ్రేడ్ ...చలో ఖమ్మం'

### జనవరి 18న ఖమ్మంలో సిపిఐ 100 వసంతాల ముగింపు బహిరంగ సభకు తరలిరండి...

### పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/దేవరకొండ** : భారత గడ్డపై ఎర్రజెండాకు వందేళ్లు దాటిన సందర్భంగా ఖమ్మం నగరంలో జనవరి 18న లక్షలాది మందితో నిర్వహించే సిపిఐ 100ఏళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గంలోని సిపిఐ ఆయా మండల కార్యవర్గ సభ్యుల సమావేశానికి పల్లా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో విప్లవ పోరాట ఘట్టాలు వెలకట్టలేని త్యాగాలు అజరామరమని అన్నారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా పేద ప్రజలకు అండగా, దున్నేవాడికి భూమి కావాలనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘమైన చరిత్ర గల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య పెట్టుబడిదారి వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సిపిఐదని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి దేశంలో 100సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందిందని, స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో ఆనాడే అనేక మంది ఉరికంబాలు ఎక్కి ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర గలది సిపిఐ అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కొరకు ప్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు తాడిత, పీడిత జనావళి కొరకు వేలాది మంది ప్రాణాలనుకొల్పోయిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. భారత స్వాతంత్ర్యం పొందిన తర్వాత దేశంలో రైతుల కొరకు వ్యవసాయ సంస్కరణలు, కార్మికుల కొరకు వ్యవసాయ సంస్కరణలు, కార్మికులకు కొరకు కార్మిక చట్టాలు, ప్రైవేట్ రంగంలో ఉన్న బొగ్గు గనులు, బ్యాంకులు, బీమా రంగం, ఆర్టీసి లాంటి సంస్థలను జాతీయికరణ కొరకు ఉద్యమాలు చేపట్టి సాధించటంలోనూ , స్టీలు, సిమెంట్, దేశ రక్షణకు సంబంధించిన అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో సిపిఐ నిర్వహించిన పాత్ర మరువలేనిదని, భారత పార్లమెంటరీ చరిత్రలో ఆనాడు ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ దేశ, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ పార్లమెంట్ సభ్యులు భూపేష్ గుప్తా, హిరెన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా లాంటి కమ్యూనిస్టు మేధావులు విలువైన సూచనలు దేశాభివృద్ధికి అందించిన ఘన చరిత్ర సిపిఐ దని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు నిధులు నియామకంలో జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు పార్లమెంట్ లోనూ, అసెంబ్లీలోనూ గళమెత్తిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, ప్రజా సమస్యలపైన, భూ సంస్కరణలు, ఇళ్ల స్థలాలు, పారిశ్రామికీకరణ, వ్యవసాయ అభివృద్ధి తదితర అంశాలపై ఉద్యమాలు చేపట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు మొట్టమొదటగా అంగీకారం తెలియజేసి తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర వహించిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ యాదగిరిరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, జిల్లా కార్యవర్గ సభ్యుల బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, వెంకటరమణ, జయరాములు, వెంకటయ్య, మండల కార్యవర్గ సభ్యులు రామస్వామి, ఆంజనేయులు, విజేందర్‌రెడ్డి, శైలేష్, రమేష్, అంజల్, వెంకట్రాములు, వెంగలయ్య, యాదయ్య, వెంకటయ్య ఉన్నారు.




## ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

**ప్రజాపక్షం/నకిరేకల్** : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం నకిరేకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రతి ఒక్కరు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో గల ఆయన నివాసంలో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 16 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.10లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను అందచేసి ఆయన మాట్లాడారు. ఆపద సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం పేదలు సీఎం ఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



# కార్మిక, కర్షకుల కోసం సిపిఐ రాజీలేని పోరాటాలు

### సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలి : శ్రావణ్ కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల:** ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఆదివారం గుండ్రాంపల్లిలో జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిపిఐ భారత దేశంలో శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మిక,విద్యార్థి,రైతు,మహిళ తదితర ప్రజా సంఘాలను నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కొరకు, కార్మికులను కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు నిర్వహించిందని ఆయన అన్నారు.ఈ శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు, ఎంతోమంది అమరవీరుల రక్త తర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఆయన అన్నారు. జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శతాబ్ది జాతీయ ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడిగే సైదులు,జిల్లా యాదయ్య,శాఖ కార్యదర్శి జిల్లా సత్యం,నాయకులు బోడిగె బక్క శెట్టి,బొబ్బల శంకర్ రెడ్డి,పానుగుల శివ,రత్నం లింగస్వామి, సర్గాల అశోక్, బెదరకోట సైదులు పాల్గొన్నారు.

### సిపిఐ ఖమ్మం బహిరంగ సభ గోడ పత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/గుండాల:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆదివారం గుండాల మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి సిపిఐ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతులు రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, శ్రీను, స్వామి, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

### శతాబ్ది ఉత్సవాల వేడుకలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/రామన్నపేట** : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ రామన్నపేట పట్టణ కేంద్రంలో గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామచంద్రం, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంత, గంగాపురం వెంకటయ్య, గంగాపురం యాదయ్య, వీరమల్ల ముత్తయ్య, సంగిశెట్టి పాండు పాల్గొన్నారు.





## పచ్చని పైరు దున్నేశారు!

### అధికారులు ముడుపులు తీసుకుని తమకు న్యాయం చేయడం లేదని రైతులు ఆందోళన

**ప్రజాపక్షం/కోదాడ:** వారసత్వంగా వచ్చిన తమ పొలంలో సాగు చేసిన పచ్చని పసి పైరును రాత్రికే రాత్రే దున్ని నాశనం చేశారని కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రైతులు మల్లు భిక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి లు కుటుంబ సభ్యులతో కలిసి పురుగుమందు డబ్బాలతో పొలం వద్ద ఆందోళనకు దిగారు. వారసత్వంగా వచ్చిన తమ భూమిని మల్లు వీరారెడ్డి కుమారులు మల్లు వెంకటరెడ్డి, సైదిరెడ్డి, ఏసి రెడ్డిలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతం కొంతకాలంగా ఈ వివాదం జరుగుతుందని ఇదే విషయాన్ని కోదాడ తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లమాన్నారు. ఇటీవల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సర్వే చేసి ఆ 30 కుంటల భూమి తమది అని రిపోర్టు కూడా ఇచ్చారన్నారు. కాగా కొందరి ఒత్తిడి ప్రలోభాలకు లొంగి తహసిల్దార్ ఆర్ఐ రాసిన రిపోర్టును మార్చి ఈ భూమి తమకు చెందకుండా నివేదికలు రూపొందించారని కన్నీరు మున్నీరయ్యారు. ఈ విషయం కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని, ఇటీవల కాలంలో తమపై దాడులు కూడా జరగడంతో పోలీసులు మరణ వాంగ్మూలంతో కూడా అశ్రయించామని అయినప్పటికీ పోలీసు అధికారులు సైతం తమకు న్యాయం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తమపై దాడి చేసి అక్రమించుకోవాలని చూస్తున్న వారిపై అధికారులు నాయకుల ఒత్తిడితొ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. భూ రికార్డుల ప్రకారం గతంలో వారి భాగా పంపిణీ వచ్చిన భూమి ఎన్ఎస్పి కాల్వ కింద పోయిందని వీరు ఆదే పోయిన భూమిని అధికారులకు ముడుపులు అప్పగించి రికార్డులోకి ఎక్కించుకుని తమ భూమిపైకి దౌర్జన్యంగా వస్తున్నారని కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి కోదాడ తహసిల్దార్ కార్యాలయం ముందు పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరోదారి లేదని వాపోయారు.

# అభివృద్ధి కావాలో అరాచకాలు కావాలో నిర్ణయించుకోవాలి

### మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలి

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : అభివృద్ధి కావాలో అరాచకాలు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో మోసకారి కాంగ్రెస్‌ను ఓడించి అభివృద్ధి చేసే బిఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై బిఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్ధేశం చేసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సైనికుల స్లోగన్ 2014కు ముందు ఏట్లున్నదో ఈ రెండేళ్ళ కాంగ్రెస్ పాలన అట్లనే ఉన్నదని ప్రచారం చేయాలన్నారు. ఆరాచకాలు, కబ్జాలు, బెదిరింపులు, అక్రమ కేసులు పెరిగినయాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలంతా విసిగి వేసారిపోయింద్రని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీ కార్డుల్లోని హామీలను ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. ప్రజలు మోసకారి కాంగ్రెస్‌ను ఓడగొట్టాలనే కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు. సంక్రాంతి కంటే ముందే పట్టణాల్లో పండుగ వాతావరణం మొదలైందని కారు గుర్తు కనబడితే చాలు ఓటేసేందుకు అంతా సిద్ధమైనట్లు ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు రేవంత్‌వి చీకటి ఒప్పందాలని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ రాజకీయ అవసరాల కొరకే అమ్ముడుపోతున్నాడని ఎద్దేవా చేశారు. కృష్ణా గోదావరి జలాలను ఆంధ్రకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు. బణకచర్ల పేరుమార్చి నల్లమల్ల సాగర్ అంటున్నారు దానికి ఏపేరు పెట్టినా జరిగేది తెలంగాణ నీళ్ళ దోపిడే తప్ప మరొకటి లేదన్నారు. చంద్రబాబును సంతృప్తి పరచడమే రేవంత్ లక్ష్యంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వర్లు, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా



**ప్రజాపక్షం/హాలియా:** నూతనంగా ఎన్నికైన ఇబ్రహీంపేట, కొత్తపల్లి సర్పంచులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డిని కలుసుకున్నారు. కొత్తగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇబ్రహీంపేట సర్పంచి ఎడవల్లి వంశీకృష్ణారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బ్రహ్మానందరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత కొన్నాళ్లుగా గ్రామపంచాయతీలలో నెలకొన్న సమస్యలను ప్రజలు తాము గెలిచిన వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి వీరు తీసుకెళ్లారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతి చేశారు. వీరి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,జడ్పి మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి,విద్యాసాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు ముగ్గులు

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతిబింబాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త గుడిపాటి నవీన్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 27వ ఇన్‌చార్జి గొట్టిముక్కల లక్ష్మణాచారి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందచేసి మాట్లాడారు. మహిళల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడుతాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు ముగ్గులు వేశారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై అనునిత్యం వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్న లక్ష్మణ్‌ను జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. న్యాయ నిర్ణేతలుగా వైద్యురాలు సరిత, దివ్య రేణుక, ఉపాధ్యాయురాలు విమల, కస్తూరి సరితలు వ్యవహరించారు. పోటీలో 400మందికి పైగా పాల్గొన్నారు. మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి గోవర్ధన్, విశ్రాంత ఉపాధ్యాయులు సన్నాల వెంకయ్య, రాయపాటి వెంకటేశ్వర్లు, రాపోలు శ్రీనివాస్, శశి, రాజేందర్, సూర్యం, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

## చైనా మాంజా అమ్మినా,కొన్నా చర్యలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను అమ్మినా, కొనినా కఠిన చర్యలు తప్పవని శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి హెచ్చరించారు.నిషేధిత చైనా మాంజా వల్ల పశువులు, పక్షులు, మనుషులకు తీవ్ర ప్రమాదం పొంచి ఉందని, మాంజా దారం తగిలి ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరికి తెలియకుండా దుకాణదారులు చైనా మాంజాను అమ్మాలని ప్రయత్నించినా, కొనుగోలు చేసినా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.చైనా మాంజా అమ్మకం లేదా కొనుగోలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అలాగే పండగ సెలవుల్లో సొంత ఊర్లు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇళ్లలో బంగారం, వెండి వంటి విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే వెంట తీసుకువెళ్లాలని సూచించారు.



## ఉత్కంఠపోరులో.. భారత్‌దే విజయం

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. వడోదర వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో గెలుపు కోసం ఇరు జట్లు తీవ్రంగా పోరాడాయి. అయితే, ఆఖరికి విజయం భారత్‌ని వరించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన



న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విరాట్ కోహ్లీ (93) కొద్దిలో సెంచరీని చేజార్చుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (56) హాఫ్ సెంచరీ సాధించాడు. కివీస్ బౌలర్లలో జేమీసన్ 4.. ఆదిత్య అశోక్, క్లార్క్ చెరో వికెట్ తీశారు.

### కాస్త టెన్షన్ పెట్టినా..


న్యూజిలాండ్ నిర్దేశించిన 301 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ స్కోరు 39 ఓవర్లకు 234/2.. అప్పటికి క్రీజ్‌లో విరాట్ కోహ్లీ సెంచరీకి చేరువగా ఉన్నాడు. శ్రేయస్ (49) కూడా మంచి ఫామ్ కనబరిచాడు. చివరి 66 బంతుల్లో 67 పరుగులు చేయాలి. చేతిలో ఇంకా 8 వికెట్లు. కానీ, ఇక్కడే కివీస్ బౌలర్ జేమీసన్ విజృంభించాడు. ఒకే ఓవర్‌లో విరాట్, రవీంద్ర జడేజా (4)ను ఔట్ చేసి భారత అభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేశాడు. అయితే, హర్షిత్ రాణా (29), కేఎల్ రాహుల్ (29*) దూకుడుగా ఆడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు. వీరిద్దరూ కీలక సమయంలో పరుగులు రాబట్టారు. హర్షిత్ రాణా ఔటైన తర్వాత వాషింగ్టన్ సుందర్ (7*)తో కలిసి కేఎల్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. బౌలింగ్ చేస్తూ గాయపడిన సుందర్ కివీస్ ఇన్నింగ్స్‌లో 20వ ఓవర్ సమయంలోనే మైదానం వీడాడు. దీంతో బ్యాటింగ్‌కు వస్తాడా? లేదా? అనే అనుమానాలు తొలుత తలెత్తాయి. కానీ, అవసరమైన సమయంలో నొప్పితోనే సుందర్ వచ్చి ఆఖరి వరకూ క్రీజ్‌లో ఉండిపోయాడు. చివరి రెండు ఓవర్లలో 12 పరుగులు అవసరం కాగా.. 49వ ఓవర్‌లోనే కేఎల్ రాహుల్ 2 ఫోర్లు, సిక్స్ బాదేసి మ్యాచ్‌ను త్వరగా ముగించాడు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (26) రాణించాడు.

### డారిల్ మిచెల్ దూకుడు

తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ భారీ స్కోరు చేయడంలో డారిల్ మిచెల్ (84)తోపాటు ఓపెనర్లు డేవన్ కాన్వే (56), హెన్రీ నికోల్స్ (62) కీలక పాత్ర పోషించారు. ఈ ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించారు. మిచెల్ దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 2, సిరాజ్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ తీశాడు.

## భారత్‌లో 'ఫిఫా' ట్రోఫీ

ఇక మూడు రోజులు ఫ్యాన్స్‌కు పండగే!



ఫుట్‌బాల్ అభిమానులకు గుడ్‌న్యూస్. నిరుడు 'గోట్ ఇండియా టూర్ ఆఫ్ ఇండియా 2025'లో లియోనెల్ మెస్సీ భారత్‌లోని ప్రధాన నగరాలను మెరుపులా చుట్టేయగా.. ఇప్పుడు ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి మొదలైంది. మెగా టోర్నీకి 6 నెలల గడువే ఉండటంతో నిర్వాహకులు ట్రోఫీని అభిమానుల సందర్శన కోసం భారత్‌కు తీసుకొచ్చారు. ఆదివారం ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు కల్యాణ్ చౌబె ట్రోఫీని ఆవిష్కరించారు. పుష్కర కాలం తర్వాత ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీ భారత్‌లో ప్రదర్శన్నున్నారు. మూడు రోజులు దేశంలోని ప్రధాన నగరాల్లో అభిమానుల సందర్శనార్థం ఈ ట్రోఫీని ఉంచుతారు. ఫిఫా ట్రోఫీ ఆవిష్కరణలో ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, కేంద్ర క్రీడల మంత్రి, యువజనుల వ్యవహారాల మంత్రి మన్సూఖ్ మాండవీయ, బ్రెజిల్ వరల్డ్‌కప్ విజేత గిల్బర్టో సిల్వా పాల్గొన్నారు. రెండు రోజులు ఢిల్లీలోని ప్రముఖ సెంటర్లలో ఫిఫా ట్రోఫీని ప్రదర్శనకు ఉంచుతారు. అనంతరం అస్సాంలోని గౌహతిలో వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి చేయనుంది. అయితే.. భారత ఫుట్‌బాల్‌ను నాశనం చేస్తున్న చౌబే.. సాకర్ కమిటీని అప్పగించిందన్నారు పలువురు తప్పుపడుతున్నారు. ఇండియన్ సూపర్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి మన్సూఖ్ మాండవీయ జట్ల మోహన్ బగన్, ఈస్ట్ బెంగాల్ ప్లేయర్లను తప్పుగా పలకడం కూడా విమర్శలకు తావిచ్చింది మండిపడుతున్నారు.

### జూన్ 11 నుంచి షురూ..

ఈఏడాది ఫిఫా ప్రపంచకప్ పోటీలకు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. జూన్ 11వ తేదీ గురువారం ఫిఫా వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. నెల రోజులకుపైగా అభిమానులను గోల్స్ వర్షంలో ముంచెత్తనున్న ఈ టోర్నీ జూలై 19వ తేదీన ముగియనుంది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

## నందని శర్మ హ్యాట్రిక్




మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ నందని శర్మ హ్యాట్రిక్ నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20వ ఓవర్లో వరుసగా మూడు వికెట్లు తీసి చరిత్ర సృష్టించింది. నాలుగో బంతికి కనికా ఆహూజాను వికెట్ కీపర్ లీ స్టంపౌట్ చేసింది. ఐదో బంతికి రాజేశ్వరి గైక్వాడ్‌ను నందని బౌల్డ్ చేసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రేణుకా సింగ్‌ను బౌల్డ్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేసుకుంది. మొత్తంగా ఈ లీగ్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన నాలుగో బౌలర్‌గా నందని అవతరించింది. డబ్ల్యూపీఎల్‌లో నందని కంటే ముందు ఇసీ వాంగ్(ముంబై ఇండియన్స్), దీప్తి శర్మ(యూపీ వారియర్స్), గ్రేస్ హ్యారిస్(యూపీ వారియర్స్)లు హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టారు. ఆరంభ సీజన్‌లో యూపీ వారియర్స్‌పై వాంగ్ వరుసగా మూడు వికెట్లు తీసింది. కిరన్ నవ్‌గిరే, సిమ్రాన్ షేక్, సోఫీ ఎకిల్‌స్టోన్‌లను ఔట్ చేసింది.

# ఆరోగ్యం



## మారథాన్‌తో గుండెకు నష్టం లేదు..

మారథాన్ పరుగు శరీరంపై తీవ్రమైన ఒత్తిడిని కలిగించినప్పటికీ, ఇది గుండెకు శాశ్వత నష్టం చేస్తుందనే భయం పెద్దగా నిజం కాదని తాజా పరిశోధన వెల్లడించింది. 'జమా' కార్డియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన పది సంవత్సరాల అధ్యయనం ప్రకారం, 152 మంది సాధారణ మారథాన్ రన్నర్లలో పరుగు తర్వాత గుండె కుడి వైపు పనితీరు తాత్కాలికంగా తగ్గినా, అది కొద్ది రోజుల్లోనే పూర్తిగా కోలుకుంది. పరుగు అనంతరం రక్తంలో పెరిగే ట్రోపోనిన్ స్థాయులు గుండెపై పడే తాత్కాలిక ఒత్తిడిని మాత్రమే సూచిస్తాయి. అవి హార్ట్ అటాక్ లేదా శాశ్వత గుండె నష్టానికి నిదర్శనం కావని అధ్యయనం స్పష్టం చేసింది. పదేళ్ల పాటు గమనించినా, రన్నర్లలో గుండె నిర్మాణం లేదా పనితీరులో దీర్ఘకాలిక హానికి ఎలాంటి ఆధారాలు కనిపించలేదు. అయితే మారథాన్ పరుగు దాగి ఉన్న గుండె వ్యాధులను బయటపెట్టే అవకాశం ఉంది. అందుకే వ్యాయామ సమయంలో లేదా తర్వాత ఛాతినొప్పి, శ్వాసకష్టం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా, సరైన శిక్షణతో సాధారణ మారథాన్ రన్నర్ల గుండె క్షీణించదు.. పరిస్థితులకు అనుగుణంగా బలపడుతుంది.




## ఔషధాలలో తేడాలు..

ఒక కొత్త మందు మన చేతికి చేరేలోపు అది ఎంతో దీర్ఘమైన ప్రయాణాన్ని పూర్తి చేస్తుంది. ప్రయోగశాలలలో మొదలైన ఆ ప్రయాణం, అనేక పరిశోధనలు, జంతు పరీక్షలు, మానవులపై జరిగే క్లినికల్ ట్రయల్స్ దాటి మార్కెట్ వరకూ వస్తుంది. ఈ మొత్తం ప్రక్రియకు ఫార్మాస్యూటికల్ కంపెనీలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తాయి. అందుకే ఆ మందును మొదట కనుగొన్న కంపెనీకి ప్రభుత్వం సుమారు 20 సంవత్సరాల పాటు పేటెంట్ హక్కులు ఇస్తుంది. ఈ కాలంలో ఆ మందును తయారు చేసి అమ్మే హక్కు ఒక్క ఆ కంపెనీకే ఉంటుంది. ఇలాంటి మందులనే మనం 'బ్రాండెడ్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్' అంటాం. పేటెంట్ ఉన్నంత కాలం అదే ఫార్ములా తెలిసినా, ఇతర కంపెనీలు ఆ మందును తయారు చేయలేవు. చేస్తే చట్టరీత్యా నేరం అవుతుంది. ఈ ప్రత్యేక హక్కు వల్ల బ్రాండెడ్ మందుల ధరలు చాలా ఎక్కువగా ఉంటాయి. అసలు తయారీ ఖర్చుతో పోలిస్తే వాటి అమ్మకపు ధరలు అనేక రెట్లు అధికంగా ఉండటం సాధారణమే. కంపెనీలు దీనికి కారణంగా తాము చేసిన పరిశోధనలు, ట్రయల్స్ ఖర్చు తిరిగి రాబట్టుకోవాలని చెబుతాయి. అయితే ఆ 20 సంవత్సరాల పేటెంట్ కాలం పూర్తయిన తర్వాత పరిస్థితి మారుతుంది. అదే రసాయనాలు, అదే ఫార్ములా ఉపయోగించి, అదే మందును ఇతర కంపెనీలు కూడా తయారు చేయవచ్చు. అలా తయారైన మందులనే 'జనరిక్ డ్రగ్స్' అంటారు. ఇవి కొత్తగా పరిశోధనలు లేదా క్లినికల్ ట్రయల్స్ చేయాల్సిన అవసరం లేకుండా తయారవుతాయి. అందువల్ల వీటి తయారీ ఖర్చు తక్కువ, దాని ఫలితంగా మార్కెట్ ధర కూడా తక్కువగా ఉంటుంది. సాధారణంగా జనరిక్ మందులు బ్రాండెడ్ మందులతో పోలిస్తే 30 నుంచి 80 శాతం వరకు తక్కువ ధరకు లభిస్తాయి. చాలామందిలో ఒక అపోహ ఉంది. తక్కువ ధర అంటే నాణ్యత తక్కువ, లేదా అవి సరిగా పనిచేయవు అని. ఇది పూర్తిగా తప్పు. జనరిక్ మందులు కూడా అదే ప్రభుత్వ నాణ్యత ప్రమాణాల ప్రకారమే తయారవుతాయి. బ్రాండెడ్ మందులు ఎలా పనిచేస్తాయో, జనరిక్ మందులు కూడా ఖచ్చితంగా అలాగే పనిచేస్తాయి. మోతాదు, రసాయనిక సమ్మేళనం, ఔషధ ప్రభావం అన్నీ ఒకటే. తేడా కేవలం ప్యాకెట్ మీద ఉన్న పేరు, ధర మాత్రమే. అయితే ఇంత మంచిగా, తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు ఎందుకు విస్తృతంగా ప్రాచుర్యం పొందడం లేదు? ఇక్కడే వ్యాపార ప్రయోజనాల కథ మొదలవుతుంది. బ్రాండెడ్ మందులు అమ్మే ఫార్మా కంపెనీలు మెడికల్ రిప్రజెంటేటివ్స్ ద్వారా డాక్టర్లను కలుస్తూ తమ బ్రాండ్లను ప్రోత్సహిస్తుంటాయి. డాక్టర్ ఎక్కువగా ఆ బ్రాండెడ్ మందులు రాస్తే, దానికి అనుగుణంగా బహుమతులు, ప్రయాణాలు, ఇతర లాభాలు అందుతాయి. ఈ ఖర్చులన్నీ చివరకు మందుల ధరలో కలుస్తాయి. అందుకే బ్రాండెడ్ మందులు అంత ఖరీదైనవిగా మారుతాయి. కొన్ని ఆస్పత్రుల్లో డాక్టర్లు జనరిక్ మందులనే సూచిస్తారు. కానీ అవి ఆస్పత్రి ప్రాంగణంలోని ఫార్మసీల్లో మాత్రమే లభిస్తాయి. వాటి మీద ముద్రించిన ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కస్టమర్ అడిగితే కొద్దిగా తగ్గిస్తారు, కానీ అసలు కొనుగోలు ధరతో పోలిస్తే అది ఇంకా చాలా ఎక్కువే. వాస్తవానికి అదే మందు జన ఔషధి లేదా ఇతర జనరిక్ స్టోర్లలో చాలా తక్కువకు దొరుకుతుంది. ఉదాహరణకు, జ్వరం వచ్చినప్పుడు మనం తరచుగా వాడే డోలో 650 అనే బ్రాండెడ్ పారాసిటమాల్ ధర 15 టాబ్లెట్లకు సుమారు 29 రూపాయలు. అదే మందును మరో బ్రాండ్ పారాసిప్ 650గా 10 టాబ్లెట్లకు 18 రూపాయలకు అమ్ముతారు. కానీ జనరిక్ మెడికల్ స్టోర్‌లో అదే పారాసిటమాల్ 650 మి.గ్రా. 10 టాబ్లెట్లు సుమారు 4.50 రూపాయలకే దొరుకుతుంది. అలాగే వోవిరాన్ లాంటి బ్రాండెడ్ నొప్పి మందులు 50 రూపాయల పైగా ఉంటే, అదే డైక్లోఫెనాక్ జనరిక్ రూపంలో కొన్ని రూపాయలకే లభిస్తుంది. దగ్గు సిరప్, జ్వరం మాత్రలు... ప్రతి చోటా ఇదే తేడా కనిపిస్తుంది. జనరిక్ మందులకు, బ్రాండెడ్ మందులకు ధరలో తప్ప మిగతా విషయాల్లో చెప్పుకోదగిన తేడా లేదనే చెప్పాలి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## రాజీలేని పోరాటాల చరిత్ర సిపిఐది

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/చింతలపాలెం :** రాజీలేని పోరాటాల చరిత్ర సిపిఐది అని. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిగా గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వరు అన్నారు ఆదివారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల సిపిఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, నిరంకుశ నిజాంను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగువేల మంది ప్రాణ త్యాగాలతో, పదిలక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర సిపిఐదని తెలిపారు. ఈ వంద సంవత్సరాల కాలంలో ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్తతర్పణతో ఎన్నో విజయాలు సాధించి దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. ఇటువంటి చరిత్ర కలిగినటువంటి సిపిఐ జనవరి 18న ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన, జనసేవాదళ్ కవాతు, డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ బహిరంగ సభకు జిల్లానుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరి, కోటమ్మ, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల కార్యదర్శులు చింతిరాల రవి, గొంగరెడ్డి భద్రారెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శి గంధం మంగయ్య, జియాలుద్దీన్, భీమిశెట్టి పద్మ, తోకల సైదులు, భీమిశెట్టి సత్యనారాయణ, గంధం కొండ, దొంగల అంకరాజు, చిలక యేసు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికచట్టాల రద్దు రాజ్యాంగ విరుద్ధం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/భైంసా :** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులు వందేళ్ల పోరాటంతో సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తూ,వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్య అని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్.విలాస్ విమర్శించారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో టి.ప్రకాష్ అధ్యక్షతన ఎఐటియుసి పట్టణ మహాసభలు ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా విలాస్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఆటో కార్మికులకు నెలకు 12000 రూపాయల ఆర్థికభృతి ఇవ్వాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథక కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ, సివిల్ సప్లయ్, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక..** ఈ మహాసభలో ఎఐటియుసి భైంసా పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాటి ప్రకాష్, పట్టణ అధ్యక్షుడిగా ఎస్.కె.లతీఫ్, పట్టణ కార్యదర్శి పరుశురాం. ముఖ్య సలహాదార్లుగా పెండారి ముత్యం, కోశాధికారి వై.మోహన్, ఉపాధ్యక్షులు ఎస్.విఠల్, గడపలే సట్వాజి, విజయ్, తాడివార్ కరుణాకర్, కదం విఠల్, ఎస్,కె.జావేద్, పి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు సకల బన్సోడే, సందేశ్, బాబు, జె.రాములు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలు, ఉద్యమాలతోనే జనాదరణ

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

సిపిఐలో 167 కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/పాల్వంచ :** పేదల కష్టాలు, కన్నీళ్ళు, సమస్యలను గుర్తించేది ఎర్రజెండానే అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా అన్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణ పరిధి శ్రీనివాస బంజార కాలనీకి చెందిన 167 కుటుంబాలకు చెందిన వారు ఆదివారం సాబీర్‌పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. వారికి ఎర్రకండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన ప్రతీ కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకొంటామని భరోసా ఇచ్చారు. పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే సిపిఐకి జనాదరణ పొందుతుందన్నారు. పాల్వంచ బస్తీల అభివృద్ధి జరగాలంటే త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారు సిపిఐ ప్రజా సంఘాలలో బాధ్యతలు తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ సేలందించే పార్టీలనే ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ చేస్తున్న పోరాటాలను గుర్తించి వందలాది కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారమే ఏకైక ఎజెండా అని అందుకోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని చెప్పారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్వంచ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారని, అభివృద్ధిని పరుగులు పెట్టించటానికి ప్రత్యేక గ్రాంట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. కొందరి నాయకుల స్వార్థం కోసం గత 20 సంవత్సరాలుగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదన్నారు. దీనితో పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాల్వంచ, సుజాతనగర్, కొత్తగూడెంలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత కూనంనేనిదేనన్నారు. త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐని గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకుందామన్నారు. ఈనెల 18న, ఖమ్మం పట్టణంలో జరిగే సిపిఐ నూరేండ్ల ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు తండోపతండాలుగా తరలివచ్చి విజయవంతం చేయాలని సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, డి.సుధాకర్, ఇట్టి వెంకటరావు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్.గిరి, ఎస్ఎ.రహెమాన్, బివి. సత్యనారాయణ, ఆదినారాయణ, నాగమణి, కరీం, ఆలకుంట శోభన్, సిలువేరు చంద్రకళ, ఆశు బత్తుల రాణి, కమ్మచెచ్చు రాంబాబు, ఎస్‌కె.. రహీమ్, మద్దినేని పద్మ, మేల శ్రీను, నారపోగు నాగరాజు, జెట్‌పెట్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

## అణగారినవర్గాల కోసం త్యాగాలు

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే

సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అణగారిన వర్గాల కోసం ప్రాణాల అర్పించిన త్యాగాల చరిత్ర సిపిఐదని పార్టీ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. 18న ఖమ్మం జిల్లాలో నిర్వహించే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 30 వార్డులో జీపు జాతా అన్నివార్డులలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొరిమి రాజ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఖమ్మంలో కనీ విని ఎరుగని రీతిలో సిపిఐ వందేళ్ల ముగింపు సభ సుమారు 5 లక్షల మందితో పెద్దఎత్తున నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజాసమస్యలపై పేదల పక్షాన నిత్యం పోరాడేది ఎర్రజెండా పార్టీ అని అన్నారు. అధికారం లేకున్నా ప్రజల పక్షపాతిగా అసమానతలు లేని సమాజం కొరకు పోరాడుతుంది అన్నారు. రాబోయే కాలంలో ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలన్నారు. ఎర్రజెండా పార్టీలు ఒక వేదిక మీదికి రావాలని జనవరి 18న సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహిస్తున్నామని ఎర్రజెండా పార్టీలు ఏకమై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం సభకు జిల్లా నుండి పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, క్యాథరాజ్ సతీష్, జి.శ్రీనివాస్, నూకల చెంద్రమౌళి, కుడుదల వెంకటేష్, వేముల శ్రీకాంత్ పాల్గొన్నారు.




## విపత్తుల సమయంలో 'జనసేవా దళ్' కృషి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బోస్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** విపత్తులు, ఆపదల సమయంలో జనసేవా దళ్ కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనసేవా దళ్ శిక్షణా శిబిరాన్ని మేడ్చల్ జిల్లా నిజాంపేట మండలం షాపూర్ నగర్ హెచ్ఎంటి గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్‌లు హాజరై మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో అశాంతి చెలరేగిన సమయంలో జనసేవా దళ్ కార్యకర్తలు నిస్వార్థంగా అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తారని, రానున్న రోజుల్లో వారి బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభ సందర్భంగా పదిహేను వేల మంది కార్యకర్తలతో జనసేవా దళ్ కవాతును నిర్వహిస్తున్నామని, అందులో ఇక్కడి కార్యకర్తలు సైతం సన్నద్ధమై కవాతును విజయవంతం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు 42 దేశాల నుండి విదేశీ ప్రతినిధులు వస్తున్నారని, ఐదు లక్షల మంది కార్యకర్తలు వస్తున్నారని, దేశంలో, రాష్ట్రంలో ఉన్న ప్రజలకు కమ్యునిస్టు పార్టీ బలం కలిసి వచ్చి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మద్దతు తెలుపుతారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్ మాట్లాడుతూ కమ్యూనిజం బలహీన పడిందనే వారికి ఖమ్మంలో జరిగే బహిరంగ సభ ద్వారా కమ్యునిస్టుల బలం తెలుస్తుందన్నారు. డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా స్వచ్ఛందంగా లక్షలాది కార్యకర్తలు ఖమ్మంకు తరలివచ్చి ఎర్రవనాన్ని తలపిస్తారని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి మేడ్చల్ జిల్లా నుంచి వేలాది మంది కార్యకర్తలు, జనసేవా దళ్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించగా ఇన్‌స్ట్రక్టర్‌గా అనిల్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఏసురత్నం, శంకర్, హరినాథ్‌రావు, సత్యప్రసాద్, యాదగిరి, బాబు, నరసింహారెడ్డి, సల్మాన్, ప్రవీన్, బాబు, సహదేవరెడ్డి, వెంకటేశ్, స్వరూప, రాములు, కృష్ణ, రాములు, మహేందర్, శ్రీనివాస్, బకర మల్లేష్, భీమేష్, రవి, సామేల్, యాదగిరి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



## దేశ రాజకీయ చరిత్రలో సిపిఐది ప్రత్యేక స్థానం : ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** శతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు ఎంతోమంది రక్త తర్పణతో ఎన్నో విజయాలు సాధించి దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. వంద సంవత్సరాల ముగింపు సందర్భంగా 18న ఖమ్మం నగరంలో నిర్వహించే 'భారీ బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటివరకే ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ముందు వరుసలలో ఉంటారన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దుబ్బాక భాస్కర్, పార్టీ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, టంగుటూరు రాములు, బద్దుల సుధాకర్, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలపక్షాన 'ప్రజాపక్షం'పనిచేయాలి

బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/దుండిగల్ :** ప్రజాపక్షం నిరంతరం ప్రజాలపక్షన దినపత్రిక పనిచెయ్యాలని బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సరం కాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు ప్రజాపక్షాన నిరంతరాం పత్రికలు పనిచెయ్యాలని, ప్రజల సమస్యలను వెలికి తీసి అధికారులకు, ప్రభుత్వానికి చేరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజాపక్షం విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను తీరుస్తూ ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 294 డివిజన్ గండి మైసమ్మ డబల్ బెడ్‌రూమ్ సముదాయంలో బికెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 23వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బికెఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, నిరంతరం ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలు తీరుస్తూ కార్పొరేట్ స్థాయిలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే నా ఏకైక లక్ష్యం బస్తీలలో ఈ ఉచిత వైద్య సేవలు మరింత వేగవంతం చేస్తూ మీలో ఒకడినై మీ సమస్యలు తీరుస్తూ ఉచిత వైద్య సేవలు అందించడమే నా నా లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కావలి గణేష్, నాగేష్ నాగరాజు యాదవ్, వెంకటరమణ నాగరాజ్ యాదవ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## శ్రీ మడేలయ్య రజక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/జవహర నగర్ :** జవహర్ నగర్ డివిజన్ పరిధిలో శ్రీ మడేలయ్య రజక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘ అధ్యక్షుడు శనిగరం నరసింహ అధ్యక్షతన ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ నగర్ బిసిల ఐక్యవేదిక గౌరవ సలహాదారులు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ బిసిల ఐక్య వేదిక మారోజు సోమాచారి హాజరై మాట్లాడుతూ, రజకులు అందరూ బిసిల రాజ్యాధికారం అడుగులు వేయాలని, జవహర్ నగర్ లో బిసిల జనాభా ఎక్కువగా ఉంది కాబట్టి బిసిలు అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసిల ఐక్యవేదిక, కార్యదర్శి పాక దేవేందర్, ఆ సంఘ ప్రధాన కార్యదర్శి, ఓరుగంటి భాస్కర్, ఉపాధ్యక్షులు, కస్తూరి పల్లి రాములు, రాముల రమేష్, సలహాదారులు, బాలరాజు, ఎల్లయ్య, నరసయ్య, ఏ సుధాకర్, ఏం బాలరాజు, సభ్యులు, భాస్కర్, నరేష్, యాదగిరి, నాగరాజు, సాగర్, పవన్ కుమార్, ఏం రాములు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



## యాదవుల పురోగతికి సహకరిస్తా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రాజకీయంగా, సామాజికంగా ఎదగుతూ అన్ని రంగాల్లో పురోగతి సాధించే లక్ష్యంగా యాదవులు ఐక్యంగా ఉండాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపిచ్చారు. ఆదివారం నాచారంలోని ఎన్నార్ గార్డెన్స్‌లో నిర్వహించిన నూతనంగా ఎన్నికైన యాదవ సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సిద్ధించి 7 దశాబ్దాలు నాటినా యాదవుల్లో ఇప్పటికీ ఆశించిన ప్రగతి లేక పోవటం విచారించాల్సిన అంశమన్నారు. ఇప్పటికైనా దీన్ని అధిగమించేందుకు యువత చైతన్యులై రాజకీయాల్లోకి రావాలని, ఇతర బిసి సంఘాలను కలుపుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. సర్పంచుల పని తీరు మున్ముందు రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, దీని కోసం తన వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. యాదవ సంఘం రాష్ట్ర నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, కిరణ్ కుమార్ యాదవ్, రాములు యాదవ్, దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్, కృష్ణయాదవ్, ఈశ్వరిబాయి, అనిల్‌కుమార్ యాదవ్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడల్లో రాణించాలి

-ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడల్లో రాణించాలని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. అదివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని మిని స్టేడియంలో మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి క్రికెట్ కిట్, వాలీ బాల్, ఫుట్ బాల్, క్యారమ్స్, చెస్ ఆటలకు సంబందించిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిదిగా విచ్చేసిన బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. మూడుచింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజి ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజి వార్డు సభ్యులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, నాయకులు బస్వారెడ్డి, శశిధర్‌రెడ్డి, బాలకృష్ణ, రాము, యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

### సఫిల్‌గూడ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద

# ఆగంతకుడి దుశ్చర్య, తీవ్ర ఉద్రిక్తత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి సమీపంలోని సఫిల్‌గూడ కట్టమైసమ్మ దేవాలయ ప్రాంతంలో ఓ ఆగంతకుడు అమానుష చర్యకు పాల్పడిన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకొని పరిస్థితులు చేయిజారి పోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయటంతోపాటు నిందితుడిని ఆధీనంలోకి తీసుకొని కోర్టులో హాజరుపరచటం ద్వారా జైలుకు తరలించారు. పూర్వాపరాలిలా ఉన్నాయి. సఫిల్‌గూడ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న చారిత్రాత్మక కట్టమైసమ్మ ఆలయంలోకి శనివారం రాత్రి ఓ ఆగంతకుడు ప్రవేశించి అమ్మవారి విగ్రహం ముందున్న బొడ్రాయి వద్ద మల, మూత్ర విసర్జన చేయటాన్ని గమనించిన భక్తులు కొంత మంది అతడిని పట్టుకొన్నారు. అక్కడే ఉన్న కొంత మంది భక్తుల ద్వారా ఈ విషయం దావానలంలా వ్యాపించింది. దీంతో ఒక్కరొక్కరిగా సమీప ప్రాంతాల నుండి భక్తులు, హిందూ సంఘాల నేతలు ఆలయ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేయటంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. ఆగంతకుడి దుశ్చర్యతో ఆలయం అపవిత్రం అయ్యిందంటూ అతడిని దేహశుద్ధి చేశారు. శనివారం రాత్రంతా ఆలయ పరిసరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు, హిందూ సంఘాల



ప్రతినిధులు చేరుకోసాగారు.

**నిందితుడికి రిమాండ్ :** ఈ సమాచారం అందుకొన్న నేరేడ్‌మెట్ పోలీసులు హుటాహుటిన ఆలయ ప్రాంతానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయకనగర్ నుండి కట్టమైసమ్మ ఆలయం వరకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వచ్చిన వారిని వెనక్కి పంపించేశారు. నిందితుడిని కర్ణాటక రాష్ట్రం బీదర్ రాష్టానికి చెందిన అల్లాబక్ష్‌గా గుర్తించామని, అతడు గత కొద్ది కాలంగా నేరేడ్‌మెట్ ప్రాంతంలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని బిఎన్ఎస్ సెక్షన్లు 333,196(2), 298,299 కింద కేసు నమోదు చేసి ఆదివారం ఉదయం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచిన దరిమిలా రిమాండ్ విధించటంతో జైలుకు తరలించారు. ప్రజలు సంయమనం పాటించాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మరాదని కోరుతూ , ప్రజలను రెచ్చగొట్టే ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని పోలీసులు హెచ్చరించారు.

**కఠిన చట్టాలు తీసుకొని రావాలి : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

ఆలయంలో అమానుష సంఘటన జరిగిందన్న విషయం తెలిసినంతనే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలలు ఆదివారం కట్టమైసమ్మ దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్ర చర్యలు రాష్ట్రంలో ఇటీవలి కాలంగా నిత్యకృత్యమవుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇలాంటి దుశ్చర్యలు జరుగుతున్నాయన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, అవసరమైతే అతడిని ఎన్‌కౌంటర్ చేసినా తప్పులేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకొని రావాలని కోరారు.



## కొన్ని టివి చానల్స్ మంత్రుల ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయ్

తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పక్షం/వికారాబాద్:** కొన్ని ఆంధ్ర టివి చానల్స్ తెలంగాణ మంత్రుల ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డిసిసి అధ్యక్షులు ధారసింగ్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట అలాగే ఒక ఐఎఎస్ అధికారిపై ఆంధ్రకు చెందిన కొన్ని టివి చానల్స్ కావాలనే తప్పుడు వార్తలు ప్రసారం చేసి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా నిర్ధారణ చేయకుండా మంత్రులు, ఉన్నతాధికారులపై బురద జల్లడం జర్నలిజం కాదు అని తెలిపారు. అది రాజకీయ దుష్ప్రచారమన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఆంధ్రా ఛానల్ కావాలనే అసత్య కథనాలు ప్రసారం చేస్తోందని అన్నారు. ఇటువంటి తప్పుడు కథనాల వల్ల అధికారుల మనోధైర్యం దెబ్బతినడమే కాకుండా, ప్రజల్లో అనవసర అనుమానాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే ఆ ఛానల్ తప్పుడు వార్తలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ధారసింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహిపల్‌రెడ్డి పాల్గొన్నారు.



## ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్‌ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. జీడిమెట్ల డివిజన్ శ్రీకృష్ణ నగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డుని ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీలలో మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే తన బాధ్యతగా ముందుకువెళ్తున్నానని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే సిమెంటు రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా వంటి సదుపాయలను కల్పించానని, మిగిలిన బస్తీలు, కాలనీల్లో సైతం త్వరితగతిన వసతులను కల్పిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, నాయకులు హరిప్రసాద్, నరసింహులు, సత్యనారాయణ గౌడ్, కురుమూర్తి, చిరంజీవి, వీరంశెట్టి, సంపత్, గుమ్మడి మదుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నాగేష్, సమ్మయ్య, వినయ్, శ్యామ్, గణేశ్, బాల మల్లేష్, విజయ హరీష్, రాజు యాదవ్, జయం చారి, రమేశ్ పాల్గొన్నారు.

## హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** రైతులు మార్కెట్ చైర్మన్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు , వికారాబాద్ పట్టణంలోని రైతుబజార్ అవరణలో గల ఖాళీ స్థలంలో అయా గ్రామాలకు చెందిన రైతులు కురగాయలు విక్రయించుకుంటూరు. ఈ మధ్య కాలంలో రైతులు కాకుండా కూరగాయల వ్యాపారం చేసుకునే వారే ఎక్కువగా విక్రయించడంతో రైతులు పండించిన కూరగాయలు విక్రయించేకునేందుకు సరపడా స్థలం లేకు అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని గమనించిన వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి పాలకవర్గం మొదటి సమావేశంలో రైతులకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లేశం ,సభ్యులను రైతులు అభినందిస్తున్నారు. కాగా భవిష్యత్తులో సైతం ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా రైతుల పట్ల ఇదే విధానం అవలంభించాలని రైతులు కోరుతున్నారు.

# లింక్ రోడ్డును పరిశీలించిన కూన శ్రీశైలం గౌడ్

వెంటనే పునఃప్రారంభించాలని సూచన

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారంలోని కైసర్ నగర్‌కి ఆనుకుని ఉన్న ఎలీప్ ఇండస్ట్రీకి వెళ్లే రోడ్డుని పోలీసు విభాగం వారు మూసివేయడంతో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ పరిశీలించారు. రోడ్డు నుండి వెళ్లే ప్రయాణికుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కైసర్ నగర్ నుండి ప్రగతి నగర్ ఎలీప్ పారిశ్రామిక వాడ నుండి వెళ్లే రహదారిని పోలీసు విభాగం మూసివేయడం వలన ప్రయాణికులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. సుమారు ఇరవై సంవత్సరాల నుండి రాకపోకలు సాగించే ఈ రహదారిని ఆకస్మాత్తుగా మూసివేయడం సరికాదని తెలిపారు. గాజులరామారం, బాలయ్యనగర్, దేవేందర్ నగర్, మహదేవ పురం నుండి మూడు వేలకు పైగా ఉద్యోగాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఉద్యోగాలకు వెళ్లే వారిని దృష్టిలో పెట్టుకుని ఈ రహదారిని మళ్లీ



ప్రారంభించేలా చూస్తానని అన్నారు. విషయాన్ని ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లిలో బిజెపి జెండా ఎగురవేస్తాం

జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేస్తామని మున్సిపల్‌లోని అన్ని వార్డులను గెలిచి చైర్మన్ పీఠం కైవసం చేసుకుంటామని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్ హాల్‌లో మూడుచింతలపల్లి మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్ అధ్యక్షతన కార్యశాల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం అమరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు ఎప్పుడు ప్రకటించిన సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

తరుచు సమావేశాలు నిర్వహించుకుని ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులను గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చ నాయకుడు నరేందర్‌రెడ్డి, దయాకర్, ఓబిసి మోర్చ ప్రధాన కార్యదర్శి నాగరాజుచారి, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షులు మహేష్, విజయలక్ష్మి , పరమేష్, హన్మంతు, జగన్‌మోహన్‌రెడ్డి, కల్యాణి, వెంకటేష్‌నాయక్, సాయిబాబా, అరున్, సంతోష్, నరేష్, వీరేష్‌నాయక్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దేవేందర్, వెంకటేష్‌గౌడ్, సత్యనారాయణ, జగదీష్, బాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సర్పంచ్ సంగీత

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రతి ఒక్కరు ఇంటిని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గొట్టిముక్కల గ్రామ సర్పంచు సుద్దగళ్ల సంగీత అన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో అదవారం గ్రామ యువకులతో కలిసి శ్రమదనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరు గ్రామంలోని ప్రజలందరికి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థలు ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా కేవలం చేత్త బుట్టలో వేయాలన్నారు. పరిసరలను పరిశుభ్రంగా ఉంచకోకుంటే వ్యాదులు ప్రబలే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు ఇంటి ముందుకు వచ్చే టక్టర్‌లో వ్యర్థాలను వేయలన్నారు. యువత తలుచుకుంటే ఎదైన సదించవచ్చని అన్నారు. గ్రామ అభివృద్ధికి యువత ముందుకు రావలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు గోపాల్ , యువకులు పాల్గోన్నారు.

# ముగ్గుల పోటీలు – విజేతలకు బహుమతులు









**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సంక్రాంతి పండుగ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ నాగలక్ష్మి నగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు జరిగాయి. సమీప ప్రాంతాల నుండి మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్, సంక్షేమ సంఘం ప్రతినిధులు నగదు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారందరికి బహుమతులందచేసారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ సలహాదారులు పిజి సుదర్శన్, హమాలి శ్రీనివాస్, సిహెచ్ మల్లేష్, ఎం.రంగారెడ్డి, సాయికృష్ణ, కాలనీ అధ్యక్షుడు తోట నవీన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మాధవ్‌రెడ్డి, శివకుమార్, ప్రధాన కార్యదర్శి సి.కిషోర్, సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, కోశాధికారి ఎస్ నరేందర్‌రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

**జమ్మిగడ్డలో...** డా ఎస్సార్‌నగర్ డివిజన్‌లోని జమ్మిగడ్డ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి తెలంగాణా రాష్ట్ర సంక్షేమ రైతు కమిషన్ సభ్యురాలు మరికంటి భవానిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకొని ముగ్గుల పోటీల్లో విజేతలుగా ప్రథమ బహుమతిని సింగం నిహారిక, రెండవ బహుమతిని ప్రియాంక, మూడవ బహుమతిని లఖితలకు అందచేసారు.

**నాగారంలో రంగవల్లి పోటీలు**

**నాగారం :** జిహెచ్ఎంసి నాగారం డివిజన్ పరిధిలోని శ్రీగోపికృష్ణ కాలనీలో సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఎంతో అట్టహసంగా నిర్వహించారు.శనివారం సాయంత్రం చిన్నారులకు ఫాన్సీ డ్రెస్ పోటీలు, పిల్లలు ఎంతో ఉత్సహంగా సాంప్రదాయ దుస్తులు,స్వాంతంత్ర్య సమరయోధుల వేషధారణలు,ర్యాంప్ వాక్ చేశారు.ఆదివారం మహిళలకు రంగవల్లి ముగ్గులు పోటీలు నిర్వహించి న్యాయ నిర్ణేతలు మాజీ జెడ్‌పిటిసి రమాదేవి,మాజీ కౌన్సిలర్లు అన్నంరాజు సురేష్,కౌకుట్ల కృష్ణారెడ్డి విచ్చేసి మొదటి విజేత అశ్వినీకి పట్టుచీర,మెమోంటో, ద్వితీయ బహుమతి అనూషసందీప్‌కు సెమీపట్టుచీర,మూడవ బహుమతి శ్రావణికి ఫాన్సీ చీర,మెమోంటోలను అందజేశారు.పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రొత్సహక బహుమతులు అందజేశారు.

**మాజీ ఎంపిపి ఆధ్వర్యంలో....**

నాగారం పరిధిలోని ఈస్ట్ గాంధీ నగర్ కాలనీలో మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి,మాజీ ఎంపిపి స్వప్నల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు.ప్రథమ బహుమతికి 3 వేల రూపాయలు,ద్వితీయ బహుమతికి 2 వేల రూపాయలు,తృతీయ బహుమతికి వెయ్యి రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శౌర్యచక్ర శ్రీరామ్,మాజీ కోఆప్షన్ సభ్యులు ఆదం షఫీ,సత్యంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**పావనీ రెడ్డి ఆధ్వర్యంలో...**

**చర్లపల్లి :** ఎఎస్ రావునగర్ జమ్మిగడ్డలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిమణిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ రైతు కమిషన్ సభ్యురాలు మరికంటి భవాని రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతులు ప్రధానం చేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన రంగవల్లులను ఎంతో ఆకట్టుకున్నాయి. మహిళలు తమత్మ ప్రత్యేకతను చాటుకునేలా ఎంతో కష్టపడి ముగ్గులు వేశారని కమిటీ సభ్యులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ రాఘవరెడ్డి,అంజిరెడ్డి,లక్ష్మి నారాయణ, పత్తికుమార్,ప్రసాద్,షేర్ మణెమ్మపెంచల సురేందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డి.పోచంపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అనబోయిన మల్లేష్ యాదవ్, ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి పండుగ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. గత 12 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు అందించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకల సుధా,జిల్లా ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ మల్లేష్ యాదవ్, మోహన్ రెడ్డి, ప్రభాకర్, కథ శ్రీనివాస్ ముదిరాజ్, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ,పెద్దింటి సాయిలు, శ్రావణ్ గౌడ్, సందీప్ గౌడ్, నాగదీప్ గౌడ్, మానస్, వర్మ, శ్రవణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## అధికారుల నిర్లక్ష్యానికి పేదలు బలి

సిపిఐ నాయకులు రవీందర్ చారి



ప్రజాపక్షం/హయత్ నగర్: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి పేదప్రజలు బలి అవుతున్నారని సిపిఐ సీనియర్ నాయకులు ఆందోజు రవీందర్‌చారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ చిత్ర సీమా కాలనీకి చెందిన చేపూరి మంగమ్మను సహారాలో ఇంట్లోల పనిచేసే వస్తుండగా వీధి కుక్కలు కరిచి తీవ్రంగా గాయపరచాయని తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి బాధితురాలిని ఆందోజు రవీంద్రచారి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల నివారణలో అధికారులు విఫలమయ్యారన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన అధికారులు అలసత్వం వీడటం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, కందుల సుధాకర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ప్రతీక ముగ్గుల పోటీలు

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సంక్రాంతి పండుగకు ప్రతీక ముగ్గుల పోటీలు అని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని వీరాంజనేయ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీయడానికి ముగ్గుల పోటీలు ఉపయోగపడుతాయన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు కార్పొరేటర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, రామయ్య, రేహమాన్, భాదర్ బాషా, శివ శంకరయ్య, సత్యనారాయణరెడ్డి, రమేష్, అనిల్ కుమార్, సాయి శ్రీ వాత్సవ్, ఫణీంద్ర, శకుంతల, ప్రవీణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## సంప్రదాయాలను కాపాడుకోవాలి



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళల పాత్ర కీలకమని, రంగురంగుల ముగ్గులతో కాలనీ వీధులన్నీ పండుగ కళను సంతరించుకున్నాయని త్రిదండి అష్టాక్షరి జీయర్ స్వామి హర్షం వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ కోదండరామనగర్‌కాలనీ మహిళలకు ముగ్గుల పోటీలను కాంగ్రెస్ నాయకుడు కందికంటి ప్రేమ్‌నాధ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. త్రిదండి అష్టాక్షరి జీయర్‌స్వామి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బబ్బూరి ఆనంద్ గౌడ్, కుమ్మట్లపల్లి సత్యనారాయణ, వక్కలంక శ్రీనివాసరావు, రామేశ్వర్, రాజుగౌడ్, అనిల్, వికాస్, విజయలక్ష్మి, సమ్మయ్య పాల్గొన్నారు.

## మధురానగర్ నూతన కార్యవర్గం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: నాగోల్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీ అసోసియేషన్ హాల్లో అధ్యక్షులు బి.మల్లేష్ అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్జిని రత్నాకర్‌రావు కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపైన నివేదిక ప్రవేశపెట్టారు. కోశాధికారి ప్రదీప్ అసోసియేషన్ జమ ఖర్చులపై నివేదిక ఇచ్చారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కే.వి.నరసింహారెడ్డి కాలనీ అభివృద్ధికి స్వచ్ఛందంగా సభ్యులందరూ పాల్గొనాలన్నారు. అధ్యక్షుడిగా ఉజ్జిని రత్నాకర్ రావు, ఉపాధ్యక్షులుగా వి.ప్రదీప్, కార్యదర్శిగా తాడిశెట్టి చక్రధర్, కోశాధికారిగా బి.ప్రతాప్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జూలూరి నరేష్, సహాయ కార్యదర్శిగా కె. జగదీశ్వర్, సలహాదారులుగా బి.మల్లేష్, ఎంపిఎన్ భాస్కర్‌రావులను ఎన్నుకున్నారు.కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు రత్నాకర్ రావు తెలిపారు. 14న ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## పల్లెలను పట్టుసీమలుగా మార్చాలి



ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామీణ పల్లె సీమలను పట్టుసీమలుగా మార్చేదుకు సర్పంచులు కృషి చేయాలని పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా పరిషత్ హాల్లో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో జిల్లా సర్పంచులకు చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల నుండి సర్పంచులు తరలివెళ్లారు. సర్పంచుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా మధురాపూర్ గ్రామ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా అయ్యవారిపల్లి సర్పంచ్ గోటిక గోపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా మాధవ రాంరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనివాసనాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయాలని ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ అభివృద్ధి, సంక్షేమం వైపు ముందు చూపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సిపిఐ సర్పంచ్ మూడావత్ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల తరపునే నూతనంగా ఏర్పడిన గిరిజన తండాల పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యక్షుడు గోటిక గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం పెట్టి ఏకగ్రీవంగా ఎన్నుకున్న తాను అయ్యవారిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

# పోలీసులకు చిక్కిన '404 మంది మందుబాబులు'

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో..
వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 404 మందిని అదుపులోకి తీసుకొని, కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో 349 ద్విచక్ర వాహనదారులు, 24 ఆటో, 31 కారు డ్రైవర్లు ఉన్నారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 360 మంది 35 ఎంజి/100 ఎంఎల్ నుంచి 200 ఎంజి/100 ఎంఎల్ మధ్య, 32 మంది 201 ఎంజి/100 ఎంఎల్ నుంచి 300 ఎంజి/100 ఎంఎల్ మధ్య, 12 మంది 301 ఎంజి/100 ఎంఎల్ నుంచి 550 ఎంజి/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించినట్లు నిర్ధారించారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడమే మంచిదనీ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా నగర ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ తమ వంతు సహాయం పోలీసులకు కూడా అందించాలని కోరారు.

**మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరం...** మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని హైదరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.

## నేడు, రేపు జిహెచ్ఎంసి పరిధిలో..

# మెగా ఇ-వేస్ట్ శానిటేషన్ డ్రైవ్

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో జిహెచ్ఎంసి పరిధిలోని 300 వార్డుల్లో మెగా ఇ–వేస్ట్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ప్రకటించారు. ఈ డ్రైవ్ ద్వారా ప్రజలకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడంతో పాటు, నివాస, వాణిజ్య, ప్రజా ప్రాంతాల నుంచి ఇ–వేస్ట్‌ను సేకరించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేయనున్నట్లు చెప్పారు. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసిలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టివిలు, బ్యాటరీలు, యుపిఎస్‌లు, పవర్ బ్యాంకులు తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తారన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఏలు, ఎన్‌జిఓలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో తాత్కాలిక ఇ–వేస్ట్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. డ్రైవ్‌ను విజయవంతం చేయాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారులనను ఆదేశించామన్నారు. నగరవ్యాప్తంగా మైక్‌ల ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నట్టు తెలిపారు. నగర ప్రజలు తమ వద్ద ఉన్న ఇ–వేస్ట్‌ను ఇచ్చి ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కర్ణన్ కోరారు.

## ఘనంగా స్లేట్ దిస్కూల్ వార్షికోత్సవం



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : విద్యారంగంలో 25 ఏండ్ల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని పూర్తి చేసిన సందర్భంగా స్లేట్ – ది స్కూల్ తన సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్ నాంపల్లి లలితా కళాతోరణంలో జరిగిన ఈ వేడుకల్లో స్లేట్ ది స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్ మాట్లాడుతూ విద్యార్థులను మార్కులకే పరిమితం చేయకుండా, వారిలో ఆలోచించే శక్తి, విలువలు, జీవిత నైపుణ్యాలను పెంపొందించడమే తమ పాఠశాల లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

# బ్రిటీష్ పాలకులపై పోరాడిన ధీశాలి వడ్డె ఓబన్న

అదనపు కలెక్టర్ కదిరవన్ పలని




ప్రజాపక్షం/హైదరాబాద్ : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు వెలకట్టలేనివని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కదిరవన్ పలని కొనియాడారు. హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న 219వ జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్, ఇతర అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన రేనాడు ప్రాంతంలో జన్మించిన వడ్డె ఓబన్న, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో సైన్యాధ్యక్షుడిగా వీరోచితంగా పోరాడారని తెలిపారు. తొలి స్వాతంత్ర సమరయోడుడిగా వడ్డెర ఓబన్నకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. వడ్డె ఓబన్నఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి ఆశన్న, వివిధ కులసంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటయ్యే వరకు పోరాటం

ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం
బిఆర్ఎస్ ఎమ్మెల్యే
తలసాని శ్రీనివాస్ యాదవ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు విశ్రమించేది లేదని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనకాడబోమని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ బాలంరాయ్‌లోని లీ ప్యాలెస్‌లో ఆదివారం 'లష్కర్ జిల్లా సాధన సమితి' అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సికింద్రాబాద్ అస్థిత్వాన్ని, చారిత్రక వారసత్వాన్ని దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మనోభావాలతో ఆడుకుంటే సహించేది లేదని తలసాని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 17న 10 వేల మందితో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ఎం.జి. రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు నల్లబ్యాడ్జీలు, జెండాలతో భారీ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తలసాని ప్రకటించారు. చరిత్రకు ఆనవాలుగా ఉస్మానియా యూనివర్సిటీ, రాష్ట్రపతి విడిది చేసే అతిథి గృహం బొల్లారంలోనే ఉండటంతో పాటు, దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం, గాంధీ ఆస్పత్రి, మోండా మార్కెట్, నిజాం కాలంలో నిర్మించిన 120 అడుగుల క్లాక్ టవర్, ఆర్మీ క్యాంప్ కూడా సికింద్రాబాద్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని తెలిపారు. వీటి ఉనికిని కాపాడుకుంటామన్నారు. పునర్విభజన ప్రక్రియలో ప్రజలు, ప్రజాప్రతినిధుల తెలుసుకోకుండా, మనోభావాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కేవలం 'గూగుల్ మ్యాప్స్' ఆధారంగా డివిజన్‌లను విభజించడం దుర్మార్గమని విమర్శించారు. జిహెచ్ఎంసి మేయర్, డిప్యూటీ మేయర్‌లకు కూడా ఈ విభజనపై అవగాహన లేకపోవడం సిగ్గుచేటన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటన వచ్చే వరకు పార్టీలకు అతీతంగా ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, మద్దతు తెలిపే అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలను కలుపుకుపోతామన్నారు. ఉద్యమాన్ని దశల వారీగా ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహిస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ చైర్మన్ గజ్జెల నగేష్, బిఆర్ఎస్ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్, ముఠా జయసింహ, కార్పొరేటర్లు, కంటోన్మెంట్ మాజీ ప్రతినిధులు, వ్యాపార, వాణిజ్య, కార్మిక సంఘాల నేతలు పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు.

## శాస్త్రీయత లేని డివిజన్‌ల విభజన

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రజాపక్షం/సరూర్‌నగర్: డివిజన్‌ల విభజనలో శాస్త్రీయత లోపించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా డివిజన్‌లను విభజించి చేతులు దులుపుకుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అధ్యక్షతన గ్రీన్‌హిల్స్ కాలనీలో పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డివిజన్‌ల విభజన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం శివారు ప్రాంతాల కాలనీవాసులకు ఉచిత మంచినీరు ఎప్పుడు అందిస్తారని ప్రశ్నించారు. ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని డివిజన్ల విభజనలో కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందన్నారు. పన్నులు ఒకే విధంగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, మాజీ ఎంపిపి జిల్లెల కృష్ణారెడ్డి,, ఆర్‌కెపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, పటేల్ సునితారెడ్డి, ఊర్మిళారెడ్డి, రామాచారి, కొండ్రు శ్రీనివాస్, సాజీద్, రామ్ నర్సింహగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జాహిద్, శ్యాంగుప్తా, యుగేందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



# వైషమ్యాలు సృష్టించే వారిని దూరం పెట్టాలి

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: మతం పేరుతో రెచ్చగొట్టి ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని సమాజం నుంచి దూరం పెట్టాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాసపురం కాలనీలో ఏర్పాటు చేసిన మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మధుయాష్కీ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన హయత్ నగర్‌లో హిందూ ముస్లింలు అంతా కలిసి మెలిసి ఉండేవాళ్ళమని ఆయన తెలిపారు. అన్న, తమ్ముడు, మామ అనే వరుసలతో పిలుచుకుని ఆప్యాయంగా మెలిగే వారమన్నారు. కానీ కొన్ని చోట్ల రెచ్చగొట్టేలా అల్లర్లు సృష్టిస్తుంటారని, అలాంటి వారిని బహిష్కరించాలన్నారు. వనస్థలిపురంలో మైనారిటీ సోదరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నగర లో అభివృద్ధి జరగలేదని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధిక నిధులు మంజూరు అవుతూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, మహిళ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మైనారిటీ నాయకులు మక్సూద్, యూసుఫ్, సలీం, అసిఫ్, అబ్బాస్, సయ్యద్ రిజ్వాన్, కలీం కాలనీ నాయకులు హరేందర్‌రెడ్డి, శ్రీనాథ్, భాను, గణేష్‌రెడ్డి, విద్యారెడ్డి, శాలిని తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



ప్రజాపక్షం/హయత్ నగర్ : రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అన్నారు. మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సిరి హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి నూతన కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కమ్యూనిటి హాల్‌లో ఫ్లోరింగ్ పనులు, కరెంట్ స్తంభం, అదనపు గదులు నిర్మించాలని కోరారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటి హాల్ స్థలం కబ్జా కాకుండా కాపాడుకోవడం శుభ పరిణామం అన్నారు. శివారు ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇప్పటికే ట్రంక్ లైన్ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి, సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కోసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనిల్ కుమార్, రవీంద్రరెడ్డి, బానోతు శ్రీను, వెంకటేష్ గౌడ్, మురళి, సర్వేశ్వర చారి, వెంకటేష్ గౌడ్,స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జహంగీర్ ఫీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు పటిష్ట భద్రత : సిఐ నర్సయ్య



ప్రజాపక్షం/కొత్తూరు: పవిత్ర జహంగీర్ ఫీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు ప్రజాప్రతినిధులందరు సహకరించాలని కొత్తూరు సిఐ నర్సయ్య కోరారు. ఆదివారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో సిఐ నర్సయ్యను ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పోలీస్ బందోబస్తుపై చర్చించారు. ఈ సందర్భంగా సిఐ నర్సయ్య మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయినా జహంగీర్ ఫీర్ దర్గా ఉర్సు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇన్ముల్‌నర్వ ఉప సర్పంచ్ సిరాజ్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ పూర్తి సహకారం అంధించాలని కోరారు. ఆగీరు రవికుమార్‌గుప్తా, కాంగ్రెస్ నాయకుడు లింగం నాయక్, ఖాజా పాషా, వార్డుసభ్యులు రాజన్‌నాయక్, ఎల్.ప్రేమ్, రియాజ్, బాబు ముదిరాజ్, షోకత్, సదక్, చాకలి శ్రీకాంత్, జగన్, రాకేష్‌లు పాల్గొన్నారు.

## వడ్డెర ఓబన్నకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం అభినందనీయం

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: తొలి స్వాతంత్ర సమరయోదుడిగా వడ్డెర ఓబన్నకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా వడ్డెర స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు వడ్డే దేవేందర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లో వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డె దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఓబన్న జయంతి ఉత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. వడ్డెర ఓబన్న స్వాతంత్ర సమరంలో సైరా నర్సింహ్మారెడ్డితో కలిసి పోరాడిన మొదటి వ్యక్తి అని పేర్కొన్నారు. వడ్డెర కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని కోరారు. ప్రత్యేకంగా కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




## దాతల సహకారం అభినందనీయం



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్ మెట్: బండ రావిరాల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగులో ఉన్న వాటర్ ఫిల్టర్ సమస్యను పరిష్కరించి ఆదివారం గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ పాలకవర్గం కృషితో కొత్తగా వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. వాటర్ ఫిల్టర్ దాత దంటపల్లి శ్రీధర్ రెడ్డి మరియు సహకరించిన డైనో వరల్డ్ ఆధినేత ప్రశాంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సంధర్బంగా సర్పంచ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఫిల్టర్‌వాటర్ ఏర్పాటు అభినందనీయమన్నారు. పాత వాటర్ ఫిల్టర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేదని, సమస్యను పరిష్కరించి గ్రామప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని దాతల సహకారంతో ఈ వాటర్ ఫిల్టర్‌ను పాఠశాల బయట ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలోఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు నేమురగోముల మహేశ్, కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరి కృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవానిశివ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
12-01-2026
www.prajapaksham.in

> ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో ఇటీవల విడుదలైన రాజా సాబ్ సినిమాలో కొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేశారు. ఈనెల 9వ తేదీన కాపీలో ప్రభాస్ ఓల్డ్ గెటప్‌కు సంబంధించిన సన్నివేశాలను తీసేసి రిలీజ్ చేశారు. సినిమా విడుదల అనంతరం డివైడ్ టాక్ రావడంతో ఇప్పుడు కొత్త సన్నివేశాలు యాడ్ చేశారు. సినిమాపై వచ్చిన టాక్ నేపథ్యంలో కొత్త సన్నివేశాలు యాడ్ చేసినట్టు దర్శకుడు మారుతి, నిర్మాత విశ్వప్రసాద్ తెలిపారు.

రీల్

## అఖండ-2 చూసిన చిన జీయర్ స్వామి



బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో విడుదలైన నాల్గవ చిత్రం 'అఖండ–2'. త్రిదండి చినజీయర్ స్వామి, త్రిదండి అహోబిలం స్వామి వారు 400 మంది వేద పాఠశాల విద్యార్థులతో కలిసి హైదరాబాద్‌లో అఖండ–2 సినిమాని వీక్షించారు. బాలకృష్ణ రుద్రుడిగా చేసిన అఖండ తాండవాన్ని చూసిన తర్వాత దర్శకుడు బోయపాటి శ్రీనుని చిన జీయర్ స్వామి ఆశీర్వదించి సన్మానించారు. ఈ సందర్భంగా త్రిదండి చినజీయర్ స్వామి మాట్లాడుతూ ఎంతో బాధ్యతతో కూడిన చిత్రాన్ని తీశారని మీరు తీసిన ఈ చిత్రం ద్వారా హైందవ ధర్మాన్ని అందరికి అర్థమయ్యేలాగా, బలంగా చెప్పారని దర్శకుడు బోయపాటి శ్రీనుని ప్రశంసించారు.



## ఫుల్ ఫన్ రైడ్‌లా వుంటుంది..

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ

రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం, ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలతో హ్యూజ్ బజ్‌ను సృష్టించింది. ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ మా ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్, నేను కలిసి 13 సినిమాలు చేశాం. మా సినిమాలన్నీ దాదాపు హిట్ అయ్యాయి. ఈ సినిమాలో మా హీరోయిన్స్ చాలా అందంగా కనిపిస్తారు. నన్ను కూడా చాలా అందంగా చూపించాడు డీవోపీ ప్రసాద్ మూరెళ్ళ. తనతో తొమ్మిది సినిమాలు చేశాను. కొరియోగ్రాఫర్స్ శేఖర్, భాను కంపోజ్ చేసిన పాటలన్నీ కూడా సూపర్ హిట్ అయ్యాయి. ఫైట్ మాస్టర్ పృథ్వి ఇందులో ఎంటర్ టైనింగ్‌గా ఉండే ఫైట్లు కంపోజ్ చేశారు. ఈ సినిమా ఫుల్ ఫన్‌గా ఉంటుంది. జనవరి 13న భర్త మహాశయులకు విజ్ఞప్తి థియేటర్స్‌లో కలుద్దాం అన్నారు.

డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి బ్యానర్‌లో నా సినిమా ఖచ్చితంగా ఉంటుంది ఆయనతో పని చేయాలని కోరుకుంటున్నాను. మిరపకాయ వచ్చిన మిస్టర్ బచ్చన్ వచ్చిన ఒకేలా ఉండే వ్యక్తి మాస్మహారాజా రవితేజ. స్థితప్రజ్ఞత కలిగిన వ్యక్తి. ఆ క్వాలిటీ పవన్ కళ్యాణ్ లో తర్వాత రవితేజ లో చూశాను చెప్పారు. డింపుల్ హయాతి మాట్లాడుతూ.. డైరెక్టర్ హరీష్ శంకర్‌ని ఇక్కడ చూడడం చాలా ఆనందంగా ఉంది ఈ సినిమా కూడా బొమ్మ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమాలో నేను చేసిన బాలమణి క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. చాలా కొత్తదనం ఆడియన్స్ ఫీల్ అవుతారు. హీరోయిన్ ఆశిక రంగనాథ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది అద్భుతమైన జర్నీ. మా నిర్మాత సుధాకర్‌కి థాంక్యూ సినిమాని చాలా అద్భుతంగా నిర్మించారు. రవితేజ తో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది అన్నారు. నిర్మాత సుధాకర్ మాట్లాడుతూ.. ఈ సినిమా ఖచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మంచి క్యారెక్టర్లు దక్కాయి..

- సంయుక్త

శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారి నారి నడుమ మురారి'. 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సంయుక్త మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. సంక్రాంతి చాలా పెద్ద పండుగ. సంక్రాంతికి వచ్చే ప్రతి సినిమాకి మంచి ఆదరణ ఉంటుంది. నారి నారి నడుమ మురారి చాలా క్లీన్ కామెడీ ఎంటర్టైనర్. పండుగకి పర్ఫెక్ట్ మూవీ. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. వెరీ బ్యూటిఫుల్ స్టోరీ. నాకు కామెడీ సినిమా చేయడం చాలా ఇష్టం. ఇందులో నా క్యారెక్టర్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఇద్దరు హీరోయిన్స్ ఉన్నప్పుడు ఆడియన్స్ సహజంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ ఇది అలా కాదు. డైరెక్టర్ చాలా యూనిక్ పాయింట్ తో ఈ కథ రాశారు. అది మీరు స్క్రీన్ మీద చూడాలి. ఈ సినిమాకి నేనే డబ్బింగ్ చెప్పాను. చాలా ఎంజాయ్ చేశాను. శర్వానంద్ చాలా అద్భుతమైన టైమింగ్ ఉన్న హీరో. చాలా సపోర్టివ్, హెల్ప్ ఫుల్‌గా ఉంటారు. ఆయనతో పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. ఇందులో నరేష్, సత్య పాత్రలు కూడా అందరినీ అలరిస్తాయి. డైరెక్టర్ చాలా కూల్ గా ఉంటారు. ఇంత కాంపిటీషన్లో సినిమా వస్తున్న ఆయనకు ఎలాంటి ఒత్తిడి ఉండదు. ఎప్పుడు చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఆయన కోపంలో ఉన్నట్లు ఎప్పుడు చూడలేదు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. సాక్షి వైద్య , నాకు మధ్య మంచి కాంబినేషన్ సీన్లు ఉన్నాయి. తనంటే నాకు చాలా గౌరవం. తను ప్రతి సీన్ కి ప్రిపేర్ అయ్యే విధానం చాలా బాగుంటుంది. చాలా హార్డ్ వర్క్ చేస్తుంది. ఇప్పుడు వరకు వైవిధ్యమైన పాత్రలు చేశాను. నా ప్రతి సినిమాకి వైవిధ్యం ఉంటుంది. నాకు అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంటుంది. బయోపిక్స్ చేయాలని కూడా ఉంది. అలాగే కామెడీ క్యారెక్టర్స్ కూడా చేయాలనే ఉంది. పూరి జగన్నాథ్‌తో వర్క్ చేశాను. అది ఫెంటాస్టిక్ ఫిలిం. ఎంత చెప్పినా తక్కువే. యాక్టింగ్ షూటింగ్ ప్రాసెస్ ని చాలా ఎంజాయ్ చేశాను. ఎక్కడున్నా అక్కడ ప్రతి పండుగ జరుపుకోవడం అనేది నాకు అలవాటు. అందరూ కూడా మంచి పిండి వంటకాలు మా ఇంటికి పంపిస్తారని కోరుకుంటున్నాను. బ్లాక్ గోల్డ్ సినిమా ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తి కావచ్చు. సినిమా చాలా బాగా వస్తోంది

## 'పురుష:' టీజర్ రిలీజ్



భార్యాభర్తల కథలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది. ఇక అందులో కాస్త కామెడీ జోడించి, రియాలిటీకి దగ్గరగా చూపిస్తే ఆ సినిమా పక్కా సూపర్ హిట్. అలాంటి ఫ్యామిలీ కథతో వినూత్నంగా ఎంటర్‌టైన్ చేయడానికి ప్రస్తుత తరానికి తగ్గట్టుగా ట్రెండీ మేకింగ్‌తో 'పురుష:' సినిమా రాబోతోంది. పెళ్లి తర్వాత పురుషులు పడే అవస్థలు చూపిస్తూనే భార్యల ఇంపార్టెన్స్ ఏంటనేది ఈ సినిమాలో చూపించనున్నారు. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు ఈ 'పురుష:' సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం అవుతుండగా.. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌తో పాటు సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ముఖ్య పాత్రలలో కనిపించనున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. కేవలం పోస్టర్లు, ఫస్ట్ లుక్స్‌తోనే జనాల్లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 'పురుష:' టీజర్ వదిలారు. ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా ఈ టీజర్ రిలీజ్ చేశారు. ఈ వీడియో చూసిన బుచ్చిబాబు సానా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని చెప్పారు. అలాగే చిత్ర యూనిట్ మొత్తానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. టీజర్ విషయానికొస్తే.. ప్రతి సీన్ లో కామెడీ టచ్ ఉండేలా చూసుకున్నారు. ఏ దినము చూసినా షాపింగ్.. షాపింగ్.. షాపింగ్.. అది మా దినముకి వచ్చుచున్నది అంటూ సప్తగిరి చెప్పిన డైలాగ్ నేటితరం భార్యాభర్తల తీరును చెప్పేలా ఉంది. మగజాతి గర్వించదగ్గ ఆణిముత్యాలండీ మీరు.. అని పేర్కొంటూ టీజర్ ముగించారు.



## సరికొత్త వినోదాన్నిచ్చే చిత్రం

- మీనాక్షి చౌదరి

నవీన్ పొలిశెట్టి హీరోగా నటించారు. ఈ. నేపథ్యంలో తాజాగా కథానాయిక మీనాక్షి చౌదరి, మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. గుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు ఇలా వరుసగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని సంక్రాంతి విజయాన్ని అందుకున్నాను. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకుంటాననే నమ్మకం ఉంది. ఈ సినిమాలో నా పాత్ర పేరు చారులత. సంపన్న కుటుంబంలో పుట్టిన తండ్రి గారాల పట్టి లాంటి పాత్ర. ఇంట్లో యువరాణిలా పెరుగుతుంది. చాలా మంచి అమ్మాయి. అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. క్యూట్‌గా బిహేవ్ చేస్తుంది. నన్ను పూర్తి కామెడీ పాత్రలో చూడబోతున్నారు. ఇది చాలా భిన్నమైన పాత్ర. భీమవరం బాల్మా, రాజు గారి పెళ్ళిరో లాంటి క్యూట్ మాస్ డ్యాన్స్ నెంబర్స్ ఈ సినిమాలో ఉన్నాయి. సాధారణంగా నేను డ్యాన్స్ చేయడానికి సిగ్గుపడుతుంటాను. గోదావరి ప్రాంతంలో చిత్రీకరణ చాలా బాగుంది. అక్కడి ప్రజలు బాగా చూసుకున్నారు. ఎన్నో వంటకాలు తిన్నాను. ఆలయాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను సందర్శించాను. అక్కడి ప్రజలు సినిమా అంటే ప్రత్యేక అభిమానం చూపిస్తుంటారు. గోదావరి ప్రాంతంలో షూటింగ్ అనుభూతిని ఎప్పటికీ మరిచిపోలేను. కథల ఎంపిక నా దృష్టిలో కథే హీరో. కథ ఎలా ఉంది?, దర్శకుడు ఆ కథను, అందులోని పాత్రలను ఎలా చూపించబోతున్నారు అనేది ఆలోచిస్తాను. హీరో ఎవరనేది ముఖ్యం కాదు. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తాను. ఈ పాత్ర నా కెరీర్‌కి ఎలా ఉపయోగపడుతుంది అనేది చూస్తాను. సినీ ప్రయాణం నా దృష్టిలో సినీ ప్రయాణం అనేది ముగింపు లేని పరుగు పందెం లాంటిది. కొత్త కొత్త వాళ్ళు వస్తూ ఉంటారు. నాగ చైతన్యతో వృషకర్మ సినిమా చేస్తున్నాను. మరికొన్ని ఆసక్తికర కథలు కూడా ఉన్నాయి. ఆ చిత్రాలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు త్వరలో వస్తాయి.

## 'ఓ..సుకుమారి' ఫస్ట్ లుక్

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ చిత్రాలు 'ప్రీ వెడ్డింగ్ షో', 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ. సుకుమారి' చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. ఐశ్వర్య రాజేష్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. దామినిగా ఆమె స్పిరిటెడ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. రంగురంగుల హాఫ్‌సారీలో, చేతుల్లో కర్రలు పట్టుకున్న గ్రామస్థుల నుంచి తప్పించుకుంటూ పరుగులు తీస్తూ, ఆమె ధైర్యం, చలాకీతనంతో పల్లెటూరి అమ్మాయిగా అద్భుతంగా కనిపించింది.



## పూల మార్కెట్‌లో వసతులేవీ?

### రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి అసంతృప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్: గుడి మల్కాపూర్ పూల మార్కెట్‌లో కనీస వసతులు, నిర్వహణ పట్ల రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల కంటే దళారులే మార్కెట్‌లో ఎక్కువగా వ్యాపారం చేస్తున్నారని, మార్కెట్ అధికారులు అక్రమ లైసెన్స్ జారీ చేయడాన్ని, మార్కెట్‌లో ఖాళీ స్థలం ఉంటే అమ్ముకునేందుకు అనుమతులు ఇవ్వడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను కోదండరెడ్డి ఆదివారం ఆకుస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌ను కోదండరెడ్డి పర్యటించి, స్థానికంగా ఉన్నవారితో మాట్లాడారు. మార్కెట్ చుట్టూ ఉండే ప్రహరీ గోడ కూలిపోవడం, మార్కెట్ అంత మురుగు నీటితో నిండిపోయి ఉండడాన్ని గమనించిన కమిషన్ బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వర్ష కాలంలో మార్కెట్ పరిస్థితి మరింత దారుణమని అక్కడికి వచ్చిన వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. పూల మార్కెట్ పూర్తిగా వ్యాపారుల చేతుల్లోనే ఉందని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా రైతులు రోడ్లపై అమ్ముకుంటే వ్యాపారాలు మాత్రం మార్కెట్ లోపల మడిగెల్లో విక్రయించుకోవడాన్ని చూసి కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తనిఖీ చేసిన సమయంలో మార్కెట్ కార్యదర్శి, అధికారులు, సిబ్బంది అందుబాటులో లేరు. మార్కెట్ నిర్వహణ రికార్డులు బీరువాలో పెట్టుకుని తాళం వేసుకొని వెళ్లారు. మరి కొందరు అధికారులు సెలవులో ఉండడాన్ని కమిషన్ గుర్తించింది. గతంలో బోయిన్ పల్లి మార్కెట్‌లో కూడా ఇదే పరిస్థితి చూసిన కమిషన్, మార్కెట్ కు వచ్చే రైతుల పరిస్థితి బాగాలేదని, కానీ కమీషన్ ఏజెంట్, వ్యాపారి, అధికారులు బాగానే ఉన్నారని అభిప్రాయపడింది. దీంతో గుడిమల్కాపూర్ మార్కెట్ల తీరుపై కోదండరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రైతు ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన మార్కెట్లు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. మార్కెట్ కు వచ్చే రైతుకు లాభం జరిగేలా కనిపించడం లేదని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



## గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



### జాతీయస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి

### 29 రాష్ట్రాల నుంచి 79 జట్ల హాజరు

ప్రజాపక్షం/కాజీపేట : రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా జాతీయస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల 58వ ఖోఖో పోటీలు ఉమ్మడి వరంగల్ లోని కాజీపేటలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర మంత్రులు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు క్రీడా మైదానాలు, మినీ స్టేడియంల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యము చేసిందని, తమ ప్రభుత్వం క్రీడల బడ్జెట్‌ను పెంచేందుకు ప్రయత్నం చేస్తుందని చెప్పారు. కాగా ఐదు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సంఘ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి తెలిపారు. భారత ఖోఖో ఫెడరేషన్ సౌజన్యంతో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా 58వ జాతీయస్థాయి ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి సీనియర్స్ మహిళలు పురుషుల ఖోఖో పోటీలలో దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, రైల్వే, ఎయిర్ పోర్టు అథారిటీ, ఆల్ ఇండియా పోలీస్, కేంద్ర బెటాలియన్స్ నుంచి 40 పురుషుల జట్లు, 39 మహిళల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఖోఖో పోటీల ప్రారంభోత్సవాలకు సూచికగా కాజీపేట ఫాతిమా బ్రిడ్జి నుంచి రైల్వేస్టేడియం వరకు 2వేల మంది క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, దొంతి మాధవ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అజీజ్ ఖాన్, వివిధ రాష్ట్రాల ఖోఖో అసోసియేషన్‌ల ప్రతినిధులు, రాష్ట్ర జిల్లా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## పక్కదారి (మొదటి పేజీ తరువాయి)

ఐదు సంవత్సరాల లావాదేవీలపై ఆడిట్ నిర్వహిస్తే, మొత్తం రూ.52 లక్షల లావాదేవీలలో 4,800 లోపాలు గుర్తించామని, ఇందులో దాదాపు 3000 లోపాలు రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో ఉన్నాయని, దీనికి సంబంధించిన మొత్తాన్ని తప్పకుండా రికవరీ చేస్తామని వెల్లడించారు. ధరణి పోర్టల్ అమలులోనికి వచ్చినప్పటి నుంచి గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అన్ని లావాదేవీలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఆడిటింగ్ నిర్వహించాలని, అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ప్రభుత్వానికి రావాల్సిన ఒక్క పైసా సొమ్ము దుర్వినియోగం చేసినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. మంత్రుల సముదాయంలోని తన నివాసంలో రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. జనగాం తదితర ప్రాంతాల్లో బయటపడిన స్టాంప్ డ్యూటీ సొమ్ము చెల్లింపుల్లో అక్రమాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన ఆడిటింగ్‌లో భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు చెల్లించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చలాన్ సొమ్మును పక్కదారి పట్టిన విషయాన్ని రెవెన్యూ యంత్రాంగం గుర్తించిందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడిన ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌లో ఆడిటింగ్ విధానం లేకపోవడమే అక్రమాలకు ప్రధాన కారణమని తాము ప్రాథమికంగా గుర్తించినట్టు వివరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి, లోతైన విచారణ జరిపించి బాధ్యులపైన చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా?, లేదా అనే అంశంపై కూడా లోతైన విచారణ జరపాలని, ఎవరైనా తప్పు చేసినట్టు తేలితే ఎంత పెద్ద వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సొమ్ముతో ఆడుకున్న వారిని చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటి అక్రమాలకు ఇకపై తావు ఉండబోదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



## హుష్‌కాకి (మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఢిల్లీలో మరో ఘటన వెలుగు చూసింది. వృద్ధ దంపతులు సైబర్ మాయగాళ్ల వలలో చిక్కారు. 17 రోజులు డిజిటల్ అరెస్టులో ఉండి.. జీవితకాలం దాచుకున్న సుమారు రూ.15 కోట్లను పోగొట్టుకున్నారు. ఈ ఘటన తాజాగా ఢిల్లీలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డా. ఓం తనేజా ఆయన భార్య డా. ఇందిరా తనేజాలు 48 ఏళ్లు ఐక్యరాజ్యసమితిలో సేవలందించారు. రిటైర్ మెంట్ అనంతరం 2015లో భారత్‌కు వచ్చారు. గత డిసెంబర్ 24న.. ఆ దంపతులకు పోలీసు అధికారులమంటూ.. సైబర్ నేరగాళ్ల నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. వారిపై పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, అరెస్టు వారెంట్లతో ఆ దంపతులను బెదిరించారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 10 వరకు డిజిటల్ అరెస్టు చేస్తున్నామని వీడియో కాల్‌లో హెచ్చరించారు. ఆ సమయంలో ఆ దంపతుల నుంచి రూ.14.85 కోట్లను కాజేశారు. అనంతరం సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే ఆర్‌బిఐ ఆదేశాల మేరకు డబ్బులు తిరిగి వస్తాయని స్కామర్లు వారికి సూచించారు. దీంతో వృద్ధ దంపతులు పోలీసుస్టేషన్‌కు వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారిపై ఎలాంటి అరెస్టు వారెంట్లు లేవని.. సైబర్ మాయగాళ్లు మోసం చేశారని ఆ దంపతులు తెలుసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 600 ఖాతాలు డిలీట్

(మొదటి పేజీ తరువాయి)

అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై చర్యలు తీసుకుంది. భారత ప్రభుత్వం సీరియస్ వార్నింగ్ ఇచ్చిన వెంటనే రంగంలోకి దిగిన 'ఎక్స్' ఏకంగా 3,500 అశ్లీల పోస్టులను బ్లాక్ చేసింది. అంతేకాదు, ఇలాంటి వక్రబుద్ధి కలిగిన పనులు చేసిన 600 మంది యూజర్ల ఖాతాలను శాశ్వతంగా డిలీట్ చేసింది. భారత చట్టాలకు లోబడి పని చేస్తామని, ఇకపై ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని కేంద్రానికి లిఖితపూర్వక హామీ ఇచ్చింది. కొద్ది రోజులుగా 'ఎక్స్' వేదికగా ఒక ఆందోళనకరమైన ధోరణి మొదలైంది. మస్క్ తీసుకొచ్చిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్ 'గ్రోక్'ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. మహిళల సాధారణ ఫొటోలను తీసుకుని, వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేస్తున్నారు. గ్రోక్ సాయంతో నగ్న చిత్రాలను సృష్టిస్తున్నారు. ఈ చిత్రాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. దీనిపై మహిళా లోకం భగ్గుమంది. ఇది మహిళల ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయమని ఆందోళన వ్యక్తమైంది.

### కేంద్రం కొరడా, 72 గంటల గడువు

విషయం గమనించిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత వారం 'ఎక్స్' ఇండియా చీఫ్ కంప్లయన్స్ ఆఫీసర్‌కు నోటీసులు పంపింది. 'మీ ప్లాట్‌ఫామ్‌లో అశ్లీలత పెరిగిపోతోంది. ఎఐని వాడి నగ్న చిత్రాలు సృష్టిస్తున్నారు. వెంటనే దీనిని అడ్డుకోవాలి. మీరు తీసుకున్న చర్యలేంటో మాకు నివేదిక ఇవ్వాలి. దీనికి మీకు ఇస్తున్న సమయం కేవలం 72 గంటలు' అని కేంద్రం డెడ్‌లైన్ విధించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను హోస్ట్ చేసినా, షేర్ చేసినా ఊరుకోబోమని హెచ్చరించింది.

### తప్పు ఒప్పుకున్న 'ఎక్స్'

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఎక్స్ యాజమాన్యం తమ తప్పును అంగీకరించింది. కంటెంట్ మోడరేషన్ విషయంలో లోపాలు జరిగాయని ఒప్పుకుంది. భారతీయ చట్టాలను కచ్చితంగా పాటిస్తామని మాటిచ్చింది. వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టి 3500 అశ్లీల చిత్రాలను, వీడియోలను తొలగించింది. వాటిని అప్‌లోడ్ చేసిన, షేర్ చేసిన 600 ఖాతాలను తొలగించింది.

## ప్రజలదే పెత్తనం

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం ద్వారానే ప్రపంచం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని సూచించారు.''భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం'' (ఇస్కఫ్) తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభ హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు ఇస్కఫ్ రిసెప్షన్ కమిటీ అధ్యక్షుడు, హైకోర్ట్ న్యాయవాది కడారు ప్రభాకర్ రావు అధ్యక్షత వహించారు. జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, ఇస్కఫ్ నేషనల్ ప్రేసిడియం మెంబర్, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా సదస్సు ప్రారంభోపన్యాసం చేశారు. ఆర్‌టిఎ మాజీ జాయింట్ కమిషనర్ సి.ఎల్.ఎన్. గాంధీ హాజరయ్యారు.
ఈ సందర్భంగా జస్టిస్ జి.రాధారాణి మాట్లాడుతూ.. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో తలెత్తిన సంక్షోభాలను ఉదాహరణగా చూపుతూ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతామని అగ్రరాజ్యాలు తమ ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం కోసం ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఒక దేశ అధ్యక్షున్ని ఆ దేశానికి వచ్చి తీసుకుపోవడం ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన 'అలీన విధానం' వల్ల అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు ఏకమై తమ ఉనికిని చాటుకున్నాయని గుర్తు చేశారు. అలీన విధానాన్ని అనుసరించి ప్రపంచానికే భారతదేశం ఆదర్శంగా నిలిచిందని, మానవళి, ప్రపంచ శాంతి కోసం, అణ్వాయుధ అంతం కోసం భారతదేశం కృషి చేసిందని వివరించారు. శాంతి, సహకారం అనే ప్రాతిపదికన ఏర్పడిన భారతదేశం ఒక పుష్పగుచ్ఛం లాంటిదన్నారు. భారత దేశ ప్రజలను సమీకరించి, చైతన్యపర్చడంలో ఆనాడు ఇస్కస్, ప్రస్తుత ఇస్కఫ్ కృషి చేస్తుందని, ప్రపంచంలో నెలకొన్న ఉద్రిక్తతలను తక్షణమే తొలగించి,శాంతియుత వాతారణాన్ని కల్పించేందుకు ఇస్కఫ్ చేసే కృషి అభినందనీయమని జస్టిస్ రాధారాణి అన్నారు.
సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అగ్ర రాజ్యాల పెత్తనం, సామ్రాజ్యవాద పోకడలు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కోవడానికి ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. వెనిజులాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షున్ని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. క్యూబా, గ్రీన్ లాండ్‌ను కూడా అమెరికా బెదిరిస్తున్నదని,భారతదేశంపై కూడా అదనపు పన్నుల రూపంలో ఒత్తిడి తెచ్చే ప్రయత్నం జరుగుతోందని, అయినప్పటికీ భారత్ ఎన్నడూ ఎవరికీ తలవంచలేదని అజీజ్‌పాషా స్పష్టం చేశారు. 1941లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వేసిన పునాదులతో ప్రారంభమైన ఈ సంస్థ, నాటి నుంచి నేటి వరకు అంతర్జాతీయ శాంతి కోసం కృషి చేస్తోందని వివరించారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత 'ఇస్కాఫ్'గా రూపాంతరం చెంది,రష్యాతో పాటు నేపాల్, శ్రీలంక, వియత్నాం వంటి దేశాలతో సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరుస్తోందని తెలిపారు.
సి.ఎల్ ఎన్. గాంధీ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచ రాజకీయా పరిణామాలు ప్రమాదకరంగా మారాయని, ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోవియేట్ యూనియన్‌తో భారతదేశం స్నేహ సంబంధాలు కొనసాగించిందని, ఆ సంప్రదాయాన్ని ఇస్కఫ్ కొనసాగించాలని కోరారు.
కడారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ శాంతి కోసం,మానవాళి మధ్య సంబంధాలను కొనసాగించేందుకు ఇస్కఫ్ ప్రయత్నిస్తుందన్నారు. భారతదేశంలోని వైవిధ్యంలో ఐక్యతను సాధించేందుకు, భిన్నసంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. వేర్పాటు వాద శక్తులు, టెర్రరిస్టులు, యుద్దోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఇస్కఫ్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, కార్యదర్శి రాజశేఖర్, న్యాయవాది బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com